09318
CP035 112
C 56
2458

శ్రీ ఆంధ్ర రత్న దుగ్గిరాల

(ఆంధ్రరత్న గోపాలకృష్ణుని జీవిత

రచన:

కే. కే. బసవరాజు అప్పారావు

920
A 64

1 — 1963


Blank Page

శ్రీ ఆంధ్రరత్న ద్యుతులు

(ఆంధ్రరత్న గోపాలకృష్ణుని జీవితం)

రచయిత్ర :

తి॥ వే॥ బసవరాజు అప్పారావు



హక్కులు మావి

ప్రథమ ముద్రణ
1963

వెల 2-50

ముద్రణ
నిర్మలా ప్రింటర్స్.

౧

తొలినుడి

శ్రీ బసవరాజు అప్పారావుగారు ఆంధ్రరత్న మిత్రులలో నగ్రగణ్యులు. గోపాలకృష్ణునివలెనే యాతడును సారస్వత ప్రియుడు. రసికుడు. స్వాతంత్ర్యాభిలాషి. చిరకాలము ఆంధ్ర రత్నముతో నాతనికి సన్నిహిత పరిచయ ముండెడిది. ఉభయులు తరుచు రస గోష్ఠి సలుపుచుండుట నే నెరుగుదును.

శ్రీ అప్పారావుగారు "ఆంధ్రరత్నద్యుతు" లను గ్రంథమును గోపాలకృష్ణులు కారాగారమున నున్న కాలమునసే సంకల్పించి రచించిరి. శ్రీ గోపాలకృష్ణయ్యగారి మరణానంతరమే ఆంధ్రరత్న రచయిత యితర వాఙ్మయముతో పాటు యీ గ్రంథమును నాకు వప్పజెప్ప బడినది. 1936 సం॥ములో నా తెనుగు "గోష్ఠి" పత్రికలో యిందు గొన్ని ప్రకరణములను బ్రచురించితిని. ఇప్పుడు ఉదయ భాస్కర్ పబ్లిషర్సువా రీ గ్రంథమును పూర్తిగ బ్రచురించుట ముదావహము.

"ఆంధ్రరత్న ద్యుతులు" గోపాలకృష్ణుని జననాది (1889 సం॥రము) 1921 సం॥రము వరకు ఆతని జీవితచరిత్రను బోధించును.

గోపాలకృష్ణుని జీవితచరిత్రను ఆతని జైలు విమోచనమునకు (1922) బూర్వము తత్పరమునని రెండు భాగము

లుగ విభజింపవచ్చును. ఇందలిపూర్వ భాగములో యాతని విద్యారంగమును, రాజకీయ పాత్రయు హెచ్చుగ నుండును. ద్వితీయ భాగమందు రాజకీయములతోపాటు, రాజకీయముల కంటె మిన్నగ, ధర్మప్రబోధము హెచ్చుగ ప్రస్ఫుటించును. ఈ రెండవభాగమందే యాతని సర్వమానవ బ్రాహ్మణ ధర్మ ప్రచారమంతయు ఇమిడి యుండును. అట్టి ధర్మ ప్రవక్త యొక్క అవతరణమునకే "ఆంధ్ర రత్న ద్యుతులు" నాంది యని చెప్పవచ్చును. అట్టి చరిత్రకు సంబంధించిన పెక్కు ఘట్టములను సమకాలికుడును, మిత్రసత్తముడు, సారస్వత ప్రియుడునగు శ్రీ అప్పారావుగారు ఆ నాడే రచించి మన కంద జేయుట ఆంధ్రుల భాగ్యము.

గత యేభై ఏండ్ల ఆంధ్ర ప్రజా జీవితమందును "వీర" శబ్దమున కర్హులగు వారిలో శ్రీయుతులు ఆంధ్ర రత్నము అల్లూరి సీతారామరాజు, పొట్టి శ్రీరాములు, త్రిమూర్తులని నా యభిప్రాయము. వీరిలో ఆంధ్ర రత్నము ధర్మవీరుడు, సీతారామరాజు రాజకీయశూరుడు, శ్రీరాములు శ్రీ గాంధీ పథములో సత్యాగ్రహయోధుడు. వారి జీవిత చరిత్రలు ఆంధ్రలోకమునకు చిరస్మరణీయములు. సదా పఠనీయములు.

"గోపాలకృష్ణ డొక్క ఆంధ్రరత్నము మాత్రమే కాదు-ఆతడు యావదాభరత రత్నమే" నని 1922 సం॥లో నొక ప్రముఖ తమిళనాయకు డనెను. అట్టి మహనీయుని జీవిత మహత్వ మెట్టిదో మన మించుక గ్రహించుట యవసరము.

మన రాజ్యము "రామ రాజ్యము" (ఇప్పటివలె "మర రాజ్యము" నకు భిన్నము) గ నుండవలెనని ప్రప్రథమమున సూచించినవాడు మన ఆంధ్రరత్నము. ఆ లక్ష్యమును తదుపరి స్వీకరించినవాడు శ్రీ గాంధి మహాత్ముడు. ఇటులనే కాంగ్రెసు జెండాపై శ్రీ గాంధిమహాత్ముడు "చర్ఖా" (రాట్నా) చిహ్నమును ప్రతిష్ఠింపించెను. కాని అట్టి "రాట్నా పతాకము" "కేవల దూదేకుల జెండా" మాత్రమే యగుననియు రాజకీయముగ మన జాతీయ జెండా శక్తివంతముగను, ఇహపర సాధనల కనుగుణ్యముగ నుండవలెనని, తెలిపి, ఇందుపై "చక్రరూపమే తగియుండునని 1925 లో నిరూపించినవాడు మన ఆంధ్రరత్నము. తుదకు 1947సం॥లో "రస సమయమున" అనగ యిచ్చటనుండి బ్రిటిష్ బావుటా (యూనియన్ జాక్) అంతరించు సమయమున, భారతీయులకు ఆరాధ్యదైవముగ వెలసిన ధ్వజరూపము ఆంధ్రరత్న ప్రసాదితచక్రమే. స్వరాజ్యము ఎల్లరయొక్కయు స్వధర్మముపై నాధారపడియుండవలెననియు, ఇందుకై హిందూ-ముసల్మాన్ శిఖు-క్రైస్తవ-పారశీకాది ధర్మ సమన్వయమే యిప్పుడు మనకు ,శరణ్యమనియు; యిచ్చటి అవతార పరంపరలో బుద్ధునికి బిమ్మట క్రీస్తు, మహమ్మదు లుభయులను ధర్మప్రవక్తలుగజేసి, "దశావతారములను ద్వాదశావతారములు" గను; భారతీయ అష్టాదశ పురాణములకు దోడుగ బైబిలు, ఖురానులను జేర్చి, "వింశతి పురాణములు" గను సంస్కరింపవలెననియు, లోగడ శ్రీ ఆదిశంకరునకు బోలె యీకాల

మందు ప్రపంచమందెల్లెరకు ఒక నూతనాద్వైత తత్వమును చాటి, అందుకు తగుమార్గమును సూచించి దేశీయులలో నొక ధర్మపిపాసను కలిగించి, విప్లవబీజములను నాటిన మహనీయుడు, మన ఆంధ్ర రత్నము. దేశ రక్షణకై - సాంఘిక సేవకై -ఊరూర- ఉభయ తారకమగు శ్రీరామదండు నెల కొల్పిన విప్లవ వీరుడు గోపాలకృష్ణుడు. రాజకీయముగ యాతని చీరాల పేరాల రంగము ఆంధ్ర దేశమందేకాక, యావద్భారత దేశము నందును అప్పటికి, యిప్పటికి, అద్వితీయమని యెల్లరంగీకరింతురు. ధర్మ విషయములలో లోగడ స్వామి వివేకానందునివలె యావద్ప్రపంచమునకును యొక నవ్యబ్రాహ్మణ లక్ష్యమును ప్రకటించుటయేకాక, ఏతద్ధర్మ సిద్ధికై యొక "గోష్ఠి" ని సంకల్పించి, "ఈ గోష్ఠియే నా జీవితాశయ" మని ప్రకటించియు; ఇందుకై శ్రీ వివేకానందుని వలెనే శ్రీ గాయత్రీ ఉపాసనయు, నిజజాతీయ విద్యా విధానమును నిరూపించిన ద్రష్ట మన ఆంధ్ర రత్నము. ఇట్టి మహనీయుని ఒక్క మాటలో వర్ణింపవలెనన్నచో, మహానందీ క్షేత్రమున తననుగూర్చి తాను చెప్పుకొన్న మాటలే స్ఫురించును.

"శంకరుడె మహానందిని
సుంకర కొండయగ వెలసె చోద్యము కాదె?

నిశ్చయముగ ఆ ఆదిశంకరుని అపరావతారమే ఆంధ్ర రత్న మని తోచును.

శ్రీ అప్పారావుగారికిని, ఆంధ్రరత్నమునకును సంబంధించిన యొక ఉదంతము నిచట తెల్పుట యవసరము. శ్రీ గోపాలకృష్ణుడు 1928 జూన్ నెలలో పరమపదించెను. అది మండు వేసవి యగుటచే ఆ రోజులలో శ్రీ అప్పారావు గారు మైసూరు రాష్ట్రములో విశ్రాంతి దీసుకొనుచుండిరి. కోలారు బంగారు గనులలో నుండగా పిడుగువంటి గోపాలకృష్ణుని మరణవార్త యాతనికి వినవచ్చెను. సహజ కవియు గాన ప్రియుడునగు శ్రీ అప్పారావుగారు వెన్వెంటనే ఆంధ్ర రత్న స్మారకముగ యీ దిగువ గీతికను రచించి ఆంధ్రుల కందజేసెను. ఈ సందర్భమున యమునా కల్యాణీ రాగము శ్రీ ఆంధ్రరత్నకు అభిమాన రాగమని పాఠకులకు ప్రత్యేకించి తెల్పుట అనావశ్యక మనుకొందును.

శ్రీ అప్పారావుగారి గీతిక

౧. ఏలా పాడే నింక - యమునా కళ్యాణి । నే
లీలా మానవుడు గో - పాలుడు లేడాయె? నేలా॥

౨. బంగారు గనులలో - చెంగలించే వేళ ।
పిడుగు బోలిన వార్త - వినిపించినారయ్యో ॥ఏలా॥

3. చెడువార్త వినగానె - చెవులు గింగురు బోయె।
ఎంత చించుకొన్న - గొంతు పెగలదాయె ॥నేలా॥

౮. వెన్నెలకు తోడు మా - వేణుగోపాలుడు ।
కన్నుల పండువుగ - కనిపించకుంటే నే ॥నేలా॥

౫. ఈనాటి యీ నేస్తమే జన్మకో తిరిగి
కన్నీళ్ళ గారవకె కడుపు చెరువయ్యేనే
నేలా బాడే నింక యమునా కల్యాణి మా,
లీలా మానవుడు గోపాలుడు లేడాయె.

గోపాలకృష్ణుని వక్తృత్వ గరిమను గూర్చి ఒక్క మాట. "ఈ ప్రపంచములో యెందఱో మహావక్తల ఉపన్యాసములను నేను వింటిని. కాని వీరందఱిలో శ్రీ గోపాల కృష్ణుడే మిన్న. ఆతడు లక్షలాది ప్రజలను వశంవదులొనర్చు కొనుటలో నెట్టి యబ్బురము లేద"ని ఒకా నొక తూరి డా॥ కట్టమంచి రామలింగారెడ్డిగారు చెప్పిరి. అట్టి మహా వక్తృత్వముగూర్చి 1936 జూన్ నెలలో రామనగరులో జరిగిన జయంతి సందర్భమున సుప్రసిద్ధకవిశేఖరుడు, ఆంధ్ర రత్నము యొక్క మరొక మిత్ర సత్తముడగు శ్రీ బలిజేపల్లి లక్ష్మీ కాంతంగారు ఆశువుగ జెప్పిన యీ దిగువ పద్యముతో యీ "నుడి" ని ముగించెద. ఆ నాడు శ్రీ లక్ష్మీకాంతంగారు గోపాలకృష్ణుని గానామృతమును తత్పరిసర సముద్ర ఘోషతో బోల్చుచు యిట్లు చెప్పిరి.

చాలుంజాలు సదావృథాభ్యసన కష్టం బేటికో? సాగరా!
గోలంబెట్టకు-నీ తరంబగునె మా గోపాలు సంగీత లీ
లాలోల స్వర సుప్రసార మధుర వ్యాహార గంభీర ధా
రాలావణ్య గతుల్ జడాశయుల కర్థం బౌనె? యేనాటికిన్.

కాని మనలోని జడత్వమంతరించు కొలది శ్రీ ఆంధ్ర రత్న
"గతులు" క్రమముగ లోకము గ్రహింపకుండునా?

గోష్ఠి, అమలాపురము
ఆంధ్రరత్నజయంతి
ది 26-5-63

గుమ్మిడిదల వెంకట సుబ్బారావు.

Blank Page

పీఠిక

ఈ గ్రంథమునకు గథానాయకుడును మదీయ చిరమిత్రుండును నగు శ్రీ గోపాలకృష్ణుని జీవిత చరిత్రమును వ్రాయ నెంచిన నాకు కాళిదాస రచిత మాళవికాగ్నిమిత్రమునందు ఆస్థానమున సింహాసనాసీనుడైయున్న యగ్నిమిత్రమహారాజుం గాంచి నాట్యాచార్యుడు పల్కిన "నచన పరిచితో నచాప్య రమ్యః.....తథాపి భవతి సపేవ నవోనవోయమత్రోః"అను వాక్యము జ్ఞప్తికి వచ్చుచున్నది. మహారాజును నిత్యమును దర్శించుచు నానందింపజేయు నాట్యాచార్యులకు ఆస్థానమున నాసీనుడైయున్న మాత్రమునకే యతడు ఛాయాపహుడగు నూతన పురుషునివలె గన్పట్టసాగెను. అతనిని దర్శించినతోడనే ఆచార్యులకు కంప ముదయింప జొచ్చెను. అదివరకు తమ కతనియెడగల పరిచయ మించుకైన ప్రయోజనకారి గాదయ్యెను. చూచినకొలది వారికన్నులకు మహారాజు క్రొత్త వాడుగనే గన్పట్టజొచ్చెను. అట్టులనే చిరమిత్రుడును నతి పరిచితుడును నగు శ్రీ గోపాలకృష్ణుడు నాకన్నుల కను ఘణము క్రొత్తపురుషునివలె గన్పట్టుచున్నాడు. అందుచేత నతని జీవితచరిత్ర వ్రాయుటలో అపరిచితుడును నరమ్యుడును నగు నూతనపురుషుని జీవితచరిత్ర వ్రాయుపట్ల నెట్టిజాగరూకత నవలంబింపవలెనో యెట్టి కష్టముల గట్టెక్కింపవలెనో అట్టి జాగరూకతనెల్ల యవలంబించి యట్టి కష్టములనెల్లనాటి కృత కృత్యుడుగా ప్రయత్నించెదను. చిరతరాభ్యాస పరిచిత స్నేహలతా బద్ధుడనగు నేను మిత్రవాత్సల్యముచేనేమి

రాగప్రమాదముచే నేమి యెయొక్కకప్పుడు గుణ గణ వర్ణనమున నతిశయోక్తుల పొంతి బోవుదునేమో ? అం తియగాక పరులకు దోషప్రాయములుగ గన్పడు నీతని గుణముల గొన్నింటిని భ్రాతృభావముచే సమర్థింప జూచుపట్ల తలవని తలంపుగ నెవ్వరికే నపచారము గావించుదునేమోయను శంకయు బాధింపుచున్నది. రంధ్రా న్వేషణ ప్రజ్ఞ నితరులకు వదలినైచి ప్రస్తుతాంధ్ర వీరులలో నెల్ల సాహసియు చిత్రవిచిత్ర పురుషుడు నగు మన కథా నాయకుని గుణములను మాత్రమే గురుభావముతో వర్ణించి సమ్మోదిత హృదయుడ నయ్యెదను.

ఇట్లు,

బసవరాజు వేంకటప్పారావు.

శ్రీ ఆంధ్రరత్న ద్యుతులు

ప్రథమ ప్రకరణము

దేశకాల పాత్రచర్చ.

మహాపురుషుల జీవితచరిత్రల వ్రాయుటలో ముఖ్యముగ గ్రహింపదగిన సూత్రములు రెండు. అవి యేవనగ:- మహాపురుషులు నిసర్గమహాత్మ్యమునుప్రభావమును కలవారా, లేక దేశకాలపాత్రముల ననుసరించి వాని బలమునసే మహాపురుషు లయ్యేదరా యను విషయము లే. ఈ సూత్రముల యర్థపరిమితిని కొంచెము పరిశీలించి గ్రహింతము. మహాపురుషులు పుట్టుకతోనే మహాప్రభావము గ ల వా రే యుందురనియు, వారి మహత్తు భగవద్దత్తమేయనియు అట్టి దివ్యప్రభావము వారికి జన్మాంతరసంచిత పుణ్య ఫలముగ లభించుననియు, అట్టివారికే గుణబోధయు, నేశిక్షణ మును నేసామాన్యసాంప్రదాయముగు నక్కరలేదనియు కొం దటి సిద్ధాంతము. ఈ సిద్ధాంతము సరియైనది కాదనియు, దేశకాలప్రాత్రముల ననుసరించియే మానవు డభివృద్ధినొంది మహాపురుషు డగుననియు అనుకూలస్థితిగతులులేనిది యెంతటి వాడైనను గణ్యతలేకుండ బోవుననియు మఱికొందఅమతము. ఈ రెండుసిద్ధాంతములకు గల తారతమ్యము ప్రస్తుతవిషయ మునకు జాలసంబంధించియుండుటచే కొంచెము విపులముగ జర్చింతము.

మహాపురుషుల మహత్తునుగూర్చి చర్చించుచు కార్లైల్ (Carlyle) అను ఆంగ్లేయ గ్రంథకర్త వైచిన Does the Hero make the age or does the age make the Hero ?అను ప్రశ్న

ముగూడ పై రెండు సిద్ధాంతముల ననుమానించుచున్నది. మహాపురుషుని వలన యుగనిర్మాణమగుచున్నదా, యుగ ప్రభావమువలన మహాపురుషులుదయింతురా? యనియే పై ప్రశ్నమున కర్థము. కార్లైల్ మహాపురుషులపురూప ప్రభానముతో జన్మింతురనియు, వారిశక్తి దైవదత్తమేయనియు వా రొకులకడ నేర్చికొనునది స్వల్పమును స్వీయప్రభావము వలన నితరులకు ప్రసాదించు విజ్ఞానమపరిమితమనియు మహా ప్రతిభాయుతులగు మహాపురుషుల క్రియాసిద్ధివలననే యుగ నిర్మాణ మగుననియు వాదించుచు తుదకు (The History of a nation is the history of its heroes) మహాపురుషుల జీవిత చరిత్రయే దేశచరిత్ర మగునని సిద్ధాంతీకరించెను. కార్లైల్ తనవాదమును సమర్థించుటకై బుద్ధుడు, మహమ్మద్, క్రీస్తు, డాంటీ, హోమర్, షేక్స్పియర్ మొదలగు మహానీయు లనేకుల చరిత్రముల వర్ణించి ప్రపంచాభ్యుదయమునకు వారే కారణులనియు, నట్టివారు జన్మించి యుండనిచో ప్రపంచము నాగరికస్థితి నధోగతి జెందియుండుననియు, కావున సర్వవిధ ముల మహాపురుషారాధనము శ్రేయోదాయకమనియు, నిజ వచోగాంభీర్యమును, నసదృశ రచనాఘాటియు, నసమాన సాహిత్యవిభవమును, తేటపడునట్లు వర్ణించి పూజాపురస్కా రము లేమి బూజెక్కియున్న మహానీయుల చరితల స్మృతికి దెచ్చి యాంగ్ల సాహిత్యమునకును నాంగ్లమానసికాభివృద్ధికిని తీరనిమేలును సాయమును నొనర్చి నిరంతర స్మరణీయు డయ్యెను. ఇక రెండవ సిద్ధాంతమును పురస్కరించివాదించు

వారలలో జీవశాస్త్రజ్ఞులు ముఖ్యులు. వారు మానవపరిణామ సిద్ధాంతము ననుసరించి శుద్ధజడస్వరూపమగు శిశువు కాల క్రమేణ సంసర్గ ప్రభావముచేత జ్ఞానవంతుడగు పురుషుడై దేశకాలపాత్ర స్వభావాను గుణ్యముగ మార్పులజెంది కార్యాచరణమునకు గడంగి అనుకూల స్థితిగతులు చేకూరిన జయమును తదభావముచేకూరిన నపజయమును గాంచునే గాని మహోత్సాహముగాని, దివ్యప్రభావముగాని, పూర్వజన్మ సంచిత పుణ్యఫలముగాని, మహాపురుషులజయమునకు కారణ ములు కాజాలవనియు నింపులకు జీవశాస్త్రమే ప్రబలకారణమనియు, పరిణామచక్రమున కొద్దిజంతువులు పెద్దజంతువు లగుననియు, జంతువులనుండియే మానవుడుద్భవించెననియు, సమకాలికులయొక్కయు పూర్వీకులయొక్కయు సంసర్గము వలననే మానవుడు మహాపురుషు డగుననియు, అందువలన యుగప్రభావమువలననే మహాపురుషు డుద్భవించుననియు వాదించెదము.

భారతదేశవాసుల కీరెండు సిద్ధాంతములును పరిచిత ములేగాని రెండిటిలో కార్లైల్ సిద్ధాంతమే యెక్కువగ రుచించును. అదియే భారతసాంప్రదాయముల కనుగుణ్యముగ నున్నది. భగవంతుడే సర్వసృష్టికిమూలకారణుడనియు, నతడే మానవుని భావిభాగ్యాభాగ్యములను నిర్ణయించి లిఖించు ననియు నట్టిభగవంతుని వ్రాతవిధిగా నటవేరుననియు, అందుచే మానవుడు పుట్టుకతోడనే మహత్తుగలవాడై పుట్టుననియు మహాపురుషుల మహత్వము వూపుపుట్టగనే పరిమళించెడు

రీతిని పుట్టుపుతోడనే సువ్యక్తమగుననియు మహాపురుషుల విజయసిద్ధివలననే యుగనిర్మాణ మగుననియు, భారతీయుల కుగ్గుపాలతోడనే నేర్పబడుచున్నది. విధిక్రాలు తప్పనేర వనియు, అజునికైనను వానియబ్బకైనను సరే బ్రహ్మలిఖిత మగు కర్మమును మీర సాధ్యముకాదనియు, 'నుదుటన్ వ్రాసిన వ్రాలుకన్న గలదే నూరేండ్లు చింతించినన్' అనియు మనవారెల్లప్పుడును నమ్మచుందురు. ఈ నమ్మకమున కను గుణముగనే మనవారికి జ్యోతిషమునందును జాతక ప్రభావమునందును విశ్వాసము మెండు. గ్రహ సంచారములవల్లను, నక్షత్రముల కలయికవల్లను భగవంతుడే యే జీవి కేయే కర్మఫలితముల నిర్ణయించెనో యెఱుంగవగుననియు మనవారు నమ్మెదరు. అదియునుంగాక భగవంతుడే కొన్నియెడల మానవుడుగా జన్మించుననియు, అట్టి భగవదంశా సంభూతులగు మహామహులే అవతారములనియు, అట్టి అవతారములవల్లనే మానవజాత్యాభివృద్ధికి భంగకరములగు ప్రతిబంధములు సడలిపోయి లోకకళ్యాణము చేకూరుచుండుననియు మనవారిమతము. ఈ భావమునే శ్రీకృష్ణభగవానుడు భగవద్గీతలలో "యదాయదా హిధర్మ స్యగ్లానిర్భవతిభారత, అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహం, పరిత్రాణాయసాధూనాం వినాశాయ చ దుష్కృతాం, ధర్మసంస్థాపనార్థాయ సంభవామియుగేయుగే" యను లోకప్రసిద్ధ శ్లోకములలో వెలిబుచ్చియున్నాడు. ఈ శ్లోకములయొక్క భావము భగవంతుడే లోకోద్ధరణార్థమై

యవతారములెత్తి దుష్టశక్తులనడచి ధర్మమును సుప్రతిష్ఠితము గావించుననియే.

కాని యిట్లనుటలో సామాన్యమానవుడు సంసర్గ ప్రభావమువలన విజ్ఞానము బడయజాలడని చెప్పదగదు. సత్సంగతివలన మానవుడభివృద్ధినొందుచునే యుండును. కాని మహాపురుషులు స్వతస్సిద్ధముగ ప్రతిభావంతులై యుందురనుట సత్యము. వారుగావించు కృత్యములే మానవపురోభివృద్ధికి గారణము లగుచుండును. అట్టి మహాపురుషుల విషయమున "క్రియాసిద్ధిః సత్వే భవతి మహతాంనోపకరణైః" అను వచనము సార్థకము కాగలదు. యుగప్రభావము సామాన్య మానవులపట్ల వర్తించునేగాని యుగపురుషు లనదగు మహా మహుల విషయమున పూర్ణముగ వర్తించుననుట హేత్వాభాసమగును.

పై చర్చ యేటికి జేయబడినదని ప్రశ్నముదయింప వచ్చును. శ్రీ గోపాలకృష్ణుడు యుగప్రభావమువలన మహాపురుషుడయ్యెనా లేక స్వతస్సిద్ధమగు ప్రభావమువలననే మహాపురుషుడయ్యెనా యని విచారింపదగును. "మహాపురుషులకుండదగిన లక్షణము లితనియెడ నెంతపట్టుకలవు? ప్రస్తుత యుగప్రభావమెట్టిది? దానిప్రభావమునల్ల నతడెట్టి మార్పు జెంది యెట్టి యభివృద్ధినొందెను?" అను విషయములకు సమాధాన మొసగుటకై మహాపురుషుల జీవితములయం దుపలక్షింపబడు లక్షణముల నభివృద్ధి హేతువులను పరిశీలింపనలసి వచ్చినది. పాఠకులు వాదముయొక్క సందర్భశుద్ధిని గ్రహింపదగును.

యుగపురుషులును యుగనిర్మాతలు నగు మహాపురుషులలో ఆంధ్రరత్న బిరుదాంకితుడగు మన కథానాయకుడింకను చేర్చబడజాలడని నా యభిప్రాయము. అట్టి మహాపదవికొఱకతడు సంయమనమున గావించుచున్నాడు. తత్ఫలమింకను కాలము గడచినగాని చేజిక్కదనిచెప్పిన నించుకేనియు తప్పుండదని నా నమ్మకము. యోగనిష్ఠ యలవడనిది యోగసిద్ధి చేకూరుట యసంభవముకదా! యోగసిద్ధిగానిది కీర్తి యబ్బెనేనియు నయ్యది మహాపురుషుల కీర్తివలె నాచంద్రార్కస్థాయి గాంచనేరదు. కారాగృహమున నీ మహానీయుడనుభవించుచున్న కష్టములును చేయుచున్న తపమును నచిరఫలనంతములగుగాక! కానిమహాపురుషుల కుండవలసిన లక్షణములలో గొన్ని మన యాంధ్రరత్నమునందు విస్పష్టముగ గాన్పించుచున్ననియు నట్టి లక్షణములును గుణసంపదయు యోగసాధనాఫలితముగ త్వరలోనతనికున్నతపదవి సంధింపగలవనియు నేను పూర్ణముగ నమ్ముచున్నాను. అట్టి లక్షణములన్నియు నుచితసందర్భముల వివరించెదను.

, ఇక దేశకాలస్వభావ మెట్లు గోపాలకృష్ణుని మార్పు గావించినదో తెల్పుటకు కొంచెము విపులముగ ప్రస్తుతము మనదేశ మున్నస్థితిని వర్ణించవలెను. అప్పుడు గోపాలకృష్ణుడు గావించిన కార్యములయొక్క ఫలితమును పరస్పర సంబంధమును దేశమునకు యావత్తు వానివలన కలిగిన లాభమును తేటపడగలవు. ప్రసంగవశమున ఆధునికమహాపురుషుల కతనిపై నెట్టి యభిప్రాయముకలదో అతనికి ఆధునిక మహా

పురుషులయెడ నెట్టి సద్భావముగలదో పాఠకమహాశయులకు సువ్యక్తముకాగలదు.

ఈ యిరువదవ శతాబ్దము భారతదేశ చరిత్రమున యుగసంధి యనందగును. మంచికోచెడ్డకో భారతసామ్రాజ్య లక్ష్మి యన్యదేశీయుల నాశ్రయించి సొంతవారిపై "శీతకన్ను" వైచినది. ఏనాడు మహమ్మదీయులు హిందూశము పై దండెత్తి మన చక్రవర్తుల జయించి రాజ్యము గైకొనిరో యానాడే భారత సామ్రాజ్యలక్ష్మి పరాధీనయయ్యెను. హిందూరాజులు గావించిన కార్యముల ఫలితముగనే మహమ్మదీయ సామ్రాజ్యము దేశమున ప్రతిష్టితమైనదని చెప్పదగును. స్వలాభపరులై యంతఃకలహముల బెంచికొని యన్యులకు సామ్రాజ్యలక్ష్మి నప్పగింతపెట్టిన మన హిందూరాజులు నింద్యులేయని యెన్నదగును. హిందూరాజులనుండి గైకొన్న రాజ్యలక్ష్మిని ముసల్మానుచక్రవర్తులు చాలకాలమువర కమితాదరముతోడను గౌరవముతోడను గాపాడికొని దేశమును హిందూప్రజలు ప్రేమించినరీతినే ప్రేమించుచు భారతవర్షమున కచిరకాలమునసే ప్రాతకాపులైరి.

కాని చంచలములగు రాజ్యలక్ష్మి కటాక్షవీక్షణము లెల్లప్పు డొక్కజాతివారిపై ప్రసరించునా? మొగలాయి సామ్రాజ్య ముచ్చదశలో నుండినగోజులలోనే వేఱుజాతుల వారు గూడ నామెకై జూడ్కుల సారించుచు నామెకటాక్షమున కెదురుచూచుచుండిరి. నిర్జితాశేషరాజపుత్రుడును ధర్మశాలియు నగు సక్బర్ చక్రవర్తి యనంతరమతని కుమారుడగు

జహాంగీరును, మనుమడగు షాజహానును దేశమును జక్కగనే పాలించిరి. కాని పితృద్రోహమును భ్రాతృద్రోహమును గావించి సామ్రాజ్యాధిపత్యము నొందిన యౌరంగజేబు తన జీవితకాలమునసే యమితమగు మతాభిమానముచేనేమి పరిపాలనాపద్ధతులయందలి కాఠిన్యముచేనేమి ప్రజానురాగమును కొంతవరకు గోల్పోయి యొకవంక సిక్కులయొక్కయు రెండవవంక మహారాష్ట్రసింహమనదగు ఛత్రపతి శివాజీ మహారాజుయొక్కయు, రాజపుత్రసింహమగు రాజసింహుని యొక్కయు బారికిలోనై యెట్టులో జీవితాంతమువరకు పరిపాలనము గావించి మరణించెను. తోడనే రాజ్యము విచ్ఛిన్నమయ్యెను. సామ్రాజ్యమునంతయు నేకచ్ఛత్రముగ పాలింపగల సమర్థులు లేమింజేసి యది ఛిన్నభిన్నములయ్యెను. హిందూమహమ్మదీయులు తామెల్లరును భారతదేశమునకు ప్రాతకాపులమే యనుమాట మరచి యంతఃకలహముల గావించికొని నిర్వీర్యులైన యీ యవసన రాజ్యలక్ష్మి యిరు జాతుల యెడంగూడ విముఖయై వేఱొకజాతి నాశ్రయింప వలసిన దయ్యెను.

ఆ జాతియే ప్రస్తుతము మనల బాలించుచున్న యాంగ్లేయజాతి. ఈజాతివారు పాశ్చాత్యదేశమగు నింగ్లండు నుండి వరకమునకై యీ దేశమున కేగుదెంచి మొగలయి చక్రవర్తులయొక్కయు హిందూ రాజులయొక్కయు దయాగుణముచే నీ దేశమున నిలువనీడ సంపాదించికొని కాల క్రమేణ మొదటికే యెసగుదెచ్చిపెట్టిన సంగతి దలప రాత్రి వేళ వర్షము కుంభపాతముగ బడుచున్న సమయమున నరబ్బీ

యుని దయారసముకతన గుడారమున మొదట తలనిరికించి
దాచికొని క్రమక్రమమున నతనిని లోననుండి వెలికివెడల
నడచిన లొటిపిటసంగతి జప్తికివచ్చుచున్నది. ఆంగ్లేయులు
వర్తకమునకై ఈ దేశమునకు వచ్చిన కొలదికాలముననే
వ్యాపారముమాట వెనుకబెట్టి రాజ్యకాంక్ష బెంచికొని
హిందూముసల్మానుల పరస్పరకలహాములలో జోక్యముకలుగ
జేసికొని గెలిచినకోడి నాదేనన్నటుల నెనరినోయొకరిని జేరదీసి
రెండవవానిని పడగ్రద్రొక్కి పిమ్మట మొదటివానిని కూడ
రెండవవానికి దోడుగాపంపి నాటకమాడి యెట్లైనని రాజ్యము
సంపాదింపగలిగిరి. పందొమ్మిదవశతాబ్దము జొరబడినకొలది
సంవత్సరములలోనే యాంగ్లేయులు మహారాష్ట్రులను, సిక్కు
లను, మహమ్మదీయులను జయించి దేశమును యావత్తు
వశముగావించికొని పరిపాలింపదొడగిరి. కాని వారు పర
దేశీయు లగుటచేతను, అన్యనాగరకతాభిమానులగుటచేతను
స్వలాభపరులగుటచేతను, భారతీయుల బాగోగులనుసంప్రదా
యములను, ధర్మములను, హక్కులను గమనించి న్యాయ
మును తిన్నగ బరిపాలింపలేకపోయిన కారణమున నశాంతి
పెచ్చుపెరిగి తుట్టతుదకు 1857వ సంవత్సరమున స్వధర్మ
రక్షక దారుణసంగ్రామజ్వాలారూపమున ప్రజ్వరిల్లి శీతవిషల
వాతహతింపడి చల్లారెను. కాని ఈసంగ్రామ మాంగ్లేయుల
కొక రాజనీతిని నేర్పెను. అడ్డెద్దియన భయమున పాలు
ద్రావింపజాలముగాని నయమున విసము ద్రావింపగలమను
గుణపాఠమే. ఏతత్ఫలితముగ నాంగ్లేయులు భారతదేశ పరి
పాలనమును తమ రాణియగు విక్టోరియా కొప్పగించిరి,

ఆమెయు జనులయెడ నధిక వాత్సల్యమునుజూపి భారతీయుల క్షేమమే తన క్షేమముగను, భారతీయుల యైశ్వర్యమే తన యైశ్వర్యముగను భారతీయుల సంతుష్టియే తన సంతుష్టిగను భావించి పరిపాలించెదనని వాగాసము గావించెను. ట్లోడనే యీ వాగ్దాన ఫలితము దేశమున వ్యాపింపజొచ్చెను.

1860 సంవత్సరమునసే మెకాలేప్రభువు భారత దేశ నాగరకతపై దండెత్తి యాంగ్లేయ నాగరకతాప్రభావమునకు మనలనెల్ల గుత్తకొనుటకై మనదేశమున నెల్లెడల నాంగ్లేయ విద్య వ్యాపించుటకు దగిన మార్గముల నన్వేషింపసాగెను. మెకాలేప్రభువున కున్న దురభిమానమునకు మితిలేకుండెను. భారతవాఙ్మయమును భారతీయనాగరకతయును సర్వమును నొక్క యాంగ్లపుస్తక పేటికకు సరిరావని వచించిన యతని మాటలే యతని దురభిమానమును వేనోళ్ళ చాటగలవు. భారతీయులనెల్ల నాంగ్లేయ నాగరికతాదాశ్యమున బడవేయ వలెనని సంకల్పించిన యతని సంకల్పము సాకవంతమగు క్షేత్రమున జల్లినవిత్తులనోలె నచిరఫలోన్ముఖమయ్యెను. శీఘ్రకాలమునసే యాంగ్ల నాగరికతా వ్యామోహము భారతీయ నేత్రముల మలీమసముల గావించెను. సేవకోద్యోగములపై మోజెక్కుపయ్యెను. భారతధర్మముపై రక్తి సన్నగిల్లజొచ్చెను. న్యాయము, నాగరకత, విజ్ఞానము, సౌందర్యము, ఆరోగ్యము మొదలగునవి యెల్ల సీమనుండి దిగుమతి కావలసినవిగా భావింపబడునవస్థ తటస్థించెను. చేతులవ్రేళ్ళకు వెండిబంగారు చిలుము తగులుచుండినకొలందియు భోగ

వాంఛ హెచ్చదొడంగెను. వస్త్రములు, చిల్లరసామానులు, యంత్రములు, వేయేల తిండికినలసిన ధాన్యాదికములు దక్క నన్యములగు వస్తువులెల్ల బరదేశమునుండి దిగుమతి జేసుకొను చుండిన వర్తకులయొక్కయు నట్టిసరకుల బ్రోత్సహించుకొను చుండిన యాంగ్ల విద్యాధికులగు భారతీయులయొక్కయు చలువచే దేశములోని చేతిపనులన్నియు నశింప కోటానుకోట్లు పాటకపుజను లన్నములేక మాడజొచ్చిరి. కజివులు హెచ్చ దొడగెను. కొంతకాలమునకు (కారణమేమైననేమి) స్వాతంత్ర్యవాంఛ పుట్టెను.

ఏతద్వాంఛాఫలముగ దేశీయులలోని మహామహు లెల్లరును జేరి దేశీయమహాజనసభను స్థాపించి తమ స్వాతం త్ర్యేచ్ఛను నాంగ్లప్రభువుల కెఱింగించిరి. కాని వారి కియ్యది చెవులజొరనే చొరదయ్యె. పిమ్మట కర్జనుప్రభువు చలువచే దేశమున ముఖ్యముగ వంగ, మహారాష్ట్రప్రదేశముల స్వాతం త్ర్యోద్యమము హెచ్చుపెరిగి యశాంతికిని హత్యలకును ప్రభు త్వము చే విధింపబడిన నిర్బంధములకును గారణమయ్యెను. ఈ యుద్యమమును నడిపించి ప్రసిద్ధిగాంచిన వారిలోనెల్ల లోకమాన్యబాలగంగాధర్ తిలక్, విపినచంద్రపాల్, అరవింద ఘోష్, సురేంద్రనాథబెనర్జీ, లాలాలజపత్రాయగార్లు ప్రము ఖులు. వీరిలో నొక్క సురేంద్రనాథుడుదక్క నందరును సర్కారువారిచే నిర్బంధింపబడి కారగారవాసమో లేక ప్రవాసమో యనుభవింపవలసినవారైరి. కాని దేశమున జ్ఞానము మొలక లెత్తెను. స్వరాజ్యస్వధర్మరక్షణకాంక్ష యెల్లెడ

ప్రబలెను. సర్కారువారికి కొంచెము కన్నులలో నలకలుపడి మెఱమెఱలాడసాగెను. వెంటనేవారు మింటోమార్లే సంస్కరణములను పేరిట నేమో యెందుకుబనికిరాని కొన్నిసంస్కరణముల నొసంగి భారతీయులపై మచ్చుపడిజల్లి జాతీయవాదుల బలమును జీల్చి, మితవాదు లనుపేరబరగజొచ్చిన ఆంగ్లాధికారాభిమానులగు భారతీయుల గొందరిజేరదీసి, వారి సహాయబలముచే నెట్టెటులో దేశమును పరిపాలింపుచుండిరి. కాని దేశమునకొకవంక నశాంతిహెచ్చి, దారుణకృత్యములకు గారణమగుచుండెను.

అంతలో నైరోపోమహాసంగ్రామను వచ్చెను. తోడనే స్వామిభక్తిపరాయణులగు భారతీయులెల్లరును ధన ప్రాణములు సైతము లెక్కింపక నాంగ్లసార్వభౌమునికి వలసిన సాయమెల్ల జేసిరి. మనవా రొనరించిన ఈ మేలునకు బ్రతిఫలముగ సర్కారువారు దిక్కుదివాణము లేకుండ నిచ్చనచ్చిన వారి నిచ్చవచ్చినరీతిని సాట్యమనునది లేకుండగనే యొక్క పోలీసువాని మాటమీదనేయెట్టి కఠినశిక్షలకైన బాల్పడుచు నధికారము నొసంగు రౌలట్‌చట్టమును చట్టనిర్మాణసభలో భారతీయసభ్యులెల్లరు నేకగ్రీవముగ వలదని ఘోషించినను లెక్కింపక శాసనము గావించిరి. ఈమధ్యరంగమున తాండవమాడిన అనిబెసెంటమ్మయు లోకమాన్యతిలకును సుప్రసిద్ధులే.

ఇచట నిట్లుండ నింగ్లండులో భారతదేశమంత్రి మనకేనో సంస్కరణముల ప్రసాదింతునని పలికి మనదేశమునకు వచ్చి చూచిపోయి మనవారిలో ప్రముఖుల నచటికి రావించి, బేరసారముల గుదురిచికొని సంబంధమునిశ్చయించి పంపెను.

ఆయన యేమహాత్తరమున సంబంధము నిశ్చయించెనో కాని వెంటనే తురుష్కసామ్రాజ్యమునకు విపత్తును, మనకు పంజాబున చిత్రవధలును ప్రాప్తించినవి. తుర్కీ జర్మనీతో యుద్ధము చేసి యోడిన యనంతర మా రాజ్యమును భిన్నముగావించి యెరోపీయులెల్ల పంచుకొని మహమ్మదీయుల మతస్థలములపై నధికారము సైతము లాగికొని తుర్కీసుల్తాను నీకలుతిసిన కోడి యట్టులజేసి యుత్సవవిగ్రహరీతిని నిలువబెట్టజూచిరి. ఈ చర్య భారతదేశమునందలి ముసల్మానులకు ఆంగ్లరాజ్య ప్రధాన మంత్రియగు లాయడ్ జార్జిగారు తురుష్కరాజ్యమును భిన్నముగావింపమని చేసిన వాగ్దానమునకు భిన్నముగను మూలచ్ఛేదకముగ నుంటచే ముసల్మానులలో నశాంతి హెచ్చెను. ఇంతలో నాప్ఘనురాజునకును ఇండియా ప్రభుత్వమునకును యుద్ధము తటస్థించి ఘోరసంగ్రామము జరుగు చుండెను.

ఈ సమయమునసే గాంధిమహాత్ముడు రౌలతు శాసనమును తీసివేయించుటకై సత్యాగ్రహవ్రతము బూని దేశీయులెల్లనచే దాని నాచరింపజేయుచుండెను. సర్కారువారికి దేశమున జనించుచుండిన యమితోద్రేకము కంప మొదవింపజొచ్చెను. తిలక్, పాల్, గాంధి మొదలగు దేశభక్తుల పంజాబులోనికి రాకూడదని నిషేధించిరి. పంజాబుప్రభుత్వము వారి యాజ్ఞను ధిక్కరించి గాంధిమహాత్ముడు లాహోరున కేగుచుండ వారిని సర్కారువారు పట్టుకొనిరి, తోడనే గుజరాతు పంజాబుదేశములలో అల్లరులు జరిగెను. కొంత ధన, ప్రాణనష్టముకూడ జరిగెను. వెంటనే నిరంకుశాధికారాభి

మానియగు సర్ మైకేలు ఓడ్వ్యాయరుగారి సలహాననుసరించి రాజప్రతినిధి పంజాబు దేశమున సైనికశాసనము నమలులో బెట్టెను. ఆ సైనికశాసన మమలుజరిగినవిధమును జలియన్ వాలాబాగు హత్యలును పంజాబీయు లనుభవించిన ఘోర దుస్థితియును జగద్విదితములే గనుకను సకల నాగరక ప్రపంచ మును వానికి సిగ్గుపడియుండిన కతమునను వానినిగూర్చి వ్రాయబూనలేదు. పార్లమెంటువాకును హంటరుసంఘము వాగును ఇండియాప్రభుత్వమువారునుగూడ పంజాబులో జరి గిన ఘోరదురంతములకు ప్రతీకారము జరుపకపోవుటచేతను తురుష్క సామ్రాజ్యనాశనము తప్పించుప్రయత్నముల నాంగ్లేయప్రభుత్వమువా రేమియును చేయకుండుటచేతను పైపెచ్చు సంస్కరణములని పేరుపెట్టి యుద్యోగలాభ మపే క్షించు మితవాదులను బ్రాహ్మణేతరులనువారిని ఆంగ్లోపైంద వులను చేరదీసి భేదోపాయములు కల్పించుచుండుటవల్లను సామాన్యమార్గముల స్వరాజ్యమునుసంపాదించుట శశవిషాణ ప్రాయ మగుచుండుటచేతను, గాంధిమహాత్ముడును, ఆలీ సోదరులును, తదితర హిందూముసల్మాను నాయకులును సంప్రదించుకొని సర్కారువారి కేవిధమగు సాయమును చేయరాదని నిశ్చయించుకొని సహాయనిరాకరణోద్యమమును సాగింపబూని లోకమాన్యుని యనుమతిబొంది 1921 వ సంవ త్సరము ఆగస్టు 1వ తేదినుండి ప్రారంభింతుమని ప్రచురించిరి. హిందూముసల్మానులు ప్రాతపగలెల్లమరచి, భ్రాతృభావమున మెలంగుచు స్వరాజ్యసంపాదనమునకును తురుష్క సామ్రాజ్య విమోచనమునకును బద్ధకంకణులై తరుణమెప్పుడా యని

యువిళ్ళూరుచుండిరి. గాంధిమహాత్ముడును దీక్షాబద్ధుడై సమయమునకై నిరీక్షించుచుండెను. 31వ తారీఖు నచ్చెను. దినము గడచెను. రాత్రివచ్చెను. నిశీధము దాటిపోవున ట్లుండెను. "క్షణమధునా"యని గాంధిమహాత్ముడుత్కంఠతో జపించుచుండెను.

కాని లోకమునన్నెల్ల దద్దరిల్ల గలగుండు వడజేయు నీ పిట్టపిడుగుబోలిన వార్త యెక్కడిది? లోకమాన్యుడగు తిలకభాను డస్తమించెనన్నయే! అక్కటా ఎట్టి విపత్తు వాటిల్లె? కృష్ణార్జునులనోలె భారత స్వాతంత్ర్యసంగ్రామమున బోరుదురు గదాయని యేరిపై నాసవెట్టికొంటిమో యట్టివారిలో "మన సారథి, మన సచివుడు, మన నెయ్యము, మన గురుండు మన చుట్టంబున్ మన లోకమాన్యతిలకుడు మనలను విడనాడి చనియె మనకర్మముచే." అయినను ప్రకృతి నిర్ణయ మిట్టులే యుండనోపునే మో? ఇరువురు మహామహు లేకకాలమున దిగ్విజయముగాంచుట యసంభవమని తలచికాబోలు తీక్ష్ణ బుద్ధిశాలియు, రోషకషాయితలోచనుడును, శూరాగ్రేసరుడును, కర్మయోగియునగు తిలకుభాను డస్తమించెను. ఇంకల్లగ గాంధి చంద్రోదయమగును గాబోలును. పరశురామావతారము సమాపించెందగనే రామావతారము రాన్నది గాబోలును. నూతనయుగము నిర్మాణమగును గాబోలును.

గాంధిమహాత్మునిచే ప్రారంభింపబడిన సహాయ నిరాకరణోద్యమముయొక్క వివరములనుగూర్చి ప్రస్తుతము దీర్ఘ

ముగ చర్చించుట కానిపని. అయినను దాని ముఖ్యసూత్ర మునుమాత్ర మర్థముజేసికొనవలెను. అదేవిధమున ఇన్ని సంవత్స రములనుండియు స్వల్పసంఖ్యాకులును నపరిచితులును, భార తీయ సంప్రదాయవిధూకులును నగు తెల్లవారు మనలను పాలింపగలుగుటకు కారణము బుద్ధిపూర్వకముగ మనవారు సర్కారునకు భక్తితో శ్రద్ధతో సాయముచేయుచుండుటయే గాని వేఱుగాదనియు, అట్టి సాయము నికముందు సర్కారు వారి కొనరింపకుండ గలిగింతుమేని వారు ప్రజాశక్తికి లొంగి న్యాయమగురీతిని మన స్వరాజ్యమును మన కొసంగెద రనియు, ఖిలాఫత్ విషయము అనగా తురుష్క సామ్రాజ్య విషయమున న్యాయముగావింతురనియు, పంజాబులో సైని కులు గావించిన ఘోరకృత్యములకు మనకు తగిన ప్రతీకార మొనర్చెదరనియు ఇందుల కుపకరించు సాధనము లహింసా సత్యములే. సర్కారువారి నొకవంక నాక్షేపించుచు వేఱొక వంక మనమును వారు గావించెడి తప్పులనే గావించుచు, వారు పోయెడి తప్పుత్రోవలనే పోయినచో మనకుగల గౌరవ మేమి? అన్యాయమున కొడగట్టు మనలనుజూచి భగవంతుడు మెచ్చుకొనునా? పాశ్చాత్యులనుఁబోలె మనమును నాస్తి కులము కాగలమా! ఎన్నటికిని కాజాలము. కావుననే అహింసాసత్యములు మన ఈ యుద్యమమునకు ముఖ్యములు.

పై సూత్రము ననుసరించి గాంధిమహాత్ముడొక కార్య ప్రణాళిక నేర్పఱిచెను. బిరుదాంకితులు బిరుదుల విసర్జింప వలెను. బాలురు పాశ్చాత్యవిద్యను విడనాడి జాతీయ సాంప్రదాయానుకూలమగు సద్విద్యను గరపవలెను. న్యాయ

వాడులు న్యాయవిధురములును ప్రజల మానధనాపహారము లునునగు బ్రిటిష్ న్యాయస్థానముల పనిజేయుచు బీదలకోర్టుల కెక్కించి వారి ననేకవిధములగు నష్టములకు బాల్సేయకుండ పంచాయతీలద్వారా తగవుల బరిహారము గావించుకొన ప్రోత్సహింపవలెను. జనులెల్లరును దేశీయులచే తయారు చేయబడినవియు, పూర్వసంప్రదాయానుసారముగ రాటము మీద తీయబడిన నూలుతో నేయజేయబడినవియునగు స్వదేశవస్త్రముల ధరించి యేటేట వస్త్రములకొరకై పరదేశ వాసుల చేతులలో మనము పోయుచున్న యరువదికోట్ల రూపాయలకు మించి ధనప్రవాహము నరికట్టవలెను. జనులెల్లరు ఇల్లును శరీరమును రెంటిని గుల్ల జేయు కల్లు సారాయి మొదలగు మత్తుపదార్థములను సేవింపక విడచి బుద్ధిమంతులై యుండవలెను. సర్కారుసేవయందున్నవారెల్లరు తమదేశ దాస్యవిముక్తికై తమకు సర్కారునెడగల ప్రేమసంబంధముల బ్రెంచుకొనవలెను. అంతకును లొంగిరానిచో పన్నుల నెగ బెట్టి శాసనోల్లంఘనము గావింపవలెను. అప్పటికిని సర్కారు వారు జంకక మనల హింసింపజూచినచో మనము ధైర్యస్థైర్యరూపకమగు ప్రతిక్రియ చేయబూనక సంపూర్ణ ధైర్యస్థైర్యములతో భగవంతుడు మనదేశమున కెన్నటికేని తప్పక మోక్ష మొసగునను నమ్మకముతో పరమసంతోషముతో దేశము కొరకై ప్రాణములసైత మర్పించి స్వర్గసీమ నలంకరించుటకు సిద్ధముగా నుండవలెను. ఇదియే సహాయనిరాకరణ కార్యక్రమము.

ఈ కార్యక్రమముచే దేశమునకు కలుగునేళ్ళ త్రివిధములు: సర్కారును లొంగదీసి కార్యము సాధించుట యొకటి. యుద్ధము మొదలగు దార్ఢ్యక్రియవలన జగుగు జననష్టము నాపుటయొకటి విస్మృతమై పోవుచున్న భారత జాతీయశక్తిని పునరుద్ధరింపజూచుట మఱియొకటి. త్రిగుణాత్మకమగు నీ యుద్యమమున నెవ్వరొకొందరు స్వలాభపరులను అధికారాభిమానులును వక్కజనులెల్లరును పాల్గొనుచున్నారు. కార్యక్రమమున చాలభాగము ముగిసినది; స్వరాజ్యము చేకువకు వచ్చినది. నేడో మాపో రానున్నది. భగవంతుడును మన పక్షమునను౦డి సాయము జేయుచున్నాడు. విజయము సర్వవిధముల నిశ్చయము.

ఈ యుద్యమము నింత జయప్రదముగ నొనరించినది. దేశీయనాయకుల యుత్సాహపూరిత సహాయ్యమును గాంధి మహాత్ముని యాత్మశక్తియు, సంకల్పసిద్ధియు నని చెప్పదగును. ఆంధ్ర మండలమున నీ సహాయనిరాకరణోద్యమ వ్యాప్తికై పనిచేసి త్యాగమునుజూపి బాధలనుభవించుచున్న వారిలో మన కథానాయకుడగు ఆంధ్రరత్న గోపాలకృష్ణుండు కడుం౦గడు ముఖ్యుడు. ఈ యుద్యమమున నతడెట్టికార్యము నెరవేర్చెనో తత్ఫలితముగ దేశమున నుద్యమమెట్లు వ్యాపించినదో ఆంధ్రరత్నమునకు దేశమున నెట్టికీర్తిప్రతిష్ఠలు చేకూరినవో రాబోవు ప్రకరణముల వివరముగను సోదాహరణముగను సవిమర్శముగను జర్చించి నిరూపించెదము. పాఠకమహాశయులు శ్రద్ధాళుకై పరిశీలింతురు గాక!

ద్వితీయ ప్రకరణము

బాల్యము, విద్యాభ్యాసము

"శ్లో॥ సాయంకాలే వనాంతే కుసుమితసమయే సైకతే చంద్రికాయామ్
త్రైలోక్యాకర్షణాఢ్యం సురనరగణికామోహనాపాఙ్గమూర్తిం
సేవ్యం శృఙ్గారభావైర్నవరసభరితైర్గోపకన్యాసహస్రైః
వన్దేహం రాసకేళీరతి మతిసుభగం వశ్యగోపాలకృష్ణమ్॥"

—శ్రీకృష్ణ కర్ణామృతమ్.

సాయంత్రసమపు వేళ మత్స్యాపుర (బందరు) కళాశాలా పరిసరోద్యానమున సైకతస్థలమున సాహిత్యవిదులును రసిక శిఖామణులును, గానరసాస్వాదనాపరులును నగు ననేకులగు మిత్రసత్తములతోగూడ విద్వద్గోష్ఠియందును మనోహర గానాలాపమునందును బ్రొద్దుపుచ్చుచుండగా బ్రథమమున మన కథానాయకుడగు గోపాలకృష్ణునిం గాంచగల్గితిని. నాటనుండియు నేటివఱకును మా ఇరువురకును స్నేహమును అనురాగమును బెరిగి పెంపొందిన కతమున నాతడు గురు ప్రాయుడై ప్రేమపాత్రుడైనాడు. ఏనాడు అతని స్నేహ సంపద నాకుం గైవసమయ్యెనో ఆనాడే నిజమగు మిత్రసత్తముడు,దొరకినాడను భావము నా మనస్సునం బ్రబలసాగెను. ఆ కారణమున నే నతని పరిచయము నెక్కువగ సంపాదించి యతని జీవితమునంగల విశేషములలోం బ్రధానములయిన వానిని గ్రహింపంగల్గితిని.

పైన నేను వర్ణించిన విషయము 1909వ సంవత్సరము నకుంజెందినది. మే మెల్లరము ఆ సంవత్సరపు వేసవియందు "ద్వితీయాంధ్ర విద్యార్థిసమావేశము"నకుం బ్రతినిధులముగా

బంచరుపురమునకుఁ జనితిమి. నేఁడు నాఁటి నాటాఁడును గూడ విద్యార్థులలో స్వరాజ్య, స్వధర్మ, స్వభావ నిరతిగణకాంక్ష యతిశయిల్లుచుండెను. వంగదేశ విభజనానంతరము ప్రబలిన బహిష్కారోద్యమము మహోవక్తయగు బిపిన్‌చంద్రపాలుని వాగ్ధారలచేఁ బోషింపఁబడి సర్కారువారు గావించిన నిర్బంధములచే దోహదముగావింపఁబడి స్వరాజ్య మహావృక్షముగఁ బరిణమించెను. అప్పటికే వంగదేశమున విద్యార్థులెల్లరును రక్తాబద్ధపాణులై దేశసేవావ్రతులై ప్రాణములసయితము లెక్కింపక స్వరాజ్యోద్యమమును వ్యాపింపఁ జేయుచుండిరి. సత్యము పరిపూర్ణముగ గోచరింపని కారణమునఁనో యేమో కాని నాఁటివిద్యార్థుల స్వరాజ్యోద్యమము రక్తపంకిలమై శాంతివిదూరమై ఘోరహత్యలకును క్రూరనిర్బంధములకును కారణమయ్యెను. కుధిరాంబోస్, కన్యాలాల్‌దత్తా, నరేంద్ర కుమారఘోష్ మొదలగువారు గావించిన హత్యలును వారనుభవించిన దుర్గతియు విద్యార్థుల మనోబోధిని నిరంతర సంచారము సేయఁదొడఁగెను. నాయకోత్తముఁడును సకల సాహిత్య విజ్ఞాన ధురంధరుండును మహామేధావియునగు శ్రీ అరవిందఘోష్ వన్దేమాతర పత్రికాముఖంబున స్వరాజ్యామృతరసమును నిరంతరధారగాఁ బ్రవహింపఁజేయుచుండెను. దాదాభాయినౌరోజీ కలకత్తాపురమున జరిగిన దేశీయ మహాజనసభలో 'భారతీయులకు స్వరాజ్యమే యాదర్శముగా నిర్దేశించెను. అభినవభారతపితామహుండనఁదగు నౌరోజీ యా దేశమును శిరసాగ్రహించి తిలకభానుఁడు మహారాష్ట్ర సీమను నిండు తేజముతోఁ బ్రజ్వరిల్లి యధికార నిర్బంధ

ఘోరమేఘ సంచన్న వేజుండై మాండలేపురమునఁ బ్రవాసము ననుభవించుచుండెను. మహామహులగు భారతీయుల నేకులు కారాగారమునఁ గృశించుచుండిరి. దేశమున నెచ్చట జూచిన నశాంతియు, నరాజకత్వమును విచ్చలవిడిఁ బెచ్చు పెరిఁగి సంచారము సేయుచుండెను.

ఇట్టి దేశకాలపరిస్థితులలో సమావేశమయిన యాంధ్ర విద్యార్థులు తమ భావికర్తవ్యమునుగూర్చి తీవ్రముగ నాలోచించిరి. స్వరాజ్య సంపాదనమునకయి విద్యార్థులు సలుపఁదగిన కృషిని సల్పుటకు వారు ఎల్లరును గృతనిశ్చయులై యుండిరి.

ఆ సంవత్సరమున మచిలీపట్టణమున జరిగిన విద్యార్థి మహాసభ యద్వితీయ ప్రాఖ్యమును గడించునట్లు చేసిన వారిలో మన కథానాయకుఁడగు గోపాలకృష్ణుఁడొకఁడు. అప్పటికే శ్రీ గోపాలకృష్ణుఁడు రాజకీయ విషయములం దత్యంతశ్రద్ధవహింపుచు స్వరాజ్య స్వధర్మరక్షణాకాంక్ష నమితముగ వహించుచు భావికాలమునఁ దనకు లభింపనున్న యుచ్చస్థితికిఁ బునాది నేర్పఱచుకొనుచుండెను. అప్పటికే యతఁడు వాక్చమత్కారమును రసగ్రహణ పారీణతను కార్యోత్సాహమును మేధాశక్తిని గానపటిమను నమితముగఁ బ్రదర్శింపసాగెను. అందుచే నానాఁడు సాయంకాలమున వనాంతమున సైకతస్థలమున రాసక్రీడాభిరతుఁడై యున్న గోపాలకృష్ణుఁడెట్లు శృంగారభావనలును నవరసభరితలునునగు గోపకన్యాసహస్రముల కతిసుభగుఁడై త్రైలోక్యాకర్షణా

ఱుండై సురవరగణికా మోహనాపాంగమూర్తియై ప్రేమ
పాత్రుండై యెప్పటెనో యట్లే మన చుగ్గిరాల గోపాల
కృష్ణుండును స్వరాజ్య సంపాదనోత్సాహ భరితులును పవిత్ర
హృదయులును సంగీతసాహిత్య విద్యాపరిచితులును నగు
విద్యార్థిసహస్రములకు మిగులఁ బ్రేమభాజనమై విలసిల్లెను.
నాఁటనుండి నేఁటివఱకును విద్యార్థిబృందములకు మన గోపాల
కృష్ణునిపై ననురాగ మతిశయించుచునే వచ్చుచున్నది.

గోపాలకృష్ణుఁడు తాను గుంటూరుమండల వాస్తవ్య
డయ్యుఁ గృష్ణామండలమున నే నందిగామతాలూకా పెనుగంచి
ప్రోలున ది2_6_1889(విరోధి సంవత్సర జ్యేష్ఠ శుక్ల)నాఁడు జన్మము
నొందితిననియు నకారణమున నుభయమండలములును
దనకుఁ ప్రేమపాత్రములేయనియు నాతో నొకటిరెండు
మాఱులు ప్రసంగవశమునఁ జెప్పెను. ఇతని పూర్వీకుల నివాస
స్థలము గుంటూరుమండలమునందలి కూచినప్రూడి యగ్రహా
రము. పురిటిలోననే యీతనితల్లి మరణించెను. కాని
యీతని పితామహి తల్లిలేని యీ పసిగందును చేరఁదీసి
యనేకవిధములఁ గాపాడుచుఁ బెంచుచుండెను. ఇతని రెండు
సంవత్సరము వచ్చుసరికిఁ దండ్రికూడఁ గనివయ్యెను. అందుచే
నితనికిఁ బుట్టిననాటనుండియుఁ దల్లిదండ్రులు సర్వబంధువులును
నితని పితామహియే యగుటచే నామెయెడ గోపాలకృష్ణుఁడు
అమితానురాగమునుజెంది యుండెను. ఆమెయే యతనికి
విద్యాబుద్ధులఁజెప్పించి యతనితోఁగూడ గుంటూరుపురమునఁ
గాపురము సేయుచుఁ గన్నులన్నియు నతనిపైననే పెట్టుకొని
యతఁ డెన్నఁడు విద్యావంతుఁడగునా? యెన్నటి కక్కజమకు

వచ్చునా? తలిదండ్రుల వంశమును నిల్పి యెన్నఁడు కీర్తి ప్రతిష్ఠల గడించునా? యనుచు నాశాపూర్ణ హృదయయై నిత్యము భగవత్ప్రార్థనఁజేయుచుఁ గాలముఁ బుచ్చఁదొడఁగెను. బడినుండి యతఁ డింటికి వచ్చుట కొంకించుక యాలస్యమైనయెడల నామె యేమియుఁ దోఁచనిదై యతనికై వీథులందు వెదకుచు నతనిరాకఁ గాంచునటకు నల్లాడుచుండెడిదఁట. ఆమె వేగన్నుల నతనిని గాపాడిన కతముననే తలిదండ్రులు లేని వాఁడగు నతఁడు పెరిగి పెద్దవాఁడై ప్రవేశ (మెట్రిక్యులేషన్) పరీక్షయందు తీర్ణుఁడై గుంటూరుపురమున నున్న కళాశాలలో యఫ్. యె. పరీక్షకుఁ జదువుచుండెను. గోపాలకృష్ణుని పితా మహుని జూచు నవకాశము నాకుఁ గొలఁదికాలముక్రిందటనే లభించినది. ఆమె యిప్పటికిని * గోపాలకృష్ణుని యెడల నపరిమిత వాత్సల్యముగలదై యతఁడే లోకముగా నతఁడే ప్రాణముగ నతఁడే నామమంత్రముగ నెంచి ప్రేమించుచు నెల్లప్పుడు నతని నామమునే స్మరించుచు జీవయాత్ర సాగించుచున్నది. అతఁ డూరికిఁ జని తిరిగివచ్చుట కాలసించిన యెడల నామె వీథియరుగుపై మంచము వైచుకొని వీవనచే గ్రీష్మతాప ముపనయించుకొనుచు వీథిని బోవువారినెల్లర "నాయనా! మా గోపాలకృష్ణుఁడు గాన్పించినాఁడా? మా గోపాలకృష్ణుఁ డెప్పుడు వచ్చును? అయ్యయ్యో యింకను రాకున్నాఁడే? నా కేమియుఁ బాలుపోకున్నది. నే నెప్పుడు నతని వీడియుండినదాననుగాను మీకుఁ గాన్పించె నేని యతనిని శీఘ్రముగా రమ్మనుఁడీ!" యని ప్రార్థించుచుండె

* 1922 సంవత్సరంలో మరణించెను.

డిది. ఆమెయే యతనికి సంగీత సాహిత్యములయందుఁ బ్రవేశము గల్గించెనని గోపాలకృష్ణుఁడు నాతోఁ జెప్పుచుండెడివాఁడు. వింతవింత కథలును విచిత్ర పురాణగాథలును నామె నిత్యమును నతనికిఁ జెప్పుచుండెడిదఁట. చక్కనిపాటలను ఆధ్యాత్మరామాయణ కీర్తనలను దరంగములను నామె యతనికి విన్పించుచు సంగీతమున నతని కమితాభిరుచిని గల్పించుచుండెను. అట్టి యభిరుచి పెంపొందిన కారణమున నతఁడు సంగీతము బాగుగా నేర్చుకొని గుంటూరుపురమున నున్న యువజన నాటకసంఘములలో సభ్యుఁడై తన గానపటిమచే నాటకాభిమానులగు ప్రేక్షకుల కెల్లరకు నమందానందమును గూర్చుచుండెను. గుంటూరు యువజననాటక సంఘమున మే మిరువురమును సభికులుగ నుండిన కారణమున మా స్నేహము మఱింత ప్రవర్ధమయ్యెను. ప్రసన్న యాదవనాటకమునను గయోపాఖ్యాన నాటకమునను నతఁడు శ్రీకృష్ణ పాత్రను ధరించి తన సంగీత నైపుణ్యమున సభ్యుల నానందింపఁజేసి తన సాహిత్య వైశారద్యమునలన రసపోషణము గావించిన విధము నేఁటికిని నా కనులఁ గట్టినట్లే యున్నది. నాటకాభిమాను లెల్లరును గోపాలకృష్ణుని వేషమును జూచుటకు వందలకొలఁదిగ వచ్చుచుండెడివారు. ఎల్లరును నతఁడు మహాసంగీత విద్వాంసుఁడును భరతశాస్త్ర ప్రవీణుఁడనుగ నై యాంధ్రదేశమునకుఁదప్పక వన్నె తేఁగలఁడనియాసించుచుండిరి♦

♦ ఈ సందర్భమున 17-6-1907 న శ్రీగోపాలకృష్ణుఁడు తన పిన తండ్రిగారికి బాపట్లనుండి వ్రాసిన యుత్తరము స్థలాంతరమున ప్రచురింపఁబడినది.

ఆ దినములలోనే మే మందరమును రెడ్డిప్రభువుల రాజధానియై యఖండవైభవమునుగాంచి కాలక్రమమున శిథిలమయి నామమాత్రావశిష్టమయియున్న కొండవీడుదుర్గమును దర్శింపనేగితిమి. గుంటూరుపురమున రైలుబండిలో నెక్కి సరికిఁ జీకటిగనేయుండెను. కాని షిరంగిపురము స్టేషనులోదిగి బండ్లపై సామానులఁ గట్టికొని కొండవీడు దుర్గముదారిని ప్రయాణమయి కొన్ని గజములదూరము చనినతోడనే పూర్ణచంద్రుఁడు మింట హఠాత్తుగ నుదయించి తత్ప్రదేశమునెల్ల శుభ్రజ్యోత్స్నావిలసితముఁ గావించి యెన్నఁడో మాసిపోయిన కొండవీటిదుర్గ వైభవమునెల్ల దిక్ప్రదర్శితముఁ గావించి స్మృతిపథమునకుఁ దెచ్చెను. పర్వతములపైన దుర్గమమగు స్థానమున శత్రువుల కభేద్యముగ లోని జనులకు ధైర్యామోదజనకముగఁ గట్టఁబడిన యా కొండవీటిదుర్గము మా కన్నుల యెదుట యా తెల్లనివెన్నెలలో స్పష్టముగఁ గాన్పింపఁ జొచ్చెను. తోడనే మా హృదయములెల్లఁ బల్లవింపఁ జొచ్చెను. విస్మృత భారతీయ వైభవమెల్ల నొక్కపెట్టున జ్ఞప్తికివచ్చి మనములు విచారపూరితములు గాఁ దొడఁగెను. అఖండవైభవము ననుభవించిన యా దుర్గముఁ గాంచుటకయి యుత్కంఠనందుచున్న హృదయములతో చల్లనివెన్నెలలో మందమారుతముచే నపనయింపఁబడిన యాయాసముగల దేహములత్రో నారాత్రి మేము గావించిన ప్రయాణ మీనాఁటికిని నాకు మఱపునకు వచ్చుటలేదు. త్రోవపొడవునను నేనును గోపాలకృష్ణుఁడును మఱియొక మిత్రుఁడును గీతములఁబాడుచు

రాగముల నాలాపించుచు మిత్రులకెల్ల నాయాసము నపనయించుచుంటిమి. ఆనా డా శుభ్రజ్యోత్స్నా విలసిత ప్రదేశమున సహజ విమలోచ్చైస్స్వరములతో —

శుభ్రజ్యోత్స్నా పులకిత యామినీం
ఫుల్ల కుసుమిత ద్రుమదళ శోభినీం
సుహాసినీం - సుమధురభాషిణీం
సుఖదాం - వరదాం - మాతరమ్ - వందేమాతరమ్.
సుజలాం-సుఫలాం - మలయజశీతలాం
సస్యశ్యామలాం - మాతరమ్ - వందేమాతరమ్.
త్రింశత్కోటికంఠకలకలనినాదకరాళే
ద్వాత్రింశత్కోటిభుజైర్ధృత ఖరకరవాలే
కధయంతి జనాస్తావం కధం మాతరబలాం
నమామి తారిణీం యుగధారిణీం
రిపుదల వారిణీం - వందేమాతరమ్.

అను గీతమును రాగ తాళ భావసహితముగా రస స్ఫూర్తి యుట్టిపడునట్లుగా నతడు పాడుచుండ వినిన నావీనుల భాగ్యమనల్పమని నేటివఱకును భావించుచుంటిని. ఆతడు ఒక్కొక్క చరణమును బాడి విరమించినత్రోడనే మేము పల్లవినందుకొని పాడుకొనుచు నతి శీఘ్రగమనమున దుర్గమును జేరితిమి. చేరి యత్యున్నతమగు పర్వతాగ్రమున నున్న యా దుర్గమును సమీపింప దుర్గమమగు పర్వతారణ్య మార్గమున నించుకేనియు శ్రమమని భావింపక యతిత్వరితముగా

నెక్కితిమి. ఎక్కి యచ్చటనున్న నేతికొట్టుకడ మృధుమధుర స్వరముతో బ్రవహించుచుండిన కొండసోన ప్రక్కన గూరు చుండి చల్దులనారగించి యా ప్రదేశమునెల్లఁ దిరుగాడి విశే షములనెల్లఁ దిలకించితిమి. ఆ సోనప్రక్కన సుఖాసీనులమై గూరుచుండి యున్నపుడును, షడ్రసోపేతమును, మాసచక్రాది రుచ్యాహారసహితమునునగు భోజనముగావించు చున్నపుడును గోపాలకృష్ణుడు "పావన మధురానిలయే, పాండ్యరాజతనయే, అంబా, దేవీ, మీనాక్షీ" యను గీతమును నిఖిలకళ్యాణ ప్రదమగు కళ్యాణిరాగమునఁ బాడుచు మమ్ముల నెల్లర నమం దానందమున ముంచినరీతి నేఁటికిని మరువజాలను. అచ్చటి విశేషములను, గొండవీఁటిదుర్గ పూర్వవైభవమునుగని గోపాల కృష్ణుని హృదయము పల్లవించిన కతననే యానాఁడతనిగాత్ర మంత యవ్వాజమాధురీ విలసితమై యొప్పెనని చెప్పిన తప్పు గాదు. అప్పటినుండియు గోపాలకృష్ణునికిఁ గొండవీఁటిపైనను, రెడ్డిచేఁ బాలింపఁబడిన పల్నాటిసీమపైనను, గుంటూరుమండ లముపైనను నమితమగు నభిమాన ముదయించి ప్రబలఁ జొచ్చెను. ఈ యభిమానమే నేఁడతని నింత గొప్పవానిని గను కార్యదీక్షాపరతంత్రునిగను నొనర్చినది. గుంటూరుమండ లముయొక్క కీర్తిని పూర్వవైభవమునుగాపాడి దానిని ఆంధ్ర మండలములకెల్ల శిరోభూషణము గావింపవలెనని నాఁటనుం డియు నతఁడు కోరుచునే యుండెడివాఁడు.

ఈ కోరికతోనే గోపాలకృష్ణుఁడు మిత్రుఁడగు నడింపల్లి నరసింహారావుగారితోఁగూడ తనకై యనుక్షణమును గలవ

రించు పితామహుని క్రొత్తగా కాపురమునకునచ్చిన సతీతిలక
మును సైతముపీడి యాంగ్ల దేశమునకు విద్యాభ్యాసమునకై
యేగెను. అప్పటికి ఆంధ్రదేశమునుండి కొలఁదివఁదిమూ త్రమే
విద్యాభ్యాసార్థము పరదేశముల కేగిరి. పరదేశములయొక్క
విజ్ఞానమును సంపాదించినగాని లాభముండదను భావ మప్పు
డాంధ్ర దేశమునను మిక్కిలి వ్యాపించియుంటచే గోపాలకృష్ణుము
మిత్రునితో నింగ్లాండు దేశమున విద్య నభ్యసించుచుండెను.
స్కాట్లండ్ దేశమునందలి ఎడింబరోపురమునన్న విశ్వవిద్యా
లయమున నతఁడు వేదాంతశాస్త్రమును, అర్థశాస్త్రమును,
రాజ్యతంత్రమును, వ్యవసాయశాస్త్రమును నభ్యసించుచుం
డెను. విద్యావిషయమున మొదటినుండియు గోపాలకృష్ణు
డత్యంత శ్రద్ధవహించుచు జ్ఞానసంపాదనము గావించుచుండెను.
తోడి విద్యార్థులెల్లరు నతని తెలివితేటలను, వాగాటిని, చమ
త్కార ప్రసంగములను, గానవిద్యా ప్రావీణ్యమునుగని
యతని నమితముగ ప్రేమించి గౌరవింపుచుండిరి. ఎడింబరో
పురమందలి భారతీయ సంఘమున కతడు కార్యదర్శిగనుండి
అత్యంతగౌరవమును గడించెను. అతడు ఎడింబరో భారతీయ
సంఘ కార్యదర్శిగనున్న దినములలో ప్రస్తుతము మంత్రిగా
నున్న యొక్క పెద్దమనుష్యుఁడు ఇంగ్లాండు దేశమున కుద్యో
గము సంపాదించు నుద్దేశముతో నేగి పైకిమాత్రము భారతీయ
విద్యార్థుల యోగక్షేమముల నరయవచ్చితినని ప్రగల్భములఁ
బల్కుచుండ విని యాయనకు మిగుల చమత్కారముగను,
సరసముగను, తెలివి వచ్చునట్లుగను "అయ్యా! ఉద్యోగము

సంపాదించుకొనుట కెన్నో యుపాయములున్నవి. 'ఉదర నిమిత్తం బహుకృతవేషః' అన్నట్లు నీకీ వేషమేటికయ్యా? భారతీయ విద్యార్థులు నీలాటివారిసాయ మక్కరలేకయే బాగుపడగలరు పొ"మ్మని చీవాట్లు పెట్టి బుద్ధిచెప్పి పంపివైచె నట. ఈ కాలమునసే గోపాలకృష్ణుఁడు గొప్పగొప్ప పండిత శులత్రోడను రాజకీయ వేత్తలత్రోడను పరిచయము గావించు కొని వారి కెల్లరకును స్నేహపాత్రుడయ్యెను.

ఒకనాఁడు భారతీయ విద్యాసంఘసభలో ప్రసంగము గావించుచుండగా గోపాలకృష్ణుని పండిత్రోత్తముఁడును భారత కళాశాస్త్రవేత్తయునగు నానందకుమారస్వామిగారు తిలకించి యతని వాజ్ఞాధుర్యమునకును నుపన్యాసధోరణికిని నబ్బుర ముజెంది యతనిని తన మిత్రకోటిలో జేర్చికొనెను. నాఁటి నుండియు గోపాలకృష్ణుఁడు తాను సీమలో నున్నంతకాలమును నానందకుమార పండితుని దర్శనము నిరంతరము గావించుచు నతని కతిపరిచితుఁడై ముఖ్యశిష్యుఁడై ప్రియస్నేహితుఁడయ్యెను. స్నేహితవత్సలుఁడగు నానందకుమార పండితుఁడు గోపాల కృష్ణుని గొన్నిమాసములు తనయింట నుంచికొని యతిథి పూజ గావించుచు నాదరించెను. భారతీయ నాగరకతాభి మానియు, భారతీయశాస్త్ర సంప్రదాయవేత్తయు, సంగీత శిల్పాద్యనేక కళావిమర్శకుఁడును, దేశభక్తాగ్రేసరుఁడును నగు నానంద కుమారపండితుని యింట గురుకులవాసము జేసి గోపాలకృష్ణుఁడు గురువుయొక్క బోధను సాకల్యముగ నలవరిచి కొని వెనుకటికి ప్రహ్లాదుఁడు తండ్రియగు హిరణ్యకశిపునిత్రో

జెప్పినట్లుగ "చదువులలో మర్మమెల్ల" జదివెను. సుప్రసిద్ధ పాశ్చాత్య గాయకురాలగు నానందకుమారుని సతీతిలకము గోపాలకృష్ణుని గాననైపుణిని గని యచ్చెరువంది యతనిచే అపురూపములును, లలిత మధురములును నగురాగములను భావపూర్ణములగు గీతములను భక్తిరసప్రపూరితములగు కీర్తనములను వినుచు నతని గురువుగా భావించి యాదరింప జొచ్చెను. వారియపుర స్నేహసంపదచే గోపాలకృష్ణు డమిత సంతోషమున ప్రవాసక్లేశ మేమాత్రమునను భవింపకుండ కాల ముగడుపుచు తుదకు ఎడింబర్గో విద్యాలయమున ఎం. యే. పరీక్షయం దుత్తీర్ణుడై పండితజన పరిచయమున కుచితమగు ఫలితముగాంచి కృతార్థుడయ్యెను. కుమారస్వామి పండితుని బోధనచే నిదివరకే యతనియందున్న దేశాభిమానము మఱిం త పెచ్చు పెరిగినదయ్యెను. భారత నాగరకతా ప్రభావమెల్ల నతడు గురుముఖతః గ్రహించెను. దాని ప్రత్యక్షస్వరూప స్వభావముల బరిశీలించి గ్రహించు నుద్దేశముతోడను తాను గడించు విజ్ఞానమును సద్వినియోగము గావించు నుద్దేశము తోడను నతడు వేఱువృత్తిలో ప్రవేశింప బ్రయత్నింపక యుపాధ్యాయపదమునే యాశించెను. గురువగు నానంద కుమార పండితుడు మనఃపూర్వముగ నాశీర్వదించెను. ఉపా ధ్యాయులగు మార్షలు పండితుడు మొదలగునా రతని విద్వా వైశారద్యము ననేకవిధముల గొనియాడుచు యోగ్యతా పత్రము లొసంగిరి. పట్టభద్రుడై గురువుల యాశీస్సుల నంది కొని, శుభముహూర్తమున స్వదేశోన్ముఖుడై పయనమై

సుఖప్రయాణము గావించి జన్మభూమిజేరి తనరాకకై గోపాల కృష్ణ స్మరణము గావించుచుండిన పితామహిని, నేకాకినియై యేకభుక్త వ్రతమున కృశించియుండిన యిల్లాలిని తన శుభా గమనమున కెదుర జూచుచుండిన మిత్రబృందమును దర్శించి వారందరతోగూడ నమందానందమున నోలలాడుచు కొంత కాలము గడపెను.

తృతీయ ప్రకరణము

ఆచార్యపదవి (1917 - 1919)

సీమనుండి స్వదేశమునకు వచ్చిన కొలది కాలమునకే గోపాలకృష్ణుడు సర్కారువారిచే రాష్ట్రీయ విద్యాశాఖలో జేర్చికొనబడి రాజమహేంద్రవరమునందున్న బోధనాభ్యాసన కళాశాల (Training College) యందు చరిత్రమును అర్థ శాస్త్రమును నేర్పుటకు పండితుడుగ నియోజింపపడెను. సీమలో మార్కల్ పండితుడు మొదలగు వారొసంగిన యోగ్య తాభినందన పత్రికలతని కిప్పు డెంతయేనియు నక్కరకు వచ్చెను. ప్రభుత్వమువా రతని విద్వాపాండిత్యమునుగ్రహించి మాసమునకు రెండువందల రూప్యముల వేతనమొసగి యతని పండితునిగా నియమించిరి. గోపాలకృష్ణుడు నిజమనోరథము సిద్ధించినదనియే సంతసించెను. తన పాండిత్యమును విద్యార్థుల కలవడజేయ నలవియగును గదాయని యత డాశించెను. తన కత్యంత ప్రేమ పాత్రులగు విద్యార్థుల భావిస్థితిని చక్కబరచు టకు దగిన యవకాశము లభించెగదాయని యితడు మనమున

సంతుష్టినొందెను. శాంతముగ ప్రపంచ విజ్ఞానమునెల్లగ్రహిం
చిప్రత్యక్షముగ ననుభవించి ముక్తి నొందవచ్చును గదా
యని యత డువ్విళ్లూరుచుండెను.

కాని యతని కచిరకాలమునసే యాశాభంగ మొదవ
బడెను. గోపాలకృష్ణుడు సీమలోనలెనే యీ దేశమునగూడ
నుపాధ్యాయునకు స్వాతంత్ర్యముండునని యూహించెను.
ప్రభుత్వశాసనముల కాధిన్య ముపాధ్యాయుల బాధింపనేరదని
యతడాశబూనెను. నిజమనో సామ్రాజ్యాధిపత్యమునకు చ్యుతి
సంభవింపదుగదాయని యత డూహించెను. కాని భారత
వర్షమును పాలించుచుండిన యాంగ్లేయ ప్రభువుల ప్రకృతిని
నతడింకను తిన్నగ గ్రహింపజాలడయ్యెను. రాజమహేంద్ర
వరమున పండితుడుగనున్న దినములలో నతడు విద్యార్థుల
కత్యంత ప్రేమభాజనమై వారితో కలసి మెలసి సంచరించుచు
వారి కష్టసుఖముల విషయమున నమితమగు శ్రద్ధనహించుచు
తొల్లింటికాలపు గురువులబోలె విద్యార్థులకు పితృప్రాయుడై
యొప్పుచుండెను. ఇట్టి చర్య సీమనుండి దేవతలబోలె భారత
దేశమున దిగి విద్యార్థులపై నించుకేనియు నభిమానముంచక
జీతములను ఉద్యోగములను మాత్రమే ప్రధానలక్ష్యముగ
గ్రహించుచు విద్యార్థులతో నెడమొగము పెడమొగముగ
నుండు నాంగ్లేయ పండితులకు కంటకముగా నుండెను.
గోపాలకృష్ణు డనుభవించుచుండిన ప్రజానురాగమును విద్యా

ర్థుల కతని పైగల యభిమానమును పైయధికారుల కన్నుల నెఱ్ఱజినగావించెను. ఈతని నెట్లు విద్యార్థి బృందములనుండి చీల దీయగలమాయని యోజించుచున్న కళాశాలాధికారులకుకోప కారణములు వెంటనే మొలకలెత్త సాగెను. కళాశాలావిద్యా ర్థులు ప్రతి సంవత్సరమును మెట్రిక్ దొరయొక్కవార్షికోత్స వమును జరుపుచు తత్సందర్భమున గళాశాలాధ్యక్షునే సభాధ్య క్షుని గావించుచుండిరి. అట్లే చాలాకాలముజరిగి యది యొక సాంప్రదాయముగ స్థిరమైపోయెను. కాని గోపాలకృష్ణుడు పండితుడుగ ప్రవేశించిన సంవత్సరమున విద్యార్థులు సంప్ర దా యమును గాలి కెగురగొట్టి నిజమనోధినాథుడగు గోపాల కృష్ణునే యా సంవత్సరోత్సవ సందర్భమున నగ్రాసనాసీనుని గావించి కళాశాలాధ్యక్షుని బారి కతని గుఱిగావించిరి.

అదియునుగాక గోపాలకృష్ణుడు విద్యాబోధనా పద్ధతు లలో నూతన పథముల ద్రొక్కసాగెను. సంప్రదాయమును అనగా కళాశాలలో పండితులు సాధారణముగ నవలంబించు పద్ధతిని లెక్కచేయక నవీన మార్గముల నన్వేషించి విద్యార్థి హృదయముల పల్లవింపజేయసాగెను. చరిత్రను బోధించు టలో నతడు "Reconstructing History from ancient and popular sources" (పురాతనములును జనసమ్మతము లునునగు నాధారములపైన చరిత్రను పునర్నిర్మాణము గావిం పదగును) అను సూత్రము నవలంభించుచుండెను. ఏ విన్సెన్టు దొరయో, యే మాడ్లెన్ దొరయో యే సిన్క్లెర్ దొరయో వ్రాసిన పక్షపాత పూర్ణములగు తప్పుడు చరిత్ర గ్రంథముల

బోధింపక యతడు ప్రాచీనములును, జనసమ్మతములునగు కావ్యపురాణాదులను, శిల్పములను, యక్షగానములను, జంగముకథలను, శాసనములను నాధారముగగొని చరిత్ర మును బోధింపుచుండెడివాడు. ఈ పద్ధతి ననుసరించి యతడు కళాశాలలో కావ్యపురాణాదులనుండి పద్యముల జదివి వినిపించుచుండెను. జంగమదేవరులచే బొబ్బిలికథ, దేసింగురాజు కథ, కాంభోజరాజుకథ, కామమ్మకథ, మొదలగు జనసమ్మతములగు కథల కళాశాలలో జెప్పింపసాగెను. వీరరసప్రధానములగు నీకథల వినినతోడనే విద్యార్థి హృదయములు కలిగి ప్రవహింపజొచ్చెను. వారిలో దేశాభిమానమును స్వరాజ్య సంపాదన కాంక్షయు, ప్రాచీన భారత వైభవోద్ధరణకాంక్షయు మొలకలెత్తసాగెను. ఇదియంతయు కొఱమాలిన విద్యను నేర్పి భారతీయులనెల్ల పాశ్చాత్య నాగరకతకు దాసులనొనర్ప వలెనను మెకాలే యాశయము సఫలముజేయు నుద్దేశము తోడను, జీవనోపాధికొఱకును నుపాధ్యాయపదవి నవలంబించిన యాంగ్లేయ పండితులకు రుచింపదయ్యెను. అసూయా బీజము లప్పుడే నాటుకొనసాగెను.

ఇట్లుండగా నగ్నిహోత్రమున కాజ్యము తోడైనట్లుగ గోపాలకృష్ణుడు బందరుపురమున జరిగిన విద్యార్థి మహాసభకు అగ్రాసనాధిపత్యమువహించి సర్కారువారిబారికి గుఱియయ్యెను. అప్పటికే దేశమున అనిబిసెంటమ్మ యొక్కయు, తిలక్ మహారాజుయొక్కయు నిరంతర కృషివలన స్వరాజ్యోద్యమము పెచ్చు పెఱుంగుచుండెను. దేశమంతయు నమితో

తాత్సాహముతో స్వరాజ్యమునకై కృషిసల్ప దొడగెను. యిట్టి మహోద్యమమున పవిత్ర హృదయులును భారత భావిభాగ్యని ధానులును నగు విద్యార్థులు పాల్గొనుటలో నాశ్చర్యమేముం డును? కాని విద్యార్థులనెల్ల గుమాస్తాలుగను బానిసలుగను తయారుజేయ నెంచిన సర్కారువారికిది కంటకముగనుండుటచే విద్యార్థులు రాజకీయ విషయముల బాల్గొనరాదని యుత్తరవు గావించిరి. అదియే సుప్రసిద్ధమగు కవకవ నెంబరు ప్రభుత్వపు టుత్తరవు. ఆ యుత్తరవు విద్యార్థి జనుల గౌరవమునకు భంగకరమైనదగుటచే చెన్నపురి రాజధానియందలి విద్యార్థు లెల్లరును సభలగావించి యేకగ్రీవముగ నా యన్యాయమగు నుత్తరవును నిరసించిరి. విద్యార్థిజనుల యాగ్రహమును దేశ సేవా వ్రతదీక్షయు ననేకోపన్యాస వేదికోపరి భాగములనుండి గంభీరనినాదము త్రోడ దేశమున నెల్లెడ బ్రతిధ్వనింపసాగెను. అట్టి ప్రతిధ్వనులలో నొకటి మన గోపాలకృష్ణుని యధ్యక్ష తను జరిగిన యాంధ్రవిద్యార్థి మహాసభలోవిన బడెను. అధికారులు దద్దరిలిపడిరి. ఈ యమితోద్రేకమును నాశము గావించు, టెట్లాయని వారుపన్నాగముల బన్నదొడగిరి. ఆ పన్నాగముల ఫలితము మన గోపాలకృష్ణుని కపకారముగ బరిణమించినదయ్యెను.

దీనికిం దోడుగా గోపాలకృష్ణుని సతీతిలకమునకు శరీర స్వాస్థ్యము తప్పిన కతమున నతడు నియమితకాలమున నిత్య మును గళాశాలకు వచ్చుటకు వలనుపడకుండెను. తత్కారణ మున గళాశాలాధికారులకును నతనికిని మనస్పర్థలేర్పడి తత్ఫలి

తముగఁ గళాశాలాధ్యక్షుఁడు మన గోపాలకృష్ణుని నించుక చులుకనఁగ బల్కుటయు నందుపై నభిమానియు రోషపూరితుండునగు నతఁడు ఆగ్రహముజెంది మాఱుఁబల్కుటయుఁ దటస్థించినది. గోపాలకృష్ణుఁడు ప్రభుత్వ విద్యాశాఖయందలి యుద్యోగ సౌఖ్యమును సౌష్ఠవమును గనుఁగొనినవాఁడై తనకు బంధవిమోచనమెప్పుడగునా?యని యెదురు చూచుచుండెను. ఇంతలో దైవదత్తముగ బంధవిముక్తి శీఘ్రమే యతనికి లభించెను. సర్కారువారు గోపాలకృష్ణుని రాజకీయ విషయములఁ బాల్గొనుచున్నట్లును, రాజకీయోద్యమమునకు సంబంధించిన యాంధ్రవిద్యార్థి మహాసభ కగ్రాసనాధిపత్యమును వహించి ప్రభుత్వమువారి యుత్తరువుల నుల్లంఘించినట్లును భావించి తాను గావించిన యకృత్యములకయి తుమాపణనొసఁగవలసినదిగా నిర్బంధించిరి. కాని నిశ్చలదేశాభిమానియు, సత్య వచోఽభిలాషియునగు గోపాలకృష్ణుఁడు స్వగౌరవమును మానమును బౌరుషమును ధనమునకన్నను, ఉద్యోగము కన్నను నెక్కువగ భావించి తుమాపణనొసఁగ నిరాకరించి దాస్యవిముక్తుండయ్యెను. ఈ కాలములో నతఁడు రాజమహేంద్రవరమునఁ బ్రభుత్వకళాశాలలో వేదాంత పండితుడుగనున్న సర్వేపల్లి రాధాకృష్ణయ్యగారియొక్కయు, గజపల్లి రామచంద్రావుగారియొక్కయు, భిషజ్మణియగు పాలకోడేటి గురుమూర్తిగారియొక్కయు పరిచయము సంపాదించి రాజమహేంద్రవరపౌరుల కత్యంతగౌరవపాత్రుండయ్యెను. ఆ పురజను లెల్లరును గోపాలకృష్ణునివంటి దేశాభిమానికి జరిగిన యపకారమునకుఁ గినిసియు, లోలోన నతఁడు బంధవిముక్తుఁడై

యధేచ్ఛముగ దేశసేవఁ గావింపగల్గునవకాశము పొందెను గదాయని సంతసించియునుండిరి. రాణ్మహేంద్రవర వ్యవహారముతో నతని జీవితమున నొకరంగము శాశ్వతముగ ముగిసినదయ్యెను. ఇఁక ముందెన్నఁడును ప్రభుత్వోద్యోగము నభిలషింపఁగూడదని గోపాలకృష్ణుఁడు తీర్మానించుకొనెను. చానో, ప్రదుకో, వేదఖిక మో, భాగ్యమో, సుఖముగ దేశీయుల చల్లని పోషణము క్రిందనే యనుభవింప నతఁడునిశ్చయించెను. విదేశప్రభుత్వముపారొనప్పు మన్ననలన్నెల్ల సవతితల్లి ప్రేమయుంబోలె బూటకములే యనియు దేశీయుల నిష్కళంకాదరణమే సౌఖ్యదాయకమనియు శాన్తిప్రదమనియు, భావించి గోపాలకృష్ణుఁడు ఏదేని జాతీయవిద్యాలయమున నుపాధ్యాయపదవిని స్వీకరింపఁ గుతూహలుఁడై యుండెను.

మ్రొక్కబోయిన దైవమెదురైనట్లుగ వెంటనే యతనికి మచిలీపురమునన్నయాన్ధ్రజాతీయకళాశాలలో నుద్యోగము లభించెను. ఆ కళాశాలాధ్యక్షులగు కీర్తిశేషులగు కోపల్లె హనుమంతరావుగారు గోపాలకృష్ణుని పాండితీవైభవమును గూర్చియు ననల్పగానకల్పనా నైపుణిని గూర్చియు దేశాభిమానము గూర్చియు మిక్కిలిగ వినినవారై తమ కళాశాలలో సంగీత సాహిత్యాది కళలను బోధించు పండితునిగనుండుమని యతనిని గోరిరి. "నల్లె"యని యత డందుల కియ్యకొనెను. నిజమనోవాంఛాఫలసిద్ధి యగుఁగదా యని-శాంతి చేకూరునుగదాయని - యతఁడు మనమున నెంతయో యువ్విళ్ళూరుచుఁ బండితపదవియం దుండుట కంగీకరించెను. ఇందాశ్చర్య మేమియుండును? గోపాల

కృష్ణుడా ? దేశాభిమాని - ఆర్యవిద్యాభిమాని - భారతీయ నాగరికతాభిమాని. కళాశాలయా ? భారత ధర్మములను భారత నాగరకతను భారత దేశాభిమానమును భారత దైశ్వర్యమును, పునరుద్ధరించుటకై స్థాపింపఁబడిన జాతీయకళాశాల- అందుచే నీ విద్యాలయము మన గోపాలకృష్ణుని మనము నెక్కువ నాకర్షించెను. శాంతచిత్తుఁడై వశీకృత నిజమానసుఁడై సర్వస్వతంత్రుఁడుగ నిజమనస్సామ్రాజ్యాధిపత్యమును ననుభవింపఁ గుతూహలమును నాశయును గల్గినవాఁడై బందయనందలి యాంధ్ర జాతీయకళాశాలాపండితపదవియందు బ్రవేశించెను.

కాని-అచ్చటనుగూడ నతనికి ఆశాభంగము సిద్ధింప నుండెను. కళాశాలా నిర్వహణ మొక్క కోపల్లె హనుమంత రావుగారి వశమునకేకాక భిన్నప్రవృత్తులును భారత సంప్రదాయములయెడఁ పరిపూర్ణాభిమానము లేనివారును జాతీయ విద్యాపద్ధతులను ఆర్యధర్మములను బాగుగా నెఱుఁగనివారును నగు నవనాగరక విద్యాభిమానుల చేతులలోగూడ నుండుటచే నిచ్చట్గూడ మన గోపాలకృష్ణునకు మనశ్శాంతి చేకూరఁ గల్గు భాగ్యము లభింపదయ్యెను. పాశ్చాత్య పద్ధతులపైనను పాశ్చాత్య నాగరకతపైనను అభిమానమును బూర్తిగా వీడఁ జాలక యుండిన కళాశాలా నిర్వాహకవర్గమువారికి మన గోపాలకృష్ణుని విద్యాబోధనాపద్ధతులు సరిపడనయ్యెను. రసిక శిఖామణియు సకలకళా రహస్యవేదియునగు గోపాలకృష్ణుడు విద్యకుఁ బరమార్థము ఆత్మవికాసమే యనియు ధనార్జనము

గాదనియు, నందుచే విద్యార్థులకుఁ గఱపు విద్యలో సంగీత సాహిత్య చిత్రశిల్పాది కళలకుఁ బ్రాముఖ్య మొసంగఁదగు ననియు, గేవల ధనార్జనోపకరణములగు యంత్ర తంత్రములఁ గూర్చి విజ్ఞానము ప్రధానమనియు, విద్యాబోధనమునఁ గఠిన నియమము లవలంబింపక విద్యార్థియొక్క సహజ ప్రవృత్తిని స్వభావము ననుసరించి యుచితమగు విద్యనే కఱపవలయు ననియు సనాతన సంప్రదాయసిద్ధమగు గురుకులవాసమే ప్రస్తుత పాఠశాలా విద్యావిధానముకన్న శ్రేష్ఠతరమనియుఁ గళాశాలాధికారులకు నచ్చఁజెప్పి యాపద్ధతుల ప్రకారమే కళాశాలయందు విద్యార్థులకు బోధసేయసాఁగెను. ఆ కారణమునఁ గొలది కాలములోనే కళాశాలాధికారులకును అతని కిని వైమనస్యము తటస్థించెను. ఎట్టెటులో కొన్ని మాసములు కళాశాలలోఁ బండిత పదవియందుండి తుదకు అభిప్రాయభేదములచేఁ దనపదవిని వదలుకొని యన్యమార్గానుగామి కావలసినవాఁడయ్యెను. కాని – యితడు కళాశాలయందున్న కొలఁది మాసములలోనే విద్యార్థులకు ధర్మార్థకామమోక్షములు సంగీతసాహిత్య కళాపరిచయముఁ గావించి వారికత్యంత ప్రేమపాత్రుఁడై కళాశాలను వీడిపోవునప్పుడు వారినెల్లరను బంధుపురవాసులనందఱను విచారమున ముంచి నిజమనోరథసిద్ధిని మనశ్శాంతిని నభిలషించి యాపురినుండి వెడలి క్షీరపురము (చీరాల)ను బ్రవేశించెను. జాతీయకళాశాలలో తనకు శాంతి చేకూరదయ్యెంగదాయని గోపాలకృష్ణుఁడు మనస్సులో నెంతయో విచారించు చుండెడివాఁడు. కాని – అభిప్రాయభేదము

తీవ్రమైన కారణమున నతఁడు శాంతిసంపాదనమునకై యన్యో పాయముల వెదుకవలసినవా డయ్యెను.

చతుర్థ ప్రకరణము

సంక్షోభము : సంచారము

మహామహుల జీవితములయందెల్ల నాశాభంగ ఫలిత ముగ మనస్సంక్షోభమును వేదనయుఁ గల్గుచుండుట సకలజన విదితము. అట్టి క్షోభముచే వేదనఁచేఁ గృశించి నశించిన మహానుభావులు నామరూపములు లేక విస్మృత పథమునుబట్టి పోవుదురు. అట్లుగాక సంక్షోభమును వేదనమును లెక్కింపక కార్యదీక్షాపరతంత్రులై యేకాగ్రచిత్తులై సత్కార్యాభిలాషులై కృషిసల్పు వీరులు మహోన్నత పదవుల నందుచుందురు. "ఉద్యోగినం పురుషసింహముపైతిలక్ష్మీ:" అను నార్యవచ నము ఇట్టి మహావీరుల నుద్దేశించియే వ్రాయఁబడినది.

ఆంధ్రజాతీయ కళాశాలను వీడి మన కథానాయకుఁ డగు గోపాలకృష్ణుఁడు చీరాలనగరమున నివాసము నేర్పరచు కొనెనని మున్నే వివరించి యుంటిమి. తీవ్ర వేదనా సంక్షోభిత మానసుఁడగు నితనికిఁ జీరాలపురీ మందమారుతము అనల్ప సౌఖ్యము నొసఁగుచుండెను. కాని యంతవఱకుఁ దనకుఁగల్గిన యాశాభంగమును నప్పటి కుద్యోగరహితుఁడై నిరాధారుఁడైఁ జీవయాత్ర నెగ్గింపవలసివచ్చిన తనయార్థికస్థితిని దలంచికొని గోపాలకృష్ణుఁడు నిరంతరమును మనస్సున సురసుర పొక్క-

సాగెను. అభిమానమును వీడి ప్రభుత్వోద్యోగము నభిలషిం చుటన్ననో కలలోనివార్త. మృత్యువుకన్నను అతనికి దారుణ తరమగు నవస్థగనుండెను. ఇంక దేశీయుల నిష్కళంకాదరణము గూడ ప్రాప్తించదయ్యెను. సంసారబంధముల నొక్కపెట్టునఁ ద్రెంచికొని సన్యస్తకాముఁడై దేశసేవావ్రతుఁడై స్వార్థత్యాగియై దేశమునఁ దిరుగాడఁగల శక్తిసామర్థ్యము లప్పటికింకను అలవడవయ్యెను. అదియునుంగాక తన్నుఁ బెంచి పెద్దవానిఁజేసి వృద్ధిలోనికి దెచ్చిన పితామహిని, దన పోషణమున నమిత సుఖావాప్తి బడయ నెంచిన యిల్లాలిని సుఖపెట్టి, పోషించు బాధ్యతను అతఁడు సులభముగఁ బరిత్యజింపఁజాలఁడయ్యెను.

ఇదియేగాక జాతీయకళాశాలాధికారులకును నతనికిని గలిగిన యభిప్రాయభేదముల ఫలితముగఁ దీవ్రవివాదము తట స్థించినది. గోపాలకృష్ణునితోఁబాటు అతనిమిత్రులు కొందఱు ఆంధ్రజాతీయ కళాశాలా విద్యాపద్ధతుల నంగీకరింపజాలక తమ పదవులఁ బరిత్యజించి కష్టసుఖములను దమకు నాయ కోత్తముఁడును గురూత్తముఁడును నగు గోపాలకృష్ణునితోఁ బాటు పాలుపంచికొని యనుభవింప సంసిద్ధులై యుండిరి. అకారణమునఁ గళాశాలావ్యవహారముల కిష్టములగు సంద ర్భములు జనించెను. కళాశాలలోని పండితులలోఁ బ్రతిభా వంతులగువారు కొందఱు హఠాత్తుగఁ బదవులఁ బరిత్యజించి వెడలిచనిన కారణమున నాంధ్రులదృష్టి కళాశాలపైఁ గొం చెము నిశితముగఁ బ్రసరింపఁ జొచ్చెను. కళాశాలాధికారులు అధికారాభిమానులగు నేటి ప్రభుత్వోద్యోగులరీతిఁ దమ

ప్రతిష్ఠను గాపాడికొనుటకయి గోపాలకృష్ణునిగూర్చియు, నతని మిత్రవర్గమునుగూర్చియుఁ గొన్ని లేనిపోని నీలాపనిందలు వైచి దురూహాలకును గ్రోధమునకును దానలమయిన తీవ్ర వివాదమును బెంపసాఁగిరి. ఆంధ్రులెల్లరకును గళాశాలప్రతిష్ఠయే ప్రధానమగుటచేతను కళాశాలాధికారులు ఆంధ్రులకెల్లరకును కృతపరిచయులగుటచేతను గోపాలకృష్ణుఁ డపరిచితుఁడనిరి. నూతనపురుషుఁడగుటచేతను పత్రికలును ప్రజాసంఘములును ఆంధ్రనాయకులు నతనిపక్షమును బూనరైరి. ఆ కారణమున ద్రవ్యవిహీనుఁడౌటఁజేసి విరథుఁడునుబోలె తోడివాగలసాయము లేమిఁజేసి యసహాయయోధునివలెఁ బోరవలసినవాఁడయ్యెను. పెద్దలమని తలంచికొన్న వారెల్లరును నతఁడనినఁ గొంచె మెడమొగము పెడమొగముగాఁ దిరుగుచుండిరి. సత్యాన్వేషణమే ప్రధానముగ ననుష్ఠింపవలసిన పత్రికలు సయిత మతఁడు పంపు వార్తలను అతని యభిప్రాయము విశదీకరించు వ్యాసములను ప్రకటింపక పక్షపాతముఁ బూని యతని నిస్సహాయతకు మఱింత కారణములయ్యెను. ఎల్లరను ఆకాలమున గోపాలకృష్ణునిపక్షము బూనిన కళాశాల, కెట్టినష్టము ప్రాప్తించునో యను భయమే మిక్కుటముగ బాధింపజొచ్చెను. లక్షలకొలఁది ద్రవ్యమును వెచ్చించి నిర్మించిన కళాశాలను అంతమొందించుటకుఁ బుట్టిన యంతకునిగ గోపాలకృష్ణు నాంధ్రనాయకులు భావించి పత్రికాబలమును ప్రజాభిమానబలమును మిక్కుటముగఁ గలవారలగుటచే నెల్లరకు నట్టిభావమే యావహింపజేసి అతని కీర్తిప్రతిష్ఠలకుఁ దీరని యపకారము నొనర్చినవారలయిరి. నాయకులు బహిష్కృ-

రాయుధమును నతనిపైఁ బ్రయోగించి యతనిని లొంగదీయ
బ్రయత్నించిరి.

కాని రోషవేషములే ప్రధానముగాఁ గలవాఁడును
నిర్భీతహృదయుఁడును గార్యశీలుఁడును ఏకాగ్రచిత్తుఁడును
నగు గోపాలకృష్ణుఁడు ప్రతికూలవాదుల వాదములకును బహి
ష్కారములకును సుంతయేనియు వంతనొందక భయపడక
నిజమనోఽభీప్సితసిద్ధికై నిరంతరాలోచనా నిమగ్నమానసుఁడై
సంక్షుభిత హృదయుఁడయ్యు నాశాకిరణసాహాయ్యమున నిజ
మనోరథపథము ననుగమించి పోవుచుండెను. మొదటినుండియుఁ
బ్రపంచపరిస్థితులను జీవితస్వభావమును బాగుగ నెఱింగినవాఁ
డగుటచే గోపాలకృష్ణుఁ డపజయమునుసయితము సదాభవ
ముతోఁ గ్రహించి తన యదృష్టము పండుసమయమునకై
నిరీక్షించుచుండెను. ఆ కాలమున నతనికి సాహాయ్యముఁ
గావించినవారిలో సుప్రసిద్ధాంధ్రగ్రంథప్రకాశకులగు వావిళ్ళ
వెంకటేశ్వరశాస్త్రులుగారు ముఖ్యులు. "నిర్ధనస్య మృతస్య చ"
యను నార్యోక్తికి లక్ష్యభూతుఁడయి నిస్సహాయుఁడై జీవిత
మహాసముద్రమునఁ జుక్కాని లేక యీఁదుచున్న గోపాల
కృష్ణుని, జేరఁదీసి యాదరించి వేయినూటపదారు లొసఁగి
'రాజ్యతంత్ర' మను గ్రంథమును వ్రాయనియోగించెను.
అదృష్టవశాల్లభమయిన యీ సాహాయ్యమునకు గోపాల
కృష్ణుఁ డమితానందమునొంది ధైర్యోత్సాహములఁ జిక్కఁబట్టు
కొని పూర్వము తాననుభవించిన యపకృతినిఁ బ్రకారముఁ
గావించు నుద్దేశముతోడను సంచలితమూలములయిన తన
కీర్తిప్రతిష్ఠలను నుప్రతిష్ఠితములఁ గావించుకొనుటకును సంచా

రము సేయుదొడంగెను. ప్రప్రథమమున నతఁడు గంజాము మండలములందలి బొబ్బిలిపురమున జరిగిన యాంధ్రసారస్వత మహాసభలోనుపన్యాసములనొసఁగి నిమీలితములయియున్న యాంధ్రమహాజనుల నేత్రముల నొక్కమాఱుగాఁ దెఱువఁ జేసి తనప్రక్కకుఁ ద్రిప్పుకొనఁగల్గెను. వెంబడినే యతఁడు విశాఖపట్టణ, రాజమహేంద్రవర, విజయవాటికాపురముల సంగీతసాహిత్య కళారహస్య విజ్ఞానైకపూరితములగు నుపన్యాసరత్నముల ననేకముల విరివిగ వెదఁజల్లెను. ఏతన్మూలమున నతనికీర్తి పునఃఆంధ్రమండలమున వ్యాపించి పిమ్మట మదరాసునకుఁగూడ నల్లుకొనఁజొచ్చెను.

ఆంధ్రసారస్వత మహాసభ

1919 సంవత్సరము నవంబరునెల మొదటివారములో చెన్నపురమున కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారి యధ్యక్షతక్రింద జరిగిన యాంధ్రసారస్వత మహాసభకును బరోడా ముఖ్యగ్రంథాలయాధికారియగు శ్రీయుత కుడుల్కాపుగారి యధ్యక్షతక్రింద జరిగిన యఖిలభారత గ్రంథాలయమహాసభకుంగూడ గోపాలకృష్ణుఁడు ఆహ్వానింపఁబడెను. గోపాలకృష్ణుఁడు సభలకరుగుదెంచి మహోపన్యాసములఁ గావించెను. అఖిలభారత గ్రంథాలయ మహాసభలో 'గ్రంథాలయోద్యమము విజాతీయము' అను విషయముపైఁ దీవ్రచర్చఁగావించి పూర్వము బుస్తాశ్రమకుజచ్ఛాయలయందు విద్యార్థులును మోక్షజిజ్ఞాసువులును శాస్త్రరహస్య గ్రహణాభిలాషులును నెల్లరును ప్రస్తుతము పాశ్చాత్య పద్ధతుల ననుకరించుచు విశేష

లాంఛనములతో గూడుకొనియున్న యీ గ్రంథాలయ
ములసాయ మక్కఅలేకయే జ్ఞానసంపాదనముఁ గావింపగల్గి
రనియు నందుచే నట్టి పూర్వసంప్రదాయ సంపోషకములగు
బుపాశ్చాత్యమములును దదుచిత ధర్మములును బవరిలవల
యునుగాని, కేవలపాశ్చాత్యానుకరణములగు గ్రంథాలయ
ములవలన విశేషప్రయోజన ముండఁబోదని వాదించెను.
ఆ సందర్భమున. బాశ్చాత్యపద్ధతిని సూట్, బూట్, హేట్
సహా ధరించి యరుదెంచిన గోపాలకృష్ణుని జూచి విమర్శనా
దక్షుడగు నొక సభికుఁడు "జాతీయత కావలయును! జాతీ
యత కావలయును" నని తీవ్రముగ వాదింతురే! మీరేల
యిట్లు విదేశవస్త్రాలంకృతులై సభకు వచ్చితి? రని యడుగ
వెంటనే సమయస్ఫూర్తిగల గోపాలకృష్ణుఁడతనితో 'జాతీ
యతను నిల్పుకొనుటకే నే నిట్లు విదేశవస్త్రముల ధరించి
వచ్చితి' ననిపల్కెను. 'అదియె'ట్లని యా సభికుఁడు తిరిగి
ప్రశ్నింప, గోపాలకృష్ణుఁడు వాదచమత్కృతి తోఁటపడున ట్లత
నితోఁ 'మిత్రమా! నేను తొల్లింటికాలపు శాస్త్రులోలె నంగ
వస్త్రమును ధరించి తాళపత్రగ్రంథమును బొడుముకాయ
యును జేఁబూని వచ్చిన లోనికి నన్ను మీరు రానిత్తురా?
నా విదేశవస్త్రముల దంభమును జూచి దిగ్భ్రమనొందియే
వాకిటఁ గావలియున్న స్వచ్ఛంద సేవకులు నన్ను లోనికి
రానిచ్చిరని ఘంటాపథముగఁ దెల్పఁగలను. ఇట్టి యనవకత
కలు తటస్థింపకుండుటకొఱకే పాశ్చాత్య సంప్రదాయములఁ
బరిత్యజించి భారతనాగరికతాచిహ్నధారణమున కనుకూలము
లగు సంప్రదాయములను పరిస్థితులను గల్పింపనలయునని

నావాద' మని పల్కెను. అది విని సభికు లెల్లరు నబ్బురపడి, యవురా! యెంత చమత్కారమని లోలోన సంతసించి యతని ననేకవిధములఁ గొనియాడిరి. ఆంధ్రసారస్వత మహా సభలో నతఁడు రసస్వరూప నిరూపణమునుగూర్చి యుపన్యసించుచు రసాశ్రయమున కుదాహరణముగా నొకచక్కని వనితయొక్క వదనారవిందమును గయికొని యుపన్యాసమును జెప్పుచుండఁగా శిష్టులగు పెద్దలు కొంద ఱిది విని సహింపక కొంచెము గుజగుజలాడికొంటఁ బరికించి గోపాలకృష్ణుఁడు వెంటనే మోటార్కారు నుదాహరణముగఁ గయికొని యయ్యది యెట్లు రసాశ్రయ స్థానముగాఁ గలదో యెట్లు రసస్ఫూర్తి నొసంగఁగలదో వివరించుచు మోటార్కారు నందలి ప్రేమయొక్క విభావానుభావసాత్త్వికవ్యభిచారాదిభావముల వర్ణించుచు మహోపన్యాసముఁ గావించి శిష్టులగు పెద్దల యహంభావమునకు శృంగభంగమును, రసపిపాసాయత్తులగు యువజనులకు హృదయానందమును గల్గించిన గోపాలకృష్ణుని గని యానాఁటి సభ్య లెల్లరు నచ్చెరువందసాఁగిరి.

1919 వ సంవత్సరమున నమృతసరపురమున జరిగిన దేశీయమహాసభ యత్యంతప్రాముఖ్యము వహించి దేశములలో నూతనోద్యమము వ్యాపింపఁజేసెను. రౌలత్ చట్టనిర్మాలన మునకై గాంధిమహాత్ముడు సత్యాగ్రహ వ్రతము ప్రజలచే బూనింపుటయు, నతడు ప్రభుత్వము వారిచే నిర్బంధితుఁడైన కారణమున దేశమున నల్లరులు ప్రబలుటయు, తత్కలితముగ పంజాబున సైనికశాసనము విధింపబడుటయు, సైనికులు నిరప

రాధులగు భారతీయుల వేయిమందికి పైగ జంపి యసంఖ్యా
కుల గాయములు పాల్జేసి, పాంచాల దేశీయుల నమానుష
కృత్యములు పాల్జేసి యవమానించుటయు నేడెల్లరకును సువి
దితమే. పంజాబున దురంతము గావించిన యుద్యోగీయులనెల్ల
శిక్షలపాల్జేయక సంరక్షించు నిమిత్తమై Indemnity Bill
(సంరక్షకశాసనము)ను గావించి, ప్రభుత్వమువారు దేశీయుల
యనురాగము గోల్పోయిన విధమును గ్రహించి భారతదేశ
మంత్రియగు మాంటేగూగారు సంస్కరణముల గొన్నిటి
ప్రసాదించి మనవారిలో నుద్యోగాపేక్షాపరులగువారిని చీల
దీయగల్గెను. ఆ సంవత్సరము మితవాదులెల్లరును దేశీయ
మహాసభనుండి చీలిపోయి వేరుసభ నేర్పరచుకొని సర్కారు
వారి మహాత్యాగమును దానగుణమును భట్టులవలె పొగడి
యుద్యోగసాధనములకు బునాదుల వైచికొనిరి. దేశాభిమాను
లగు లోకమాన్య తిలక్, పాల్ మొదలగువారును, అప్పుడే
సార్వభౌమ ప్రకటనము ననుసరించి విడుదల గావింపబడిన
యాలీసోదరులును, డాక్టర్ కిచ్లూ, సత్యపాల్ మొదలగువా
రెల్లరును మితవాదులుబోయిన పొంతబోక సంస్కరణములపై
మెఱుంగుపూతలకు భ్రమనొందక యవి యాశా భంగకరము
లును, అసంతృప్తికరములును, భారతీయుల గౌరవమునకు
దగినవి కాననియు నిరసనార్హములనియు త్రోసిపుచ్చిరి. గాంధి
మహాత్ముని కోరిక ననుసరించి తీపుమానముమాత్రము కొం
చెము సాధువు జేయబడెను. కాని యెల్లరకును స్వరాజ్యము
దానముగ లభించుట యసంభవమనియు, స్వశక్తివలననే సంపా

దింపదగినదనియు నిశ్చయముగనమ్మి జాతీయవాదు లనుపేర నొక రాజకీయ కక్షగా నేర్పడిరి. గోపాలకృష్ణమును నీజాతీయ వాదులలో జేరి స్వరాజ్య సంపాదనార్థమై యాంధ్రమండల మున గృషిసల్ప దొడగెను.

ఇంతలో పంజాబు దురంతములను సర్కారువారు పులిమిపుచ్చుటచేతను పార్లమెంటునందు సైతము దోషులకు శిక్షయు బాధితులకు నష్టపరిహారమును జరుగకపోవుటచేతను తురుష్క సామ్రాజ్య విచ్ఛిత్తిని మన ప్రభుత్వమువారు అడ్డగింపకపోవుటయేగాక పైపెచ్చు తుర్కశత్రువులకు చేయూత నొసగి తురుష్కసామ్రాజ్యవినాశమును చేయనకు దెచ్చుచుంట చేతను హిందూముసల్మానులిరువురను బ్రిటిషుసామ్రాజ్యమునం దభిమానమును బ్రిటిషు న్యాయమునందు విశ్వాసమును వీడి స్వశక్తివలననే పంజాబు దురంతములకును ఖిలాఫత్ అన్యాయమునకును బ్రతీకారమును స్వరాజ్య సంపాదనమును గావించుటకై గాంధిమహాత్ముని యాదేశానుసారముగ లోకమాన్యనియనుమతిని సహాయ నిరాకరణోద్యమమును కొనసాగింప నిశ్చయించిరి. ఆ సంవత్సరమే హిందూదేశమున నూతన శాసనసభల ప్రతిష్ఠాపన జేయుటకై రాకుమారుడగు వేల్సు ప్రభువు మన దేశమునకు వచ్చునని ప్రకటింపబడుటచే నన్యాయమున నటమటనొందుచు కనలుచున్న భారతీయులాయనకు స్వాగత మీయగూడదని తీర్మానించిరి. దేశమున నెల్లెడల నశాంతి పెచ్చుపెరుగుచుండెను. గాంధిమహాత్ముడు ఆగష్టులో సహాయ నిరాకరణోద్యమము ప్రారంభింతునని ప్రభుత్వము వారికిని జనులకును హెచ్చరిక గావించెను.

మహానంది ఆంధ్ర మహాసభ

ఇట్టి సందర్భములలో కర్తవ్యము నాలోచించుటకై యాంధ్రమహాజనులు మహానందిక్షేత్రమున సమావేశమైరి. సుందరోద్యాన విలసితమును ఫుల్లపద్మాలంకారశోభిత కాసార యుతమును వివిధకుసుమఫలభరితమునునగు మహానంది క్షేత్ర మున జరుగనున్న సభకు గోపాలకృష్ణుడుగూడ సపరివారుడై వచ్చుచుండెనను వార్త వినినతోడనే మితవాదులును సంశ యాత్మలును గలగుండువడిన హృదయములు కల్గినవారై వెనుకటి కరణాద్యజ్ఞాతవాస భేదముల ననుభవించిన పేరలుకచే రోషకషాయి తనయనుడై గోగ్రహణార్థమైవచ్చిన కౌరవసేనల జీల్చిచెండాడవచ్చు నర్జునునిగని ద్రోణుడు పల్కెన.

శా॥ సింగంబొకటితోగుహాంతరమునం జేడ్పాటుమైనుండి మా
తంగస్ఫూర్జిత యూథదర్శనసముద్యత్క్రోధమై వచ్చినో
జం గాంతార నివాసఖిన్నమతి నస్మత్సేనపై వీడె వ
చ్చెంగుంతీసుతమధ్యముండుసమరస్థేమాభిరామాకృతిన్.

ఉ॥ ఈతనిత్రోడికయ్యమున కియ్యకొనందగువార లస్మదీ
యాతతసేనలోఁ గలుగు టూరయ సంశయ మెల్లభంగి గో
వ్రాతనివర్తనంబు సుకరంబ కిరీటి కితండు రుద్రునిం
బ్రీతునిఁజేసె నా వినమె పెంపెసలారెడు బాహుసంపదన్.

అను పద్యములను, విజయశంకచే గాంగేయుడు పల్కెన,

ఉ॥ వచ్చినవాఁడు ఫల్గునుఁ డవశ్యము గెల్తుమనంగరాదు రా
లచ్చికినై పెనంగిన బలంబుల రెండును గెల్వనేర్చునే
హెచ్చగుఁగుండగుండొడయఁ డెల్లవిధంబుల కోర్చునట్లుగా
కిచ్చదలంచియొక్కఁ డెయినిత్తఱిఁబొందగుచేతయున్‌ దగున్‌

అను పద్యమును జ్ఞప్తికి దెచ్చుకొనుచు లోలోపల గుందుచు, జంకుచు నడలసాగిరి.

గోపాలకృష్ణుడును నార్య పద్ధతుల నవలంబించి తొల్లిటి పండితుల సంప్రదాయము ననుసరించి పాశ్చాత్య నాగరకతా చిహ్నములన్నెల్ల విసర్జించి, యంగవస్త్రమును ధరించి వేలొక యంగవస్త్రమును భుజములపై నైచుకొని, రుద్రాక్ష మాలాలంకృతుఁడై, చామరపాణియై జగతి నవతరించి వచ్చిన శాలనేత్రుఁడో యనునట్లుగ విశాలశాలప్రదేశమున బెద్దకుంకుమ తిలకమును ధరించి మిత్రులతో నార్యధర్మములగూర్చి ప్రసంగముల గావించికొనుచు సభాస్థలి కరుదెంచిన సాహసము సభా విస్మయజనకమై యొప్పెను. సభాంతరాళమున నిల్చి యతఁడు గంభీరవాక్యములతో యాంధ్ర విద్యాస్వరూప స్వభావములనుగూర్చి యుపన్యసించుసప్పుడును, ముక్తకంఠముతో, సహజ విమలో చ్చైస్వరముతో మహాకవిప్రణీతములగు పద్య రత్నములు హావభావచేష్టాసహితముగ జదువునప్పుడును సభికు లెల్లరును సమందానందభరితులై తొల్లిటియార్యుల స్వధర్మ స్వభావ స్వరూపముల స్మరణకు దెచ్చుకొని విజాతీయ సంప్ర దాయబద్ధమగు నేటియనాగరకస్థితికిని నాస్తికతకును రోసి

భారత ధర్మోద్ధరణదీక్షా బద్ధులు కాజొచ్చిరి. ఆర్యసంప్ర
దాయ సిద్ధమగు సనాతన విద్యాపద్ధతి నరసి విశదీకరించుటకు
మహాపండితుల గొందర నుపసంహముగా నేర్పఱచి యాసంఘ
మునకు శ్రీగోపాలకృష్ణుని కార్యదర్శిగా నియమించిరి. ప్రభు
త్వముపాలొసంగిన సంస్కరణములు నిరసనార్హములను
తీర్మానమును సభికులచే నామోదింపజేసిన వారిలో గోపాల
కృష్ణుడు ప్రముఖుడు. జాతీయవాదుల సంఘమే నిజముగ
నాంధ్రుల యభిమతమును వెలిబుచ్చగలదనియు మితవాద
సంఘము ప్రయోజన రహితమనియు గోపాలకృష్ణుడు సభికు
లకు బోధించి జాతీయవాదుల కక్షికి యెంతయోబలము
జేకూర్చినవాడయ్యెను. యువరాజునకు స్వాగత మొసగదగ
దను తీర్మానమునుగూర్చి మాటలాడుచు పంజాబున జలియ
న్వాలాబాగులో మన భారతీయులు హతులై మరణించుటచే
భారతవర్ష మశుచి (సూతకము)యం దుండెననియు, అశుచి
యందున్న వారింటికి బందుగులు రాదగదనియు, వచ్చిన నుచిత
మర్యాదజపుగుట యసంభవమనియు బల్కిన గోపాలకృష్ణుని
పల్కుల ఘని సభికులెల్లరమందాశ్చర్యచకిత హృదయులైరి.

మహానంది క్షేత్రమున జరిగిన యాంధ్రమహాసభల
మూలముగ గోపాలకృష్ణుని కీర్తి యాంధ్ర హృదయపీఠముల
ను ప్రతిష్ఠితమయ్యెను. సభికులెల్లరకును హాస్యరసభరితంబును,
చమత్కార విలసితంబును, శ్రావ్యతమగానయుతమును, నపూ
ర్వరచనా శోభితంబును, భారత సాంప్రదాయ విజ్ఞానైకబంధు
రంబునునగు గోపాలకృష్ణుని వాగ్ధోరణి శ్రవణపేయమై, హృద

యానందకరమై, పవిత్రోద్రేక జనకమై, మహాకార్య ప్రోత్సాహకమై యొప్పిన కతన నెల్లరకును గోపాలకృష్ణుడు ప్రేమ పాత్రుడును గౌరవపాత్రుడును నయ్యెను. ఆ యేటిసభలో నెల్ల రును గోపాలకృష్ణుని నామమునే యుగ్గడింపసాగిరి. గోపాల కృష్ణయ్యకు జే! యను కేకలు సభాంతరాళమున మిన్ను ముట్టజోచ్చెను. గోపాలకృష్ణుడు సభికులచే నేకగ్రీవముగా నాంధ్రమహాజన సభాకార్యదర్శిగ నెన్నుకొనబడెను.

కాని యసూయాపరులగు నతని విరోధులు కొంద రతని కబ్బిన కీర్తికి నీసుజెంది, భారత సంప్రదాయ విజ్ఞాన శూన్యులగుటచే నతని భావౌన్నత్యమును గ్రహింపజాలక, తమ యజ్ఞానమును నాస్తికత్వమును తేటపడ నతనినిగూర్చి కృష్ణాపత్రికలో నసభ్యములగు వ్రాతల వ్రాసిరి. మొదటినుం డియు ననగా గోపాలకృష్ణుడు భేదాభిప్రాయముల కతన జాతీయ కళాశాలలోని పండిత పదవిని జాలించుకొనినప్పటి నుండియు, గృష్ణాపత్రికా ముఖమున నిట్టి యసభ్యపు వ్రాత లు'ను, అవక తవక ప్రసంగములును, ప్రకటింపబడి యుండు టెంతయు శోచ్యమని తప్పత్రికాధిపతుల కీనాటికైనను గోచ రించి యుండునని నా విశ్వాసము. ఈ పత్రికలో నతనిగూర్చి వ్రాసిన యీ రసిక శిఖామణి యతని వేసము సుంకర కొండాయవేషముతో పోల్చెను. గోపాలకృష్ణు డుది జదివి యభిమానియు రోషవేషముల బాటించువాడు నగుటచే వెంటనే యాశువుగా

కll బింకాలుపల్కఁ బందరు
కుంకల ఘీంకార మెల్ల గీడ్వడసేయన్
శంకరుడై మహానందిని
సుంకర కొండయుగ వెలసె చోద్యముగాదే.

యను పద్యమును జదివి దుష్ప్రలాపుల శృంగభంగము గావించెను. జనులెల్లరును గోపాలకృష్ణుని ప్రతిభను గ్రహించినవారైరి. అందుచే నాయకులుగూడ తప్పనిసరిగ నతనిపై దమకటాక్ష వీక్షణముల ప్రసరింపజేయజొచ్చిరి.

అట్లు సురక్షితుడై, కీర్తికాముడై, నిర్భయుడై, గోపాలకృష్ణుడు దేశసేవ చేయుటకును నిజమనోరథ సిద్ధినొందుటకును ప్రయత్నింప దొడగెను. జాతీయ విద్యాసిధానము నరసి నివేదిక సమర్పించుట కేర్పరుపబడిన పండితులతో గోపాలకృష్ణుడు ప్రత్యుత్తరములు సల్పుచుండెను. కట్టమంచి రామలింగారెడ్డి, కల్లూరు వేంకటరామశాస్త్రి, సర్వేపల్లి రాధాకృష్ణయ్య, కోపల్లె హనుమంతరావుగార్లు మొదలగు పండితుల యభిప్రాయముల నరసి గైకొనుచు తానుగూడ ననుకూలమగు విద్యావిధానమునుగూర్చి తీవ్రముగ నాలోచింపసాగెను. తదాలోచనా ఫలితముగ నతడొక విధమగు విద్యాపద్ధతిని తయారుజేసి దాని నాచరణ గావించుటకై చీరాల పరిసరప్రాంతముల నొక విద్యాపీఠము నెలకొల్పనెంచెను. బారిష్టరు నడింపల్లి నరసింహారావు, జాగర్లమూడి కుప్పుస్వామినాయుడు, వావిళ్ళ వేంకటేశ్వర్లు, పేరి నారాయణమూర్తి, అల్లాడ కృష్ణస్వామయ్య, యస్. శ్రీనివాస అయ్యం

గారు ప్రభృతుల సాహాయ్యబలమున నతడు చీరాలనగరమున కనతిదూరమున రామనగర మనుపేర నొక నగరమును స్థాపించి యాంధ్రవిద్యాపీఠ గోష్టి యను పేర నొక సంఘము నేర్పరచి రిజిష్టరు జేయించెను.

గోపాలకృష్ణుఁడు స్థాపింపనెంచిన విద్యాపీఠముయొక్క పద్ధతులఁ గొంచెము సూచించెదను. ఉపాధ్యాయులు వేతన మేమాత్రమును లేక స్వశక్తితోడనే జీవనము సంపాదించు కొనుచు విద్యార్థుల కన్నపానముల నొసంగి కాపాడి విద్యా దానము సేయఁదగును. అందులకై సంవత్సరమున కాఱు నెలలు మాత్రమే పాఠశాల కార్యక్రమము జరుపవలెను. మిగిలిన యాఱునెలలు నుపాధ్యాయులు తమ జీవనోపాధి నేర్పఱచుకొనదగును. విద్యాపీఠమునకు దివ్యభవనము లక్కఱ లేదు. తొల్లిటి గురుకులాశ్రమ పద్ధతియే కొనసాగింపఁదగును. పాకలలోఁ బందిళ్లలో నాశ్రమ నికుంజచ్ఛాయలలో వినిర్మల నభోవితానము క్రింద విద్యార్థులు నివసించుచుఁ బాఠములఁ జదువుకొనుచుఁ బ్రకృతి యొక్కయు భగవంతునియొక్కయు ననంతత్వమును గ్రహింపవలయును. అంతియేగాని గాలియును వెల్తుకును జొఱని పాఠశాలలయందుఁ జీకటిగదులలోఁ గూపస్థ మండూకములరీతిఁ బ్రకృతిపరిజ్ఞానశూన్యులై విద్యార్థులు విద్యా భ్యాసముఁ జేయఁదగదు. విద్యార్థులుపాధ్యాయునకు వలసిన పనులన్నిఁ జేయుచు నతని యనుగ్రహములకుఁ బాత్రులై బిడ్డలబోలె నతనిచే నాదరింపఁబడి కాపాడఁబడుచు విద్యా బుద్ధుల నందవలయును. ఉపాధ్యాయుఁడును విద్యార్థులఁ

గడుపునం గన్న బిడ్డలంబోలెఁ బ్రేమించి వారివారి యధికార తారతమ్యమును వారివారి స్వధర్మ స్వరూప స్వభావములను గుర్తించి యుచితమగు విద్యను గఱపవలయును. విద్యార్థులకు నుపాధ్యాయులకును ఇచ్చిపుచ్చుకొనుట యనునది లేమించేసి ప్రేమబంధమే వారల యన్యోన్యసంబంధమును గల్పింప వలయును.

ఇఁక విద్యావిధానమును గూర్చి యొక్కింత నే నెఱిఁగినంతవరకుఁ దెల్పెదను. మానవధర్మము – అందు ముఖ్యముగ సనాతనార్యధర్మము – ధర్మార్థకామమోక్ష సంయుతము. కావున విద్యార్థి యార్యధర్మపరిజ్ఞాత గావలయునన్నచో జతుర్విధములఁ బరఁగు ధర్మార్థ కామమోక్షములగూర్చి జ్ఞానము సంపాదింపవలయును. ఈ ధర్మార్థ కామమోక్షములే విద్యావిధానమునకుఁ బ్రధానములగు శాఖలు. వీనినే ప్రస్తుత సర్వకళాశాలలలోని ఫ్యాకల్టీస్ (Faculties) అని చెప్పఁదగును. ధర్మమునకు సంబంధించినవగు వివిధశాస్త్రములు గలవు. ధర్మశాస్త్రము, న్యాయశాస్త్రము, నీతిశాస్త్రము మొదలగునవి ధర్మమునకుఁ జెందును. తప్పొప్పులు ధర్మాధర్మములు మానవునకు గల పరస్పరసంబంధము – వీనిని గూర్చి తెలియని విద్యార్థి నిజమయిన ధర్మజ్ఞానము నలవఱచుకొని న్యాయశీలుఁడగు పౌరుఁడు గాఁజాలఁడు. అందుచే ధర్మశాస్త్రమొక ప్రధాన విద్యావిభాగముగ గ్రహింపందగును.

ఇఁక నర్థములేనిది ప్రపంచమున నిఖిలవ్యవహారములును జరుగవు గావునను, అర్థశూన్యుఁడగు పురుషుడుఁ నిరర్థకుఁ

డగుం గావునను విద్యార్థులు న్యాయసమ్మతమార్గముల నర్థము
నార్జించి జీవితయాత్రను నిరభ్యంతరముగ సాగింప నుపాయ
ముల నేర్పుచుకొనవలయును. ఈయర్థశాఖకుఁ జెందిన శాస్త్రము
లలో వాణిజ్య, వ్యవసాయ, ప్రకృతి, రసాయన, అర్థశాస్త్ర
ములు ముఖ్యములు.

ఇఁక గామము అనగాఁ గోర్కెలేనివాఁడు జడస్వరూ
పమే యగును. జడుఁడుగాని ప్రతిమనుజునకును నేనోకొన్ని
కోర్కెలుదయించుచునేయుండును. అట్టికోర్కెలు వారివారి
స్వధర్మ స్వభావ స్వరూపములనుబట్టి ప్రత్యేకజనుల వశము
గావించుకొనును. అందువలననే కోర్కెలు అనంతములై
యొప్పెడివి. కామముయొక్క యియ్యనంతత్వము నాధార
ముగఁ గైకొనియే వివిధకళలుద్భవిల్లినవి. సంగీతము, సాహి
త్యము, చిత్రము, శిల్పము, కామశాస్త్రము మొదలగునవి
యెల్లగామమునకుం జెందినవి. ఈ కళలయందు ఆతితేటగల
విద్యార్థులు పూర్ణశశికళాపూర్ణుడగు చంద్రునిభాతిఁ బ్రకాశించుచు
నిష్కామోపలబ్ధిని బడసి సంముదిత హృదయులై జీవితమును
సుఖవంతముగ గడపఁజాలుదురు.

ఇక సర్వధర్మములును సర్వార్థములును సర్వకామోప
భోగములును మోక్షసిద్ధికి బూడిదంజల్లిన పన్నీరుంబోలె
నిరర్థకము లగుంగావునను భగవంతుని నిజస్వరూపములను
ననంతత్వమును గుఱుతెఱుఁగనివాఁడు సర్వశాస్త్ర విజ్ఞాత
యయిననను సర్వార్థయుతుఁడైనను రాజభోగియయిననుగన్ను
లున్న గ్రుడ్డివానివలె జీవితపరమార్థమును దిన్నఁగ గుఱుతింపఁ

జాలఁడు. కావునఁనే భగవంతుని యనంతమహిమమును దెల్సి మోక్షప్రాప్తి నొసంగఁగల మీమాంస, వేదాన్తము మొదలగు శాస్త్రములు విద్యార్థి యభ్యసింపఁదగును. ఇట్టి శాస్త్రము లభ్యసింప విద్యలయొక్క సారమునెల్ల గ్రహించి జీవితపరమార్థమును సిద్ధింపఁజేసికొని విద్యార్థివలసిన యుపకరణములనెల్ల సంపాదించుకొనఁదగును.

పైనఁ బేర్కొనఁబడిన ధర్మార్థ కామమోక్ష సంయుతమగు విద్యావిధానమును సాహాయ్యముగ నార్యధర్మ కోవిదులు జీవితమున ననుష్ఠేయమగు వర్ణాశ్రమపద్ధతి నేర్పఁగలరు. అట్టి వర్ణాశ్రమాచారధర్మములఁ బ్రకృతకాలానుసరణంబుగఁ గొలఁదిమార్పులఁ గావించి ఆర్యధర్మమును కేవలలాఞ్ఛన మాత్రముగనేకాక సార్థకముగ నిలుపవలయును. బ్రాహ్మణ క్షత్రియ వైశ్యశూద్రకులముల స్వధర్మ స్వభావస్వరూపములఁ బ్రకృతకాలానుగుణ్యములుగఁ గొలదిగమార్చి వాని నిశ్చిత పరమార్థమును వినాశము పాలుగాకుండఁ గాపాడనలయును. విద్యావిధానము యేయొక్కజాతివారికి మాత్రమే లాభకారి గాకుండ సర్వజాతులకును లాభకారి యగునట్లొనరింప వలయును. అట్లనుటలో నేయొక్కజాతికో లాభమొనగూర్చు నుద్యోగోపయుక్తమగు విద్యయో లేక వాణిజ్యవిద్యయో నేర్పి విద్యావిధానమును సంకుచితముఁ గావించుటకన్న సర్వవర్ణముల స్వభావస్వధర్మ స్వరూపముల నిర్ణయించి సన్మార్గమున సంపూర్ణవికాసము నందజేయఁగల సర్వశాస్త్రసమన్వితమగు విద్యావిధానమే ప్రతిష్ఠింపఁబడఁదగినది. అధికారివిచేచన నను

సరించి బాలుర కుచితమగు విద్యను బ్రసాదించుటయే విద్యాపీఠములయొక్కయు విద్యాగురువుల యొక్కయుఁ బ్రధాన కర్తవ్యమును బరమార్థము నగును.

అంతియేగాక ధర్మార్థ కామమోక్షయుతమును స్వధర్మాశ్రితమును నగు ధర్మము ననుష్ఠించుకొనుటకయి మానవుడు ఆశ్రమపద్ధతి ననుగమింపవలసినదిగాఁ బెద్దలు నిర్దేశించిరి. అట్టి యాశ్రమములు బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, యత్యాశ్రమములని చతుర్విధములుగ నామ్యలు పేరొక్కనిరి. విద్యా సంపాదనమునకు బ్రహ్మచర్యము, సుఖోపభోగమునకు గార్హస్థ్యము ప్రజాసేవకును జ్ఞానసంపాదనమునకును వానప్రస్థమును, నిశ్చల సమాధియందుండి తపస్స్వాధ్యాయనిరతులై మోక్షప్రాప్తిఁ గాంచుటకు యత్యాశ్రమమును అవశ్యానుష్ఠేయ సాధనములుగఁ బెద్దలు నిర్దిశించిరి. అట్టి యాశ్రమ పద్ధతులలో మొట్టమొదటిదగు బ్రహ్మచర్యము గురుకులవాసమున నవశ్యానుష్ఠేయము.

ఇట్లు ధర్మార్థ కామమోక్ష సంయుతంబును నర్థాశ్రమాచార సముపేతమ్మునగు విద్యా విధానమును గోపాల కృష్ణుఁడు కతిపయమిత్రసత్తములతోఁ సంప్రతించి నిర్ణయించి రామనగర స్థితాంధ్ర విద్యాపీఠమునఁ బ్రవేశపెట్టఁదలంచుకొనెను. అందులకై వలయు సాధన సంపత్తిని బైనఁ బోర్కొనఁబడిన మిత్రుల సాహాయ్యమున సంపాదించి విద్యాపీఠమును స్థాపించు కార్యక్రమమును బ్రారంభింప నుద్దేశించెను. అనేక భాషాపరిచితులును బురాతనాధునాతన విద్యా సంప్రదాయ

వేత్తలును దేశసేవా నిరతులును నగు పండితసత్తము లనే కులు విద్యాపీఠమునఁ బండితులుగనుండి యావజ్జీవమును విద్యార్థులకు విద్యాదానమును జేయుటకు బద్ధకంకణులై యుండిరి. గోపాలకృష్ణుడు సప్తాహము జేయించి శుభదిన మున విద్యాలయమునఁ బ్రవేశమహోత్సవము జరుపనెంచెను.

కాని, యప్పటి దేశకాల స్థితిగతుల యాటుపోటుల వలన విద్యాపీఠమురొక్క పని కొంతకాలము గోపాలకృష్ణుడు నిల్పుదలఁ జేయవలసివచ్చెను. మహానంది సభయయిన రెండు మూఁడు మాసములకే యనఁగా 1920వ సం॥ ఆగస్టు మొదటి తేదికే గాంధిమహాత్ముఁడు సహాయ నిరాకరణోద్యమమును బ్రారంభింప నిశ్చయించెను. అప్పటికే జాతీయవాదులు సర్కారువారు ప్రసాదించిన శాసనసభలలో మితవాదులను అనఁగా బ్రభుత్వాభిమానులను ఒక్క పురుగునైనను జొఱ నీయకుండ సభాస్థానములన్నిఁ దామె యాక్రమించి ప్రభు త్వమువారి యాటల సాఁగకుండ నిరంతరాభ్యంతరములఁ గల్పించుటకుఁగుతూహలులై తదర్థమై కృషిసల్పుచుండిరి. అట్లు మన రాజధానిలో కృషిసల్పిన వారలలో యస్. శ్రీనివాసయ్యంగారు, కస్తూరి రంగయ్యంగారు, వెంకట్రా మయ్యర్ గారు, సత్యమూర్తి, టంగుటూరు ప్రకాశం, అయ్యదేవర కాళేశ్వరరావు, రాజా భుజంగరావు, గజవల్లి రామచంద్రరావుగార్లును, మన గోపాలకృష్ణుడును బ్రముఖులు. వీరందరును మితవాదులపై ధ్వజమెత్తి యాంధ్రదేశమున మహోపన్యాసములఁ గావించుచు జాతీయవాదమును మద్రాసు రాజధానియందు నలుదెసల వ్యాపింపఁజేసిరి. జాతీయ వాద

నాయకాగ్రేసరుఁడగు లోకమాన్య బాలగంగాధరతిలకు చెన్న పురికివచ్చి సహచరులకు నమితోత్సాహమును గల్గించెను. తత్కారణమున గోపాలకృష్ణుఁడు మదరాసునందును ఆంధ్ర మండలమున వివిధ పట్టణములందును జాతీయవాదుల పక్షమున నుపన్యాసముల నొసఁగుచు మితవాదులకును ప్రభుత్వాభిమానులకును నిలువ నీడయైనను లేకుండఁ జేయజొచ్చెను.

ఇంతలో దేశదౌర్భాగ్య వశమున :

ఆ॥ వె॥ తీవ్రబాణజాల దీప్తులఁ బరగించి
పాండుతనయ సైన్య బహుళతమము
లీలఁ బదిదినంబు లోలిమె నిరించి
యధిప! భీష్మభానుఁ డస్తమించె

అన్నటుల తిలకభానుఁడు హఠాత్తుగ బొంబాయినగరమున విషజ్వరరాహుగ్రస్తుడై యస్తమించెను. లోకమాన్యుఁడు జూలై ముప్పది యొకటవతేదీ రాత్రి పండ్రెండు గంటలన్నరకు ననఁగా గాంధిమహాత్ముడు సహాయనిరాకరణోద్యమమును బ్రారంభింపనెంచిన యాగస్టునెల ప్రథమ దివసము యొక్క ప్రారంభ ఘటికలలోనే నిరంతరదేశ సేవాపరిశ్రమమున శ్రమఁజెందిన కాయమును జాలించి స్వర్గమున విశ్రమింపఁజనెను. ఆ వార్త భారతవర్షమునెల్ల విచారాంబుధియందు ముంచివైచెను. లోకమాన్యనివృతికయి తమ విచారమును సూచించుచు మదరాసుపౌరులు సముద్రతీరమునఁగావించిన మహాసభలో గోపాలకృష్ణుఁడు లోకమాన్యనిగుణగణముల నగ్గించు మహోపన్యాసముఁ గావించి

యమ్మహామహునిచే బ్రారంభింపఁబడిన యుద్యమసస్యముల నాంధ్రమహాజన హృదయక్షేత్రములగాటముగ నాటుకొను నట్లు గావించెను.

గోపాలకృష్ణుని భావనాశక్తి యత్యద్భుతము. జులై ముప్పదిరొకటన శ్రీదీనాటి సాయంత్ర మేడుగంటలకు వెన్నెలలో మద్రాసున నాంధ్రపత్రికా కార్యాలయమునుంచి తంబు శెట్టి వీధిగుండ భోజనార్థ మేగుచుండగా గోపాలకృష్ణుడు హఠాత్తుగా మేఘమండలమును జీల్చుకొని వెలి కుఱుకుచు వచ్చి శుభ్రకాంతుల వెదజల్లజొచ్చిన చంద్రుని దర్శనప్రభావమునఁ జేమోగానిమాత్రో 'చూచితిరా, గాంధిమహాత్ముడుఁణ మధునాయని వేచియుండునుగాబోలు'ననుచుబల్కెను.పూర్వము రాధకు చెలిమికత్తె హే రాధేఁణ మధునా నారాయణ మనుసర'యని పల్కిన జయదేవకృత గీతగోవిందములోని యష్టపది యొక్క పల్లవిలోని భావమును గాంధిమహాత్ముని యెడ నన్వయముజేసి చెప్పి యతడు సత్య మొక్కపెట్టునపూర్ణముగ మాకు గోచిరింపజేసెను. లోకమాన్యుని దశాహమునాఁడుపవాసముజేసి 'తిరువళిక్కేణియందలి దేవాలయములలో నారికేళ రాజలాభిషేక మొనర్చి దైవారాధనముగావించి యారాత్రి మాంబలమునన్న యాంధ్రజనులకెల్ల పురాణము జదివి యానందమును విజ్ఞానమును గూర్చి మరునాఁడు మిత్రసమేతంబుగ మాయింట విందుగుడిచి మమ్మానందభరితుల గావించి పిమ్మట చీరాలనగరోన్ముఖుఁడై చనెను.

అనంతరము గోపాలకృష్ణ డాంధ్రభాషయందునను నాంగ్లేయ భాషయందునను 'సాధన'యనుపేర వారపత్రికల బ్రచురించుటకును, జాతీయ విద్యాలయముల కుపకరించు గ్రంథముల బ్రకటించుటకును, ముద్రాయంత్రమును గొని గుంటూరుజిల్లాకలెక్టరునెదుట డిక్లరేషన్ (అనగా నేను ఫలానపత్రికను ప్రకటింపబోవుచున్నానని ప్రకటన) నొస గెను. జాతీయవాదు లెల్లరును గోపాలకృష్ణుని పత్రికారాజము లకై యెదురుచూచుచుండిరి. కాని కలకత్తాలో సెప్టెంబరు నెలలో జరిగిన యవసరదేశీయ మహాజనసభ కేగవలసివచ్చు టచే గోపాలకృష్ణుడు పత్రికల వెంటనే బ్రకటింపజాలక పోయెను.

ఆసంవత్సరము సెప్టెంబరునెలలో కలకత్తానగరమున జరిగిన యవసరదేశీయమహాసభలో గాంధిమహాత్ముడు సహాయనిరాకరణోద్యను సూత్రముల సర్వజనులచే నామో దింపబడజేసి నూతన యుగనిర్మాణమునకు మార్గదర్శియై యఖండవిజయము గాంచెను. మొట్టమొదట దేశీయుల బల మెల్లను శాసనసభాబహిష్కారముపట్ల నుపయోగింపనలె నని,యా దేశించిన గురునాజ్ఞను శిరసా గ్రహించి గోపాల కృష్ణు డాంధ్రనాయకులతోగూడ వివిధనగరముల సంచా రము గావించి యుపన్యాసముల నొసగి యుద్యనువ్యాపనము గావింపజొచ్చెను. తత్ఫలితముగ బొప్పట్ల, చీరాల, వేట పాలెము, గుంటూరు, మొదలగు ప్రదేశముల గోపాలకృష్ణుడు శాసనసభా బహిష్కారమును నత్యద్భుతముగ గావింప జేసెను. సర్కారువా రప్పుడే యతని ప్రజావశీకరణశక్తికి

వెలిగుజెందసాగిరి. నాయకులు తమకు బలమగునండ దొరకి నాము గదా యని గోపాలకృష్ణుని గాంచి యబ్బురమును మోదమును బొందసాగిరి.

స్వరాజ్యోద్యమవ్యాపనముకొఱకును, సంఘసేనకొఱ కును దేశసేవావ్రతులగు స్వయంసేనకదళ మనవసరమని దేశీయమహాసభ యూహించియుంటచే గోపాలకృష్ణుడు తద నుసారముగ నాంధ్రదేశమున నలెడల నాంధ్రసంప్రదాయ సిద్ధమును, భక్తిరసోపేతమును, దేశసేవాపరతంత్రమును, నగు రామదండుప్రతిష్ఠాపనను పునరుద్ధరించి విజాతీయ, మగు బాల భటోద్యమము **(Boy Scout)** నుండి యాంధ్రజనుల యొక్కయు, నందు ముఖ్యముగ నాంధ్ర విద్యార్థులయొక్కయు మనముల మరల్పజొచ్చెను. ఈ రామదండు ప్రతిష్ఠాపన యందు దేశభక్తియు, సాంఘికసేవయు, మానవసేవయు, దైవభక్తియు సమ్మిళితములైయుంటచే నయ్యది యాంధ్రుల మనముల నచిరకాలమునసే వశము జేసికొన గలైను. రామదండు గావించిన మహాకార్యములను, దాని ప్రధాన లక్షణములను చీరాలమహాసంగ్రామమును వర్ణించు ప్రకరణ మున వివరించిరితిని.

పంచమ ప్రకరణము

సంగ్రామము - చీరాలరంగము (౧)

ప్రస్తుత రాజకీయ చరిత్రమునందు ప్రాముఖ్యము గడిం చిన చీరాల నగరమున మనగోపాలకృష్ణుడు బందరుపురమును వీడినతరువాత నివాసమేర్పఱచికొనెను. అప్పటికే చీరాల

స్థితిగతులు విషయములగుచుండెను. అట్టి విషయసందర్భములలో గోపాలకృష్ణుడు చీరాల వ్యవహారము పరిష్కార మగునటుల గావించుటకై తనశక్తి సామర్థ్యములనెల్ల వినియోగింపదొడగెను. తుట్టతుదకు చీరాలకొఱకే యతడు చెఱసాలకు పైతము చనియెను. గోపాలకృష్ణుడు చీరాల ప్రవేశించినప్పటి స్థితిగతులును, అతడు వానిని మార్చిన విధమును పాఠకమహాజనులకు విశదము గావింపయత్నింతుము.

ఆంధ్రదేశమున చీరాలనగర మద్వితీయరామణీయకముత్రో నొప్పును. సముద్రమునకు మూడుమైళ్ళ దూరమునసనుండి, జీడిమామిడి తోటలతోడను, విశాలములగు సైకతస్థలములతోడను బాటెడులోతు త్రవ్వగనే పైకుబికెడు జలాశయములతోడను నొప్పుచు సమశీతోష్ణ స్థితిగలదై వేసవియందు చల్లగను నారోగ్యముగ నుండుటచే చీరాల నగరము గుంటూరుమండలమున కుదకమండలమ్భాతి జెలంగుచుండును. వేసవికాలమున నిచ్చటికి వివిధప్రదేశములనుండి జనులుదెంచి గ్రీష్మతాపమపనయించికొనుచుందురు. నిర్మలమగు జలమును, పరిశుభ్రమగు వాయువును, రుచ్యములగు ఫలములును నిచ్చట పుష్కలముగ లభించుచుండును. ఆ కారణముచే గుంటూరు మండలమునన్న తెల్లవారును మిషనరీలును చీరాలపై గన్ను వేసియుండిరి.

చీరాలగ్రామమును, పేరాలగ్రామమును నొకటిత్రో నొకటి కలిసియేయుండును. ఈ గ్రామములకు చేరువనే జాండ్రపేట, ప్రాతచీరాల, వీరరాఘవపేటయును చిన్నగ్రామములు

కూడ కలవు. ఈ యైదు గ్రామములయొక్క జనసంఖ్య మొత్తముమీద పదునెనిమిది వేలుండును. చీరాల పేరాల గ్రామములను ప్రభుత్వమువారు గుంటూరు జిల్లాబోర్డు యధీనముక్రింద నొక యూనియను గావించిరి. ఈ యూనియనువారే గ్రామముల దీపముల బెట్టించి, పాఠశాలల నేర్పరచి, వైద్యసహాయము గావించి, వీధుల బాగు చేయించి ప్రజల కనేకములగు సాయముల నొనర్చుచుండిరి. ఈ యూనియనువారు సంవత్సరమునకు సుమారు 4 వేల రూప్యముల పన్నును వసూలు జేయుచుండిరి. యూనియను వ్యయము సంవత్సరమునకు సుమారు రెండువేల రూప్యము లగుచుండెను. చీరాలగ్రామమున లోకల్ ఫండు ఆసుపత్రియొకటి కలదు. దానికై యొక అసిస్టెంటు సర్జనును సబ్ అసిస్టెంటు సర్జనును పరివారమును నియమింపబడిరి. రోడ్లు మొదలగునవి కొంతపరకు జిల్లాబోర్డువారి సాయమునవే వేయబడుచుండెను. ప్రజలు ప్రైవేటు (స్వంత) పాఠశాలల నెలకొల్పికొని విద్యా వ్యాపనజేసికొనుచు నావిషయమున యూనియను చేయవలసిన పనిని తేలికగా నొనర్చుచు స్వయంసహాయముపై నాధారపడ సాగిరి. యూనియనువ్యవహారములెల్ల మితవ్యయముతో నతి సులువుగా సాగుచుండెను.

ఇట్లుండగా 1914 వ సంవత్సరమున గుంటూరుమండల మున ప్లేగు (బొబ్బల) జాడ్య ముదయించి చీరాలకుగూడ వ్యాపించి ప్రాణనష్టము గల్గించెను. తత్కారణమున శానిటరీ కమీషనర్ (ఆరోగ్యశాఖాధికారి) సలహాననుసరించి ప్రభు

త్వమువాకు చీరాల, పేరాల గ్రామములను, పాతచీరాల, వీరరాఘవపేట, జాండ్రపేట గ్రామములను నొకటిగా జేర్చి మ్యూనిసిపాలిటీ (పురపాలకసంఘము) నేర్పరుప నుద్దేశించిరి. 1915వ సంవత్సరములో జిల్లాకలెక్టరు (మండలాధికారి) చీరాలకు మ్యూనిసిపాలిటీ యక్కరలేదని యభిప్రాయమొసగెను. జనులు మ్యూనిసిపాలిటీ యక్కరలేదను నభిప్రాయమును వెలిబుచ్చిరొడగిరి. వారట్లు మ్యూనిసిపాలిటీ వలదనుటకుగల కారణములు తెలియజేసెదము.

యూనియనును మ్యూనిసిపాలిటీగా మార్చుటవలన పన్నుల భార మతిశయించెను. పన్నులు 4వేల నుండి 38వేల రూప్యములవరకు బెరిగెను. రెండువేల రూప్యములు వ్యయమగుచుండిన దానికి 15 వేల రూప్యములు వ్యయము గావింపవలసివచ్చెను. చీరాల, పేరాలలలో నధిక సంఖ్యాకులు బీదవాసు, నేతవృత్తి నవలంబించువారు. వారు ధననంతులగు షాహుకార్లయొద్ద నూలుగైకొని కూలికి బట్టలునేసియిచ్చుచు జీవనము గడుపుచుందురు. దినమునకు 8 అణాలు మొదలు రూపాయివరకు మాత్రమే సంపాదింపగలరు. వారు నివసించు యిండ్లు చాలవరకు గుడిసెలేగాని పెద్దపెద్ద భవనములు కావు. అట్టి కొద్దిపాటి గుడిసెలపై నింటి పన్ను నధికముగ విధించు టన్యాయమని బీదలు గోడుజెందసాగిరి. అదియుంగాక చీరాల పేరాల గ్రామవాస్తవ్యుల కవసరమగు సౌకర్యముల నెల్ల యూనియనువారే సమకూర్చుచుండిరి. చీరాల పేరాల గ్రామములలో నెచ్చటనైనను సరియే. బాతెడులోతు త్రవ్వగనే పరిశుభ్రమును మధురమును నగు జల మూరుచుండును.

అందుచే నీటి కొళాయిలు గాని, దానివెంబడి వచ్చెడి యనర్థమగు మురికి కాలువలును చీరాల పేరాల గ్రామముల కవసరములు కావయ్యెను. పాఠశాలల నూరివారే సొంతముగ బెట్టించుచుండిరి. అందుచే మ్యునిసిపల్ సంఘమువారు విద్యావ్యాప్తము జేయవలసిన యవసరమును లేకపోయెను. జిల్లాబోర్డువారు లోకల్ ఫండు ఆసుపత్రిని బెట్టించియుంటచే మ్యునిసిపల్ సంఘమున కావిషయమునను కార్యభారము తగ్గినదయ్యెను. గ్రామమునకు నేటు జూచినను అందుబాటు మేరలో ఖాళీస్థలమును జీడివానిడితోటలు నుండుటచే మున్సిపాలిటీవారు గ్రామములలో పాకీవాండ్రచే దుర్భరమును నసహ్యకరము నగు పాకీపని చేయింప నవసరము గన్పింపదయ్యెను. ఇక రోడ్లు వేయుట, వీధులు బాగుచేయుట, దీపములు పెట్టించుట మొదలగు సామాన్య సౌకర్యములనెల్ల యూనియనువారే సమకూర్చగల్గుచుండిరి. ఇట్టి స్థితులలో బీదజనులగు చీరాల పేరాల గ్రామవాస్తవ్యులు అనవసరముగ ముప్పదియెన్మిదివేల రూప్యముల పన్నులఁ జెల్లించుటకు నియ్యకొనకుండుట సహేతుకముగ నున్నది.

, అట్లు చీరాల పేరాల పౌరులు తమకు మ్యునిసిపాలిటీ యక్కఱలేదని తీర్మానించుకొనిరి. ఇంతలో బొబ్బలరోగము వచ్చినది. వచ్చినట్లు మాయమయ్యెను. చీరాల పేరాల గ్రామముల మ్యునిసిపాలిటీని స్థాపింపవలసిన యగత్యము తీఱిపోయెను. కాని 1916 వ సంవత్సరమున స్వార్థపరులగు కొందరు తాలూకాబోర్డువారి చేతను జిల్లాబోర్డువారిచేతను కల్లకపటముల నెఱుఁగని కొందరమాయకవర్తకజనులచేతను చీరాల

పేరాల గ్రామములను మున్సిపాలిటీగా మార్చిన నెంతయో లాభముగల్గుననియు మిక్కిలి క్షేమకరమనియుఁ దీర్మానింపఁ జేసిరి. కాని జిల్లాకలెక్టరును సబుకలెక్టరును గ్రామములలోని పౌరులు చాలమందియును మున్సిపాలిటీ యనవసరమని యనేక విధముల సర్కారు వారికి మహజరులద్వారా తెలియపఱచిరి నను వారి యభిప్రాయము మాఱదయ్యెను. చీరాల పేరాల గ్రామములను 'మున్సిపాలిటీ కావలయునా?' యను అంశము పునర్విమర్శనముఁ గావించి తెలుపవలసినదిగా ఆరోగ్య శాఖాధికారులు గోరిరి. ఇదివఱకుఁ జీరాల, పేరాల, జాండ్రపేట, పాతచీరాల, వీరరాఘవపేటయను గ్రామములను మున్సిపాలిటీ చేయదలఁచుకొనిన ప్రభుత్వమువారు, పైగ్రామములలో జాండ పేటను వదలివైచి చీరాల పేరాల గ్రామముల మాత్రమే మున్సిపాలిటీగావించిరి. అందుచే స్వల్పసంఖ్యాకులగు చీరాల పేరాల వాసులపైననే మున్సిపలుపన్నుల భారమంతయుఁ బడినదయ్యెను. జనులలో నశాంతి ప్రబలఁజొచ్చెను. బీదలు పన్నుల నిచ్చుకొనలేమని తీర్మానమునుఁ గావించి తమ దైన్యమును ప్రభుత్వమువారికిని దోడి దేశీయులకును వెల్లడించిరి. చీరాల పేరాల గ్రామములలోని నరక శ్లేష్ములు సయితము మున్సిపాలిటీవలన జేకూరులాభము శశవిషాణ ప్రాయ మనియు వ్యయభారము దుర్భరమగుననియు ప్రభుత్వము వారికిని బ్రజలకును దెలియ పరచిరి. అదియునుగాక చీరాల కన్నఁబెద్దవియగు బాపట్ల పొన్నూరు మొదలగు స్థలములలో మున్సిపాలిటీ యేర్పఱుపబడనేలేదు. చీరాలలో సర్కారు కచేరీలు ఏవియునులేవు. బాపట్లలో తాలూకా తహశీల్దారు

కచేరియు సబుమాజిస్ట్రీటు కచ్చేరియు జిల్లామునసబుకోర్టును హైస్కూలు ఫారెస్టు రేంజీ ఆఫీసు డి.పి. డబ్లియు రేంజి మొదలగు నవన్ని యుగలవు. ఎన్నికల్గినను అచ్చట మ్యునిసిపాలిటీ స్థాపింపఁ బడలేదు. అచ్చటగూడ ప్లేగుజాడ్యము విశేషముగా బ్రబలినట్లా రోగ్యశాఖాధికారి వ్రాసెను. పొన్నూరుమున్నగు స్థలములలో కచ్చేరిలు కలవు. కాని వానిలో మున్సిపాలిటీ స్థాపింపఁబడ లేదు. అట్టి స్థితిగతులలో ఏ కచేరీలునులేని చీరాలలో ప్రత్యేక కారణములేవియు జూపకయే మున్సిపాలిటీని స్థాపించుట ప్రజ లకు దురూహ్యముగను చీరాల పేరాల పౌరులకు దుర్భరము గను నుండెను. ఎట్టెటులో వ్యవహారము ఖండన ముండనము లకు లోనై యొక్కటి రెండు సంవత్సరములవరకు లాగులాడఁ జొచ్చెను. ఎట్టకేలకు 1919 వ సంవత్సరము మునిసిపాలిటీ స్థిరముగా నేర్పుపఁబడియెను. ఎవ్వరో కొందరు పురపాలక సంఘసభ్యులుగా నెన్నుకొనబడిరి. కాని ప్రజలకు మాత్రము మున్సిపాలిటీపై నించుకేనియు నభిమానము గలుగదయ్యెను. ప్రజలు వలదని మొఱపెట్టినను వినక సర్కారువారు మున్సి పాలిటీని స్థాపించిన కారణమున ప్రాకెట్టుపైన అనగా అభ్యం తరము కనబరచి తమ కిష్టములేదని తెలియబఱచుచు నొక సంవత్సరము కాలము ఎట్టెటులో పన్నుల జెల్లింపసాగిరి. ఈ సంవత్సర కాలమును వారు సర్కారువారి కేన్నేని మహాజరుల నంపుకొనసాగిరి. ఇట్టి స్థితులలో గోపాలకృష్ణుఁడు చీరాల నగరమునఁ బ్రవేశించెను. గోపాలకృష్ణుఁడు రాజ్యతంత్రమును మ్యునిసిపలు వ్యవహారములను బాగుగ నెఱిఁగిన వాఁడగుటచే చీరాల పేరాల మున్సిపాలిటీని రద్దుపఱచు విషయమున నుచి

తములగు మహాజనులను తయారుజేసి సర్కారువారికిఁ బంప జేసెను. వారికనేకవిధములఁ బురపాలనా పద్ధతులను గూర్చియుఁ బౌరులహక్కులను బాధ్యతలను గూర్చియుఁ జక్కగ బోధపఱచి గ్రామస్థుల కనేకవిధముల సాయము చేయుచుండెను. గోపాలకృష్ణుఁడు చీరాల పేరాల మున్సిపాలిటీ వ్యవహారములఁగూర్చి చెన్నపట్టణమునఁ బ్రముఖుల తోడను నుద్యోగీయులతోడను సంప్రదించెను. కాని లాభ మేమియు లేకపోయెను. జనులు వలదని మొఱవెట్టికొనినను గగ్గోలుఁ గావించినను లెక్కసేయక ప్రభుత్వమువారు బలనం తముగ పేదలగు చీరాల పేరాల ప్రజలపై మున్సిపాలిటీని బడవైచుటను స్వాతంత్ర్యప్రియుఁడును రాజ్యతంత్రజ్ఞుఁడును ధర్మజ్ఞుఁడునునగు గోపాలకృష్ణుఁడు సహింపఁజాలఁడయ్యెను. మున్సిపాలిటీవారు సభఁగావించి తమకు మున్సిపాలిటీ యనవ సర మనియు, యూనియను మాత్రమే చాలుననియుఁ దీర్మా నించిరి. అట్టి సభికులలో రెవరెండు థామస్ అనునొక ఐరో పీయుఁడుగూడ నుండెను. ప్రభుత్వమువారు మున్సిపలు సంఘ మువారినిగూడ లెక్కింపరయిరి. అంతట మున్సిపలు సంఘ సభ్యులు ప్రజాభిప్రాయముల గుర్తించినవారయి బలవంతముగ విధింపఁబడిన యీ మున్సిపలు సంఘమున సభికులుగనుండుట కిచ్చగింపక ఆన 1920 వ సంవత్సరము సెప్టెంబరు మాసమున నందుఁ తమ పదవులకు రాజీనామానొసఁగిరి. మున్సిపాలిటీ పరిపాలనము స్తంభించునట్లుండెను. ఇంతలో సర్కారువారు ప్రసాదించిన 'మేడిపండు సంస్కరణ శాసన'ముల ననుసరించి యెన్నికలు జరిగి యందు బ్రహ్మవిద్వేషముమాత్రమే ప్రధా

లక్షణముగ గలిగిన జస్టిసు వర్గమువారు జయము గాంచిరి. జస్టిసువర్గము పక్షమునఁ బానుగంటి రామరాయణింగారు, కూర్మా వెంకటరెడ్డినాయుడు, సుబ్బరాయలు రెడ్డిగారలు ప్రజాయత్త శాఖలకు మంత్రులుగ సర్కారువారిచే నియోగింపబడిరి. స్థానిక స్వపరిపాలన శాఖామంత్రియగు రామరాయణింగారు చీరాల పేపల్లె పురములు సందర్శింప వచ్చిరి. చీరాలవారు తమకష్టనిష్ఠురములను రామారాయణింగారికి విన్నవించిరి. కాని బ్రహ్మ - విద్వేషియు సహాయనిరాకరణ ప్రబలవైరియు నగు నా మంత్రి చీరాల పేరాల గ్రామ వాస్తవ్యులు సహాయనిరాకరణ సూత్రము ననుసరించి బ్రాహ్మణుడగు గోపాలకృష్ణుని బోధలకు జెవియొగ్గి యెన్నిక లలో బాల్గొనక యోట్లు పెట్టను ఖాళీగా పంపివైచిరను కారణమున వారిపై గినిసి వారిని గొంచెము చులకనగాఁ బలికి వారికేయాశయముఁగల్పింపక యపహాస్యముగను నిష్ఠుర ముగను ఎద్దేవగను అధికారాభిమానపూరితముగను మాట లాడి ప్రజలకు నిరాశయును ఆగ్రహమునుగూర్చి వారిని శాశ్వతముగసహాయనిరాకరణావలంబులఁగావించిన పుణ్యము గట్టుకొనెను. ఇట్లుండ కలకత్తాలో జరిగిన యవసరదేశీయ మహాజన సభవారు అధిక సంఖ్యాకుల యభిప్రాయము ననుసరించి యామోదించిన సహాయ నిరాకరణోద్యమ సూత్రము లను నాగపురమున జరిగిన దేశీయమహాసభలో నికువది యామువేలమంది ప్రతినిధులు ఏకగ్రీవముగ నకుంఠితోత్సాహముతో భారతదేశదాస్యము ద్రోలఁగింపఁబరమశరణ్యమగు నుపాయమని నమ్మి మనస్ఫూర్తిగ నామోదించి యహింసా

సత్యాపథములఁ ద్రొక్క నిశ్చయించి ప్రపంచమునెల్ల నాశ్చర్య భరితము గావించిరి. నాగపుర కాంగ్రెసు తీర్మానము చీరాల వాసుల హృదయ కుహరములఁగూడ జొచ్చెననుట కాశ్చర్యములేదు. సందియములేదు. గోపాలకృష్ణుడు వ్యవహారము విషమమగునను భయమున గ్రామ మరాజకముపాలు గాకుండుటకై శాంతిని నెలకొల్పుటకై రామదండు అను పేరిట నొక స్వయంసేవకసంఘము నేర్పరచి యవసరమునకు వారిని సిద్ధముఁజేయుచుండెను.

1921 వ సంవత్సరము జనెవరు, ఫిబ్రవరు, మార్చి మాసములలో సయితము చీరాల పేరాల వ్యవహారములలో సర్కారువారించుకేనియు మార్పుఁగల్గింపరయిరి. జనులు పన్నులు చెల్లించుట మానిరి. సర్కారువారు పురపాలకసంఘమును దీసివైచి యదివరకుఁ బ్రథమశాఖకుఁ జెందిన యొక తహశీల్దారుని నెలకు రు 300-0-0 రూప్యముల జీతముపై చీరాల పురపాలకసంఘాధ్యక్షునిగానియమించిరి. అదియునుంగాక పురమున జనుల బెదిరించి పన్నుల వసూలు చేయుటకయి యల్లరులు జరగకుండ నాపుటకొరకును మిషగల్పించి సుమారు 60మందికి పైగాఁబ్రత్యేకపోలీసుభటులను గ్రామమున నియమించిరి. పురపాలక సంఘాధ్యక్షుఁడు (పెయిడ్ ఛైర్మన్) ను, రిజర్వ్ పోలీసుభటులును జనులను - అందు ముఖ్యముగా పేదవారిని ఒత్తిడిచేసి పన్నులవసూలు చేయఁజూచిరి. బీదలును విద్యాపరిచయమంతగా లేనివారును నగు సామాన్య జనులు పోలీసువారుచేయు నొత్తిడికి దాళలేక దౌర్జన్యము నెక్కడ కావింతురో యను భయము గోపాలకృష్ణుని నెక్కు-

డుగ బాధింపఁజొచ్చెను. అట్టి దౌర్జన్యమున కెడమిచ్చు చింతలు వారిలో ప్రభలకుండుటకే రామభక్తి ప్రధానమును దౌర్జన్యరహితమును అహింసాద్యుపకమును నగు రామదండు ప్రతిష్ఠాపనను గోపాలకృష్ణుఁడువారిలో నెలకొల్పి నిత్యమును రామభజనమును పురాణశ్రవణమును భగవత్సంకీర్తనమును సద్గోష్ఠియు నేర్పాటు గావించుచుండెను. గ్రామమున నంతఃకలహాములను వ్యాజ్యములను పరిష్కరించుటకుఁ బురప్రముఖుల పంచాయితీ న్యాయస్థానము నేర్పాటు చేసెను. త్యాగుడు జూదము మొదలగు దురభ్యాసముల రూపుమాపించుటకై కులకట్టుల నేర్పరచి దోషులకు 'గులతప్పుల' విధింపఁజేయుచుఁ బామరులగు సామాన్యజనుల నెల్ల దురాచారములనుండి మరల్చి సన్మార్గమునకు ప్రేరేపించెను. గ్రామము గోపాలకృష్ణుని సత్సాంగత్యమువలనను, సద్బోధవలనను. పవిత్రముగాఁ జొచ్చెను. జనులలోసదాచారములును, భక్తియు, నీతియు, ధర్మమును బ్రబలుచుండెను. రామాయణం గారు చీరాలపురమును దర్శింపవచ్చినపుడు జనులెల్లరు భజనలు గావించుచు దమ యాగ్రహమును మనోనిశ్చయమును నతనికిఁ దేటపడునట్లుగ నర్మగర్భ వాక్యపూరితమగు 'నారి సీతను వారికిచ్చి, మంచిమార్గముఁబట్టి పోరా రావణా' యని విభీషణుఁడు, సీతాపహరణంబున కొడిగట్టిన రావణునకు హితము బోధించిన సందర్భము నాధారముగాఁ గల్గిన గీతమును బాడుచు చీరాల మున్సిపల్ సంఘమును రద్దుగావించి జనులతో సంధిచేసుకొనుమని మంత్రికి హితముగఁ బోధించిరి. నాడు రావణుడు విభీషణునిహితమును బెడఁచెవిఁబెట్టి యత

నిని కాలఁదన్ని వెడలనడప నతఁడొట్లు తనయన్నతో సహాయ
నిరాకరణముగా రావించి యతనిని బహిష్కరించి యతని
విరోధియగు శ్రీరామచంద్రుని పక్షమున జేరెనో, యట్లై
చీరాల పౌరులును మంత్రితమహితమును సరకుగొనక నిందా
గర్భముగా మాటలాడి ప్రజాభిప్రాయము దృఢీకరింప గృత
నిశ్చయుడై యుంట యెరింగి గ్రామములో నున్నన్ని దినములు
నతని కెట్టిసాయమును గావింపక యతనినవలన నెట్టిలాభమును
బడయజాలమని నిరాశజెంది ప్రజలకు నించుకేనియు బాధ్యత
వహింపని మీ ప్రభుత్వముయొక్క యండనునున్న లాభము
లేదని గ్రహించి యిట్టి బాధ్యతలేని ప్రభుత్వమునుగూర్చి
స్వరాజ్యమును స్థాపింపనెంచిన గాంధిమహాత్ముని స్వరాజ్య
మహావృక్షముయొక్క చల్లని నీడను తమ యాయాసభరము
దీర్చుకొననెంచిరి.

ఇట్లుండ మార్చి నెల 31 వ తేదిని విజయవాడ పుర
మున నఖిల భారత కాంగ్రెసు సంఘమువారు సమావేశ
మయిరి. ఆ సమావేశము అదృష్టపూర్వమగు నొక మహా
తీర్థమ్ముగ నెన్నఁడును కనివిని యెరుంగని గొప్పతిరునాళ్ళగ
బరిణమించెను. భారతీయుల కష్టముల గట్టెక్కించి స్వరా
జ్యము సంపాదించి యొసంగ నవతరించిన మహాత్ముండనదగు
గాంధిమహాత్ముడు నాయకోత్తములును భూరాగ్రేసులును
నగు మహమ్మదాలీ షౌకతాలీ లాలాలజపతిరాయ్ మొదలగు
వారును దేశభక్తాగ్రేసరులగు మోతీలాల్ నెహ్రూ చిత్తరంజన
దాస్ యమునాలాల్ సేట్ కేల్కరు మొదలగువారును
నింక ననేకులగు దేశభక్తులును ఈ సమావేశమున కరుగు

దెంచిరి. ఈ యవకాశమును గ్రహించి యాంధ్రులు నాయ కోత్తములును ముఖ్యముగ గాంధిమహాత్మ్యని దర్శించుటకయి లక్షలకొలదిగ నసుదెంచిరి. విజయవాడ పురమున నెచ్చటఁ జూచినను నిసుకవెచిన రాలకుండునటు జనులు నిండిపోయిరి. వీధులనిండ జనమే! నదీతీరమునిండ జనమే! కాలువల యొడ్డులనిండ జనమే! సత్రములనిండ జనమే, ఎచ్చటను జూచినను జనమే! వివిధపురములనుండి భక్తిరస ప్రపూర్ణ హృదయులై యాంధ్రవీరులు తమ సేనాధిపతిని అతిరథ మహారథ శ్రేష్ఠులను దర్శించి శాంతియుద్ధసన్నద్ధు లగుటకు సమావేశమయిరి. ఆనాఁడు విజయవాఁడ మహాతీర్థముగ నొప్పారెను. పురమున నెల్లదిశలను అలంకారములే! ఎచ్చటఁ జూచినను స్వాగత పత్రములే! ఎచ్చటఁబోయి నను మంగళతూర్యారావములే! ఎచ్చట విన్నను భక్తిరస ప్రధానములగు జాతీయగీతముల సంకీర్తనమే! ఎచ్చోట గాంచినను భారతజాతియొక్క వునరుద్ధరణమును గూర్చి నట్టియు, మహాత్మునిఁ గూర్చినట్టియు నాయకులఁ గూర్చి నట్టియు ప్రశంసలే! ఎవరినిజూచినను విష్ణుచక్రమునకుఁ గలి యుగమున నీడువచ్చినదియని పొగడ్తగన్న రాటముపైఁ దీయఁబడిన నూలుతోనేయబడిన శుద్ధ స్వదేశ వస్త్రాలంకార భూషితులే! ఏమూలజూచినను జాతీయగీతములును, స్వదే శోద్యమ ప్రశంసలునుగల యుద్గ్రంథములే వేలు లక్షలు కొలది యమ్మబడుచుండెను. ఎచ్చటఁగనినను నుత్సాహము అమితముగాఁ బ్రబలుచుండెను. ఎల్లెడల 'మహాత్మాగాంధీకి జెయ్'యను విజయశంఖారావములు భూనభోంతరాళముల

మిన్నుముట్టుచుఁ బ్రభుత్వహృదయ కవాటనుల హాఁద్భిన్న
ములఁ గావింపఁజొచ్చెను. ఇట్టి మహాతీర్థము, ఇట్టి యఖండ
వైభవము, ఇట్టి జనసముద్రము, ఇట్టి యపరిమితోత్సా
హము, సృష్ట్యాదిగ విడయవాడపురమున కెన్నఁడును లభించి
యుండలేదు. జనుల హృదయములు ఆశాపూర్ణములై పరవ
శత్వమునొందియుండెను. సర్కారుదోర్భగస్థులు వెఱగువడి
చూడజొచ్చిరి. జనులెల్లరును దౌర్జన్యరహితులును పవిత్ర
హృదయులును సద్భావులునైన కతమున పోలీసువారి
యవసరమును వారితోడి సంఘర్షణమును లేకపోయెను. ఎల్ల
రును అతిశాంతముగ మహాత్ముని దర్శించి, చరితార్థులమయితి
మని సంతోషము నందజొచ్చిరి. నాయకు లెల్లరును అందు
ముఖ్యముగ ఆలీసోదరులును గాంధిమహాత్ముడును నరసింహా
కేల్కారును జనులకు భావపూరితములును నిరంతరదేశసేవా
ప్రోత్సాహకములు నగు నుపన్యాసరాజముల నొసఁగి
యాంధ్రుల నిసర్గదేశాభిమానమును ఫేమడుంగుల నతిశ
యింపఁజేసిరి. ఆ సమయమున గోపాలకృష్ణుడు చీరాలనుండి
ప్రత్యేకమగు రయిలుబండిపై నయిదారువేలమంది రామ
దరిడుత్రో వచ్చి మహాత్ముని దర్శించి రక్తాంబుములును శాంతి
దండధారులును భగవద్భక్తిపరులును దేశసేవారాధన తత్ప
రులను నగు తన రామభటులను నాయకోత్తముల కెల్లరకుఁ
జూపి వారెల్లరచే మెప్పులువడసెను. లక్షలకొలందికూడిన
యా జనసముద్రమును పాయలుగఁ జీల్చి సంక్షోభమే
మాత్రమును లేకుండ శాంతిని నెలకొల్పి నాయకోత్తములకు
మహదానందమును గూర్చిన గోపాలకృష్ణుని నైపుణ్యమును

సేనానాయకత్వమును గార్యదీక్షయు, మహాత్మునకును వాయకులకును నద్భుతానందముల గూర్చెను. షోకతాలీవీరుడు గోపాలకృష్ణునిసామర్థ్యము నుగ్గడించుచు "నీదేశమునముగ్గురు పిచ్చివాండ్రుగలరు. గాంధిమహాత్ముడొకడు, నేనొకడను, గోపాలకృష్ణుడు నటియొకడు" అని పల్కిన పల్కులును "రెడ్ ఆర్ మీ అనఁగా రక్తచందనాలిప్తసైన్యము" అని యుగ్గడించిన నాయకోత్తముల ప్రశంసలును గోపాలకృష్ణుని యందు నాయకుల కెట్టిసద్భావము కుదిరెనో తెల్పుటకుఁ దగిన తారాక్షణము లగుచున్నవి.

అట్లు అఖిలభారత కాంగ్రెసు సంఘమువారు బెజవాడ (విజయవాడ) పురమున సమావేశమై యొకకోటిమంది కాంగ్రెసు సంఘసభ్యులును, ఒక కోటిరూప్యముల తిలక్ స్వరాజ్యనిధియు, యిరువదిలక్షల రాటములను సంపాదింప వలెనని తీర్మానించిరి. ఈ తీర్మానముయొక్క యర్థమునే దేశబంధు చిత్తరంజనదాసు "Men, money, and munitions" (సైన్యము, ద్రవ్యము, ఆయుధసామగ్రి)యను భావగర్భితపదములలో దెల్పెను. సమావేశానంతరము నాయకు లెల్లరును తమతమ పురములకు జనిరి. మహాత్ము డాంధ్రదేశమున సంచారముగావింప నంగీకరించి బందరుపురమును, గుంటూరుపురమును, మిగిలిన గ్రామములను దర్శించెను. ఎచ్చటికేగినను జనులు మహాత్మునిదర్శించి కానుకల సమర్పించి యత్యుత్సాహమును ప్రదర్శింపుచుండిరి. మహాత్ముడు మోటారుబండిలో వేసవియెండను లెక్కజేయక తెల్లవాఱుజాముసమయము నుండి రాత్రి రెండుజాములవరకును ప్రయాణ మొనర్చెనని

నచో నాయనయొక్క దేశాభిమానమును కార్యదీక్షను వేఱు ప్రశంసించనక్కఱలేదు.

ఏప్రియల్ 6వ తేదిని మహాత్ముడు చీరాల పేరాల నగరములను దర్శించెను. రామనగరమున గోపాలకృష్ణుడు పురజనులచే చక్కని పందిళ్ళువేయించి మహాత్మునికుచిత మగు స్వాగతము నొసగెను. మహాత్ముడు చీరాలపేరాల గ్రామముల సౌందర్యముగాంచి యబ్బురముజెంది యందలి పౌరుల దేశభక్తికవ్యాజానందమునొందెను. ఇట్టి దేశభక్తుల కిట్టి కష్ట ముదయించెనుగదాయని మహాత్ముడు విచారము నొం దెను. కష్టములలోనుండియు చీరాలపౌరులొసగిన 4 వేల రూప్య ములకొనక్కను మహాత్ముడు వేయికోట్లుగాభావించి స్వీకరిం చెను. మహాత్ముడు చీరాల పేరాల పేరాల మ్యునిసిపాలిటీ వ్యవహారమునుగూర్చి ముచ్చటించుచు నయ్యది సక్రమాందో ళనమేయనియు అట్లయ్యు మునిసిపాలిటీని పరిత్యజింపకుండిన బాగుండెడిదనియు, నొకమాఱు వ్యవహారమును బూనినతరు వాత దాని నాసాంతము సాగింపవలెననియు మ్యునిసిపాలిటీ తొలగించుటకు దౌరన్యరహితముగ శాసనోల్లంఘనము గావించి పన్నుల నెగబెట్టుటగాని పురత్యాగముజేయుటగాని మార్గములనియు, సర్వదేశమును చీరాల పేరాలపై దృష్టి నిగిడ్చి చూచుచుండురనియు జయము చేకూరిన దేశీయు లెల్లర యాశీస్సులును, అపజయము చేకూరిన దేశీయు లెల్లర భూషణమునును, చీరాల పేరాల పౌరులకు లభించు ననియు, అందుచేత మననాయకుడగు గోపాలకృష్ణుని యాజ్ఞానుసారముగా దౌరన్యరహితముగా నుద్యమము

సాగించి జయము పొందుడనియు నుద్బోధించి యాశీర్వ దించెను. జనులెల్లను మహాత్మనివాకున్నధారసధారల గ్రోలి యానందపారవశ్యము నొందిరి. మహాత్ముడు చెన్నపురికేగ ప్రయాణమయ్యెను. గోపాలకృష్ణుడు సనాతన పద్ధతిని తాటి యాకులపైని వ్రాసిన స్వాగతపత్రమును భక్తితో ప్రణామ పురస్సరముగా సమర్పించి పూర్వము శకుంతల నత్తవారింటి కనుపునపు డామె పెంపుడుతండ్రియగు కణ్వమహర్షి యాశీర్వ దించి పల్కిన,

శ్లో॥ రమ్యాస్తరః కమలినీహరితైః సరోభిః,
ఛాయాద్రుమైర్నియమితార్క మయూఖతాపః,
భూయాత్కశేశయరజోమృదు రేణురస్యాః,
శాంతానుకూలపవనశ్చ శివశ్చ పంథాః.

అను శ్లోకమును సభ్యులకును మహాత్మునికిని జదివి వినిపించి యెల్లరకును భావౌన్నత్యమును రసపారవశ్యమును గల్గించెను. మహాత్ముడును సమ్మోదితహృదయుడై చీరాల పేరాల పౌరుల యనురాగపూర్ణమగు స్వాగతమును మహా దాశీస్సులను నందికొని చెన్నపురికై ప్రయాణమై వెడలెను. చీరాల పేరాల పౌరులు మహాత్మునిరాకచే తమ పురములు పావనము లయ్యెం గదా యని సంతసించి మహాత్మునియాజ్ఞల దలదాల్చి యుద్యము సాగింపనిశ్చయించిరి.

పంచమ ప్రకరణము

చీరాల రంగము (౨)

తదనంతరము చీరాల పేరాల గామపౌరుల మహా సభలో పురత్యాగముచేయుటయే యుత్తమమని తీర్మానింప బడెను. వెంటనే వరక శ్రేష్ఠులునుఁ బీదలును కలిసి యూరికి వెలుపల తాటాకులత్రోవ పాకలవేయించి చీరాల టోలుగేటు వెలుపలనుపేరాల టోలుగేటు వెలుపలను నూతన నగరముల నిర్మించి ఏప్రిల్ 25వ తేదిరాత్రి మంగళవాద్యములతోడను దేదీప్యమానముగ వెలుంగుదీపములతోడను 'మహాత్మాగాంధీకి జై'యను విజయశంఖారవములతోడను తాతల తండ్రుల నాటినుండియు నివసించుచున్న స్వగృహాముల వీడి తర తరముల నుండియు జన్మస్థలముగనుండిన గ్రామముల బరిత్యజించి 'సుగుణాకరజన్మభూమి సుఖమెట్టిదయో'యను వాక్యము యొక్క యూదార్ధ్యముననుమానించుటకు వీలు కలుగునట్లుగ దేశత్యాగ మొనర్చిరి. నూతనపురముల బ్రవేశించిరి. గొప్ప వారును కొద్దివారును భాగ్యవంతులును బీదవారును బలవంతులును బలహీనులును ననువిభేదము లేకుండ సర్వజనమును పురత్యాగము గావించి తమ దేశాభిమానమును సువ్యక్తము గావించిరి. ఆ నడివేసవిలో స్త్రీలు, పురుషులు, ముదుసలులు, పిల్లలు అందరును సామానుల నెత్తినవెట్టికొని పాకలలోనికి మోసికొనిపోవగా జూచితిని. చేటలు, చాపలు, చీపురులు రోళ్ళు, రోకటిబండలు, పిడకలు, మొదలగువానినెల్ల మోసి

కొనిపోవు స్త్రీలను పిల్లలను, పెట్టెలను పాత్రములను, బస్తాలను, మూటలను మోసికొనిపోవు పురుషులను జూచిన నా కన్నులనీరు గారజొచ్చెను. గర్భిణులగు స్త్రీలును బాలింతరాండ్రును, పసిబిడ్డల తల్లులును, చిన్నపిల్లలును రోగులును, ముదుసలులును నెల్లరును నా మండు వేసవియందు గ్రామత్యాగముగావించి యధికార భూర్వాహులను మునిసిపల్ ఉద్యోగులయొక్కయు డార్జన్య ప్రేరకులగు పోలీసుల యొక్కయు బారిబడకుండ నూతన నగరముల బ్రవేశించి శాంతముగ జీవితవ్యాపారముల బ్రొద్దుపుచ్చుచొడగిరి. గోపాల కృష్ణుడు తాను చెన్నపట్టణమాదిగాగల పట్టణముల కేగి దాన కర్ణుల సాయమున పేదలకు సుమారు పదివేల రూప్యములు చీరాల పేరాలలోని బీదజనుల సాయతకె సంపాదించి తెచ్చెను. యస్. శ్రీనివాస అయ్యంగారును, టంగుటూరి ప్రకాశంగారును చెరియొకవేయి రూపాయలనునిచ్చిరి. మిగిలిన పెద్దలనేకులు విరివిగా దానములనొసంగి మే నెల 1వ తేదీని ఆంధ్రరాష్ట్రకాంగ్రెసు సంఘమువారు 3 వేల రూప్యముల నొసగిరి. ఆ నాడు విజయవాడ పురమున సంఘ సమావేశమునందును పౌరుల బహిరంగసభయందును గోపాల కృష్ణుడు చీరాల పేరాల పౌరుల కష్టములను అఖండ త్యాగమును కన్నుల నీరుగారునట్లుగను, ఒడలు జలదరించు నట్లుగను, హృదయములు కఱుగునట్లుగను వర్ణించి మహోపన్యాసములు గావించెను. రాష్ట్రీయ సంఘసభ్యులలో నొక్కరు తప్ప మిగిలినవారెల్లరును గోపాలకృష్ణుడుకోరిన 3 వేల రూప్యములను చీరాలవారికి సాయముగా హృదయపూర్వకముగా

నొసగిరి. గోపాలకృష్ణుడు యూతదొరికినందుకు సంతుష్టుడయ్యెను. నాటిబహిరంగ సభలో చీరాల పేరాల వాసులెల్లరును మరణమయిననుసరే మ్యునిసిపాలిటీ యంతముజూడనెంచియున్నారనియు దేశీయులునేవారికి దిక్కనియు, తల్లిదండ్రులభాతి పెంచదగిన ప్రభుత్వమువారు వారి నష్టకష్టముల పాలేయు చుండిరనియు, ప్రభుత్వమువారిని Prestige అనగ జుర్భిమానము భాధించుచుండెననియు, ఏమైననుసరే వెనుదీయనుని పలికి సభ్యులకు పారవశ్యముదవింపజేసెను. విజయవాడపౌరులు చీరాల సహాయనిధికి ధనము నొసగి సాయముగావించిరి.

అప్పటినుండియు గోపాలకృష్ణుడు చీరాల పేరాల మోక్షమే తనమోక్షముగ నెంచికొనుచు రేయింబవళ్ళు కృషిసల్పదొడగెను. అధికారులకు కన్నులెఱ్ఱనగాజొచ్చెను. చీరాల పేరాల జనుల కార్యదీక్ష సర్కారువారిని గడగడ వడకింపజొచ్చెను. ఆంధ్రదేశమే యనేల సకల భారతదేశమును చీరాలకైజూడ దొడగెను. మహాత్ముడు తన 'యంగ్ ఇండియా' పత్రికలో చీరాల పేరాల పౌరులను వారినాయకుడగు గోపాలకృష్ణుని మిక్కిలి కొనియాడెను. జనులెల్లరును వారి కార్యదీక్షకుమెచ్చి ధనసాయముచేయుచునుండిరి. చీరాలయొక్క జయముపై భారతవర్షముయొక్క భావిస్థితి యాధారపడియున్నదని యెల్లరును పలుకసాగిరి. అందుచే చీరాలపేరాల పౌరులయొక్కయు వారి నాయకుడగు గోపాలకృష్ణునియొక్కయు బాధ్యత హెచ్చినదయ్యెను. భారతవర్షముయొక్కయు, చీరాల పేరాల గ్రామముల

యొక్కయు కీర్తిప్రతిష్ఠలను గాపాడ గోపాలకృష్ణుడాంధ్ర మండలమున నిరంతరము సంచారము జేయుచు, చీరాలకు సంజీవి (అనగ ధనసహాయము)ను యాచించి సంపాదించుచు చీరాల పేరాలయొక్క స్థితిగతులనువారియుద్యమ స్వభావమును నెల్లరకును దెలుపుచుండెను. వుండి, భీమవరము, ఏలూరు, రాజమహేంద్రవరము, నరసాపురము, కాకినాడ మొదలగు పట్టణములకేగి యతడు మహోపన్యాసముల నొసగి చాలధనమును ప్రోవుజేయగల్గెను. ఆ రోజులలోనే యతడనంతపురమండల మహాసభ కగ్రాసనాధిపత్యము వహించెను. గోపాలకృష్ణుడు చీరాల నాయకుడయ్యెను. గుంటూరు మండలమున పొన్నూరుపురమున జరిగిన మండలసభలో గోపాలకృష్ణునకాంధ్రరత్నమను బిరుద మొసగబడెను.

ఇట్లుండగా యధికారులు దిగ్భ్రమ జెంది చీరాల వారుల లొంగదీయు నుద్దేశముతో వారిననేక నిర్బంధముల పాల్జేసిరి. మహాత్ముడు చీరాలకు రాకపూర్వమే పండ్రెండు గురు పురుషులును వృద్ధురాలగు నొకస్త్రీయును పన్నుల నీయ నిరాకరించినందులకై కారాగృహమునకంపబడిరి. వేలకొలది జనులువారికి వీడ్కోలొసంగిపంపిరి. అచిరకాలమునసే వారు తిరిగి యరుదెంచిరి. మహాత్ముడావీరులనెల్లర పుష్పమాలాలంకృతులగావించి దేశభక్తాగ్రగణ్యురాలగు నావృద్ధ నారీమణిని మాతృభావముతో కౌగిలించుకొనికొనియాడెను. అప్పటినుండియు జనులకు నిర్బంధములన్న నిర్భయముగ నుండెను. ప్రతివిచారణకును గోపాలకృష్ణుడు వేలకొలది జనమును గైకొని భజనలతోడను మేళతాళములతోడను చని వారి

కుత్సాహమును గల్పించుచుండెను. అతడు వారికి కల్పించిన యుత్సాహమునకు చెరసాలకుజనిన యూవృద్ధ స్త్రీ, సర్కారు పక్షమున జేరి జనులను హింసించుటకు బాల్పడిన మేజస్ట్రేటును (దండనాధికారిని) నిర్భయముగ జీవాట్లు పెట్టినదే ప్రబల తార్కాణము. జనులను నిర్భంధముచే లొంగదీయలేకపోయి నందుకు సర్కారువారు సిగ్గుజెందిరి. కాని అధికారాభిమాన పిశాచమును **Prestige** అనుగ్రహమును వారిని బాధించు చుండుటచే వారు ప్రజలత్యాగమును, బాధలను, నిర్భయ స్వభావమును తృణీకరించి పట్టిన మొండిపట్టు విడువక నిష్కారుణ్యము వహించి చీరాల పేరాల పౌరుల కమిత కష్టములు కల్పించినవారైరి. వేసవికాలమగుటచే నగ్నిభయమునుండి పాకల గాపాడుటకును, అప్పుడప్పుడు సాగుచుండిన దొంగ తనముల నాపుటకును గ్రామమున పోలీసు, మ్యూనిసిపల్ ఉద్యోగులు కావించుపనులు నెరవేర్చుటకును, ఇతరసాయములను గావించుటకును, విధులననుష్ఠించుటకు గోపాలకృష్ణుడు రామదండులోని భటులను వంతుల ప్రకారము నియమించుచుండెను. గ్రామములోని తగవులను పరిష్కరించుటకును, చాటుగా పన్నులను జెల్లించినవారికి తప్పు విధించుటకును పంచాయతీకోర్టువారు కృషిసల్పుచుండిరి. పంచాయతీవారి తీర్పు సర్కారువారి తీర్పులబోలె శిరసావహింప బడజొచ్చెను. ఇది యంతయు సర్కారువారికి వెఱగు పుట్టింపజొచ్చెను. జనులు గోపాలకృష్ణుని యాజ్ఞల శిరసావహించి పనిజేయు చుండిరి. ఈ చర్యలన్నింటిని గూర్చివిని అలహాబాదులోని 'ఇండిపెండెంటు' పత్రికాధిపతియగు జార్జి జోసెఫ్‌గారను

నొకబారిష్టర్ అఖిలభారతీయ సంఘసమావేశ సందర్భమున జరిగిన బహిరంగసభలో "Who is the Governor of Chirala? Gopala Krishna or lord Willingdon? It seems to me Gopala Krishna is really the Governor of Chirala and not lord Willingdon." (చీరాలకు ప్రభువెవరు? గోపాలకృష్ణుడా లేక విల్లింగుడన్ ప్రభువా? నాకుజూడ గోపాలకృష్ణుడే ప్రభువుకాని విల్లింగుడన్ ప్రభువు కాదని తోచుచున్నది.) అని గంభీరముగ బల్కెను. చీరాలవారు పద్మవ్యూహమునుబన్ని వీలున బడిరి. ధర్మమువారిని గాపాడు చుండెను. గోపాలకృష్ణుడు నాయకుడుగానుండి వారిని నడుపుచుండెను. దేశీయు లెల్లరును, భారతమాతయు, సకలదేవతలును వారి నాదరముతో గనుచుండిరి. సర్కారువారీ వ్యూహము భేధింప విశ్వప్రయత్నములగావింప జొచ్చిరి. కాని ప్రజలెంతటికిని లొంగమిచే విఫల మనోరథులైరి. చీరాలపేరాల పౌరుల తపోగ్నికి భారత వర్షమెల్ల తుకతుక యుడుకజొచ్చెను. ఈ సందర్భములో గొప్పవారును దొడ్డవారను భేదములేక తప్పుజేసినవారిని నిష్పక్షపాతముగ శిక్షించుచుండిన చీరాల పేరాల పంచాయతీ న్యాయస్థానమువారును రేయింబవళ్ళు కృషిసల్పి పురజన్ముల గాపాడుచుండిన రామదండు సైనికులును ప్రత్యేక ప్రశంసార్హులు. ఇక కారాగార గృహములకేగినవారి కీర్తిని గూర్చి ప్రశంసయే నక్కరలేదుగదా.

వేసవిగడచిపోయెను. కాని సర్కారువారు మ్యునిసిపాలిటీని రద్దుజేయలేదు. జను లూరిబయట నివసించుచు పన్నుల నీయనక్కరలేకుండ తప్పించుకొని కాలక్షేపము జేయుచుండిరి. ఆ పాకలలోనే వారు తమ తమ పనులనుజేసి

కొనుచు అచ్చటనే పెండ్లిండ్లు పేరంటములు మొదలగునవి జరుపుకొనుచు, అచ్చటనే హరికథలు, గానసభలు, భాగవతములు, భజనలు మొదలగునవి సాగించుచు సుఖముగ శాంతచిత్తులై నివసించుచుండిరి. చీరాల పేరాల గ్రామములు నిర్మానుష్యములై, భూతప్రేతములకును, క్రూరసర్పములకును, సృగాలములకును నివాసములై భీకరముగనుండెను. ఇండ్లు కూలిపోవుచున్నను, గ్రామము పాడైపోవుచున్నను, ఇండ్ల తలుపులు మొదలగువానిని దొంగలెత్తుకొని పోవుచున్నను జనులు లెక్కసేయక మ్యునిసిపాలిటీ రద్దగువరకును నేమైనను సరియే గ్రామములలోనికి రాగూడదని నిశ్చయించుకొనిరి. చీరాల పేరాలపౌరుల ప్రతిజ్ఞ కడ్డులేదయ్యెను. చీరాల రంగయ్యగారు మొదలగు నాయకులనేకులు కారాగారమున శిక్షననుభవించివచ్చిరి. జనులదీక్ష మరింతహెచ్చెను. వర్షాకాలము వచ్చి యనేకకష్టములు ప్రాప్తించినను వారు పట్టుదలను వీడలేరి. సర్కారువారును తమపట్టుదలను వీడలేరి. నిర్బంధములు విరివిగ జరుగుచునేయుండెను. ఈ మహాసంగ్రామమున కంతమెన్నటికో? స్వరాజ్యమువచ్చిన పిమ్మటనే గాని చీరాలకు మోక్షము చేకూరదను భావము చీరాల పేరాల పౌరులలోను, నిఖిల భారతీయులలోను వ్యాపింపదొడగెను.

ఈ కాలమునసే జులై నెలయంతమున కృష్ణాపుష్కరము ప్రాప్తించెను. ఆ పుష్కరమునకు భరతవర్షమునందలి వివిధభాగములనుండి జనులు వేనవేలు వత్తురు గావున వారికి స్వరాజ్యోద్యమమును గూర్చిబోధించుటకు విజయవాడ కాంగ్రెసు సంఘమువారు దేశభక్తులనేకులచే మహోపన్యాస

ములు నిప్పించుచుండిరి. ఆ పుష్కరదినములలో గోపాల కృష్ణుడు 'దండనీతి, దౌర్జన్యము' అను విషయమునుగూర్చి భావగర్భితమగు గంభీరోపన్యాస మొసగెను. దానిసారాం శము క్రింద బొందు పరచెదము.

శత్రుసాధనములు మనశాస్త్రజ్ఞులు సామ, దాన, భేద, దండోపాయములని నిర్వచించిరి. వీనినేచతుర్విధోపాయము లని సాధారణముగ బేర్కొందురు. అట్టియుపాయములలో సామదానభేదములు వసుసగా ప్రయోగింపదగును. వీనిచే శత్రువులొంగిరానిచో నాల్గవదగు దండోపాయము ప్రయో గింపదగును. దండోపాయమనగా శత్రువును తాడన, పీడన, మర్దన, ఖండనాది శరీరబాధలగల్గించి లొంగదీయుట, భుజబల ముచే శత్రువునకు బాధగల్గించి యతనిని వశము గావించు కొనుటగూడ న్యాయమును, శాస్త్రసమ్మతము నేయని యార్యధర్మవేత్తలు నిర్ణయించిరి. రాజనీతిలో దండనీతి యనగా దండోపాయము ప్రయోగింపదగిన పద్ధతి ప్రాముఖ్య ముగ బేర్కొనంబడినది. కాని దండోపాయప్రయోగము వలన యనర్థముల బాగుగ గ్రహించిన వారగుటచే మన వారద్దానిని తప్పనియెడలదప్ప నూరక ప్రయోగింపదగదని శాసించిరి. దండోపాయమునకు దౌర్జన్యమునకును భేదము కలదు. దౌర్జన్యమనగా దుర్జనుని స్వభావమును వాని చర్యలు నని గ్రహింపదగును. అందుచే దౌర్జన్యము న్యాయమును శాస్త్రసమ్మతమును కాదు. రాజులు దుర్మార్గుల శిక్షించు పట్ల నవసరమైనచో దండోపాయమునే ప్రయోగింపదగును గాని దౌర్జన్యము సేయందగదు. దౌర్జన్యము నీతి ధర్మముల

ఛేదించును. అవసర ప్రయుక్త దండోపాయము నీతి ధర్మముల సంరక్షించును. అందుచే దౌర్జన్యము నెన్నడును భారతీయులు తలపెట్టకూడదు. దండోపాయము ప్రయోగింపగల శక్తిగాని, ప్రయోగింపనలసిన యవసరముగాని ప్రస్తుతము లేదు. అందుచే శత్రుసాధనకు [అనగా స్వరాజ్యసంపాదనకు] దౌర్జన్యగహితమగు సహాయ నిరాకరణమే. ప్రభువైముఖ్య యోగమే శరణ్యము. ఇందులకు శాస్త్ర పురాణాదులలో నెన్నియేని తార్కాణములును, ఉదాహరణములును కలవు. శత్రుని పాపము పూర్తిగా పండనిది దండోపాయము ప్రయోజ్యము కాదనియు, సామ, దాన, భేదోపాయములే ప్రయోజ్యములనియు భగవదవతారముల చరిత్రములవల్ల స్పష్టమగుచున్నది. ఈ భావమునే యింకొక రీతిని చెప్పవచ్చును. రాక్షసులాదిగాగల దుష్టులెల్ల చేతనైనంతవరకు సాధుజనులకు బాధకలిగించుచుండ, సాధుజనులు బాధలు సహించి సహించి యెంతకును తమ బాధలకంతము కనుపించకున్న యెడల భగవంతుని శరణువేడ, నతడవతరించి రాక్షసుల సంహరించి భక్తులను సాధుజనులను కాపాడుచుండెను. ప్రహ్లాదునిచరిత్ర మిందులకు ప్రధానమగు దార్ఢ్యము. సాధుజనుల బాధానుభవము దుర్భరమై మితిమీరి దుస్సహమగువఱకును దండోపాయమునకు ప్రసక్తి కలుగనేరదు. అట్లే భారతీయులింకను దుస్సహ బాధానుభూతి నందలేదు. వారనుభవించుచుండిన బాధలింకను స్వల్పములే. వారుగావింపవలసిన త్యాగమింకను నమితమైయున్నది. పరిపూర్ణ బాధానుభూతినందక సంపూర్ణ త్యాగమును గావింపక భారతీయులు

దండోపాయమునకుదిగి స్వరాజ్యము సంపాదింపజూచుటతప్పు. భగవంతునిపై భారమువైచి బాధలనన్నిటిని సదాభవముతో భరించి, యఖండ త్యాగము గావించుచు పవిత్రులై స్వరాజ్యసంపాదన కర్తలు కావలెనుగాని యూరకదౌర్జన్యమునకును, దండోపాయమునకు గడంగుట యెగ్గేగాని లగ్గు కాదు. ఇట్టిబాధాను భూతియు, నిట్టి త్యాగమును మహాత్మునిచే నిర్దేశింపబడిన సహాయ నిరాకరణవ్రతమునందు గన్పట్టుచున్నది. కావున సహాయనిరాకరణమే ప్రస్తుత భారతీయులకవశ్యానుష్ఠేయము. సహాయ నిరాకరణము సర్వదానుష్ఠేయమాయనువిషయము దేశకాలపాత్ర స్థితులపై నాధారపడియుండును. కాని దౌర్జన్యముమాత్రము సర్వత్ర సర్వదాత్యాజ్యమని నొక్కి వక్కాణింపదగును. దౌర్జన్య రాహిత్యమే ప్రధానముగాగలయహింసావ్రతమే యవశ్యకరణీయమని భారతీయులు గ్రహించి స్వరాజ్యముసకై కృషి సల్పవలయును.

భావగర్భితమగు నీ యుపన్యాసమును విని జనులెల్లరును హర్షించిరి. సిద్ధాంత విషయమున గోపాలకృష్ణునకును, గంపల గూడెం కుమారరాజాగారగు కోటగిరి వేంకట కృష్ణారావు గారికిని జరిగిన చర్చ సభ్యులకు విజ్ఞాన ప్రదమై యొప్పెను. అప్పటినుండియు గోపాలకృష్ణునిపై ప్రజలును ప్రభుత్వము వారునుగూడ కన్నులువైచియుండిరి. పుష్కరమున జరిగిన సభలలో నెల్ల గోపాలకృష్ణుని యుపన్యాసమును, గంపలగూడెం కుమారరాజాగారితో వాదమును జరిగిన సభయే మిన్నందము గాంచెనని నతిశయోక్తి కానేరదు. పుష్కరముల

లోనే గోపాలకృష్ణుని నిర్బంధించెదరను వార్తలు ప్రబలి యుండెను. సర్కారువారు గోపాలకృష్ణుని నెట్టులైన నుద్యమ వ్యాపనముగావింపకుండ జేయనెన్నేని ప్రయత్నముల సల్పు చుండిరి.

ఇంతలో సెప్టెంబరు మాసమున నాంధ్రదేశమునందలి గంజాం మండలములోని బ్రహ్మపురమున నాంధ్రమహాజన సభయు, నాంధ్రరాష్ట్రీయసభయు సమావేశమయ్యెను. ఈ తూరి యాంధ్రమహాజన సమావేశ మత్యంత ప్రాముఖ్యము గడింపగల్గునని యెల్లరును తలచుచుండిరి. అప్పటికే యాంధ్ర మండలమున గుంటూరు, కృష్ణా, గోదావరీమండలముల నుద్యమవ్యాప్తి యెక్కువగనుండిన కతమున సర్కారువారా జిల్లాలపై తీవ్రదృష్టి ప్రసరింపజేసి అవసరమైనచో ఆయుధబల ముచేనైనను ప్రభుత్వాధికారమును నిలువబెట్టెదరని చెన్నపురి గవర్నరగు విల్లింగుడన్ ప్రభువుబెదరించెను. ఆంధ్రమండలము నందలి జనులు స్వదేశవస్త్రముల విరివిగ తయారుజేయుచు, కల్లుసారాయి అంగళ్ళపాటలు సాగకుండజేసి మధ్యపాన నిషేధము కొనసాగించుచు, కాంగ్రెసు సంఘముల వేలకొలది స్థాపించి లక్షలకొలది సభ్యులజేర్పించుచు, తిలక్ స్వరాజ్య నిధికనేకలక్షల కాన్కలనొసగుచు, న్యాయవాదులవృత్తిని విసర్జించుచు నుద్యమాభివృద్ధిని గావించుచుండిన కతంబున సర్కారువారా గ్రహించి పల్నాటిలో ప్రజలను పన్నులీయ వద్దని బోధించిరని నేరముమోపి బారిష్టర్ ఉన్నవ లక్ష్మీ నారాయణపంతులుగారిని, వకీలు మాడభూషి నరసింహా చార్యులవారిని నిర్బంధించిరి. తోడనే యాంధ్రమండలము

సంచలితమయ్యెను. లక్ష్మీనారాయణ గారిసతీతిలకమగు లక్ష్మీ బాయమ్మగారు భర్తగారిమార్గముననుసరించి స్వరాజ్యోద్య మమున కృషిసల్పి నిశ్చయించి స్త్రీలకును, విద్యార్థులకును బోధజేయుచు నుద్యమమును వ్యాపింపజేయుచుండెను. ఇంతలో గుంటూరున కల్లుపాటలుజరుగు సందర్భమున దేశ భక్తులగు కొండవెంకటప్పయ్యపంతులుగారిని, బారిష్టర్ హనుమయ్యగుప్తగారిని, మద్దిరాధాకృష్ణయ్యగారిని, భట్టి ప్రోలు సూర్యప్రకాశరావుగారిని గుంటూరుజిల్లా యధికారులు నిర్బంధమునకుంచిరి. వెంటనే గుంటూరుపురమున వారము దినములు గొప్ప హరతాళము (సమ్మె) జరిగెను. సంచల నము నాపశక్యముగాదయ్యెను. జనులాగ్రహము జెంద జొచ్చిరి. సర్కారువారియుద్యోగీయులుకూడ సమ్మె కట్టుద రని భయముకల్గెను. ఆంధ్రమండలమునందలి నాయకులెల్ల రును గుంటూరునకరుదెంచి ప్రచండోత్సాహ ముదయింప జేయజొచ్చిరి. వృష్టిమెప్పుడు విరిగి యెచ్చట నెవ్వరిపైబడు నోయ్యనుభయము సర్వత్రప్రబలదొడగెను. అధికారులు గడ గడవడకసాగిరి. ప్రజలు దౌర్జన్యమెక్కడ పొడసూపునోయని యాత్రము నొందుచుండిరి. తుట్టతుదకు ప్రభువులు ప్రజల యభిత్రోద్రేకమును తత్ఫలితములను గమనించి తమ తప్పు దిద్దికొని యాయాంధ్రపేరుల నల్వురను వదలిరి. మహాత్మునకు వేంకటప్పయ్యగారినివదలిరనువార్త రుచింపలేదట! ఆయనను తుపాకితో కాల్చి చంపిరని విన్నచో నేను సంతోషము జెందియుందునని మహాత్ముడువ్రాసెను. దేశభక్త వేంకటప్పయ్య గారినిబోలిన సాధుపులకపకృతిసల్పనెంచిన ప్రభుత్వమునకులగ్గు

చేకూరుననియే మహాత్ముని యభిప్రాయము. మహాత్ముని వచనముల భావమును సర్కారువారు గ్రహించియే గుంటూరు ధీరులను విడిచి పుచ్చి తమతప్పును దిద్దికొనిరి. ఆంధ్రదేశము శాంతించెను. కాని యధికారులు లోలోన గుంటూరునాయకులను,సహాయ నిరాకరణమును నడచివేయ యత్నించుచుండిరి. ఈ రీతినే రాజమహేంద్రవరమున శ్రీయుతులగు బులుసు సాంబమూర్తి, కందులవీరరాఘవ స్వామినాయుడు డాక్టరు బ్రహ్మాజోస్యుల సుబ్రహ్మణ్యం, గజవల్లి రామచంద్రరావు, పాలకోడేటి గురుమూర్తిగార్లపై నేజెన్సీ జిల్లాలో పన్నుల నీయవద్దని చెప్పిరనినేరము మోపి జామీ నీయవలసినదిగా నిర్బంధించి చివరకు ప్రజాభిప్రాయమునకు వెఱచియు, తగినసాక్ష్యములేమిం జేసియు వారినంద రను విడిచి పుచ్చిరి. పల్నాటిలో ప్రభుత్వమువారి యటవీశాఖానిబంధనల మూలముగ పశువుల మేత కిబ్బందియై పశువుల ఘోష యెక్కుడగుచున్న కతమున నచ్చటి జనులు సర్కారునకీయవలసిన పుల్లరినెగబెట్టసాగిరి. రాయచోటి, కనకదుర్గము, అనంతపురము, కడప, బళ్ళారి, కర్నూల్ మొదలగు తాలూకాలలో ప్రభుత్వమువారు నిర్బంధముల నెక్కుడుగ జేయుచుండిరి. చీరాల రేపల్లె వ్యవహారములు విషమములగుటచే రేపల్లెలో నుపన్యాసముల నెవ్వరు నియ్య గూడదని శాసించిరి. విశాఖపట్నమున గాంధిటోపీలను ధరించి పాఠశాలకువచ్చినందులకై వైద్యకళాశాల విద్యార్థులు కళాశాలనుండి వెడలగొట్టబడిరి. ఇట్లే నిర్బంధ విధానము సర్వత్ర చెలరేగుచుండెను. ఆంధ్ర హృదయములు

కోపకంపితములగుచు శాసనోల్లంఘనము గావించి సర్కారు వారిని శాంతియుతముగ ప్రతిఘటించుట కుత్కంఠితములగుచుండెను. బరంపురమున జరుగు సభలలో నమిత్రోద్రేకము చెలరేగుననియు నందుచే శాసనోల్లంఘనమున కనుజ్ఞ యొసంగబడుననియు భయపడి సర్కారువారు నిర్బంధములగావింప సంసిద్ధులగుచుండిరి. అంతకుమున్నే ఈ వార్త పత్రికలలో ప్రకటింపబడెను. గుంటూరు, గోదావరి మండలములవారు శాసనోల్లంఘనము జేయవలెనని యాత్రముత్రోనుండిరి. కారాగారవాసము ననుభవింప స్త్రీలు సైతము సిద్ధముగనుండిరన పురుషులమాట చెప్పనేల ? నిజమరసిచూడ నీ యుద్యమమున స్త్రీలే యెక్కు డుత్సాహము గనుపరచుచుండిరి. శ్రీమతి ఉన్నవ లక్ష్మీబాయమ్మగారు, దువ్వూరి సుబ్బమ్మగారు, మాగంటి యన్నపూర్ణాదేవిగారు, యామినీ పూర్ణతిలక మొదలగు స్త్రీ లాంధ్రమండలమున నెల్లెడల ప్రచారముసేయుచు జనుల కుత్సాహము గలిగించుచుండిరి. మహాత్మునితోగూడఁ జెన్నపురి కేగుచుండ మౌలానా మహమ్మదాలీగారిని విశాఖపట్టణమున సర్కారువారు పట్టుకొనుటచే నచ్చట గలవరము హెచ్చఁజొచ్చెను. అందుచే వారుగూడ శాసనోల్లంఘనమునకుఁ గాలు దువ్వసాగిరి. ఆయేటి యాంధ్ర మహాజనసభకు గంపలగూడెము కుమార రాజాగారగు కోటగిరి వెంకట కృష్ణారావుగారును, ఆంధ్ర రాష్ట్రీయసభకు శ్రీయుత భోగరాజు పట్టాభిసీతారామయ్యగారును అధ్యక్షతను వహించిరి. ఆంధ్రమహాజనసభ ప్రత్యేకముగ నుండవలయునా ? యక్కఱలేదా ? యను విషయము

చర్చకువచ్చెను. గోపాలకృష్ణుడు రాజకీయ కల్లోలముల కతీతమయినదియు శాశ్వతమయినదియునగు నాంధ్ర నాగర కతా స్వరూపస్వభావముల నిర్ధారించి తెల్పుటకుఁ బ్రత్యేక ముగ నాంధ్ర మహాజనసభ యుండవలయుననియే సభికులచే దీర్మానింపఁజేసెను. చీరాల పేరాల పౌరుల దుస్థితి నాంధ్ర మహాజనుల కెఱిగించి, వారికి సహాయ్య మొనర్పవలయునని యందఱు ననేకవిధములఁ బ్రార్థించెను. రాష్ట్రీయసభలో శాస నోల్లంఘనమునుగూర్చిన తీర్మానము చర్చకువచ్చెను. శాస నోల్లంఘనమునకు దేశము తగియుండలేదనియు, దారుణ్యము సంభవింపగలదనియు, నందుచే కాంగ్రెసువారు ప్రత్యేకముగ ననుజ్ఞ యొసగువఱకును వేఁచియుండవలయుననియు దేశభక్త వెంకటప్పయ్య పంతులుగారును శ్రీయుతులగు ప్రకాశం, నాగేశ్వరరావు, పట్టాభిసీతారామయ్యగారలు వాదింప జొచ్చిరి. వారి వాదమునకు దోడుగా గాంధిమహాత్మ డప్పటికి స్వదేశీ వస్త్రధారణము విషయమునను, స్వదేశవస్త్ర నిర్మాణ విషయమునను ఎక్కు డశ్రద్ధ జూపవలయుననియు శాసనోల్లంఘనము కొంతకాలమువరకు ఆపివేయుట మంచి దనియు పత్రికలలో వ్రాసినది యీనాఁడే ప్రకటింపఁబడెను. మహాత్మని వాక్యముల నాధారముఁ జేసికొని శాసనోల్లం ఘనము వలదనువారు సభికుల మనములఁ దమ వాదమునకుఁ ద్రిప్పకొనఁజూచిరి. గోపాలకృష్ణుఁడు కతిపయ మిత్రులతోఁ గూడ శాసనోల్లంఘనము కావలయుననియు మహాత్మని వాక్యము లర్థవాదమేగాని విధి నిషేధప్రాయముగాదనియు 'సత్యంవద' యని యర్థవాదముగాఁ జెప్పినచో సత్యము

ముఖ్యముగా నచింపవలయుననియే యర్థమగునుగాని యొక్క సత్యమును మాత్రముపాటించితదితరములగుసర్వధర్మములను పరిత్యజింపవలసినట్లుగా నర్థము చెప్పదగదనియు, నందుచే స్వదేశవస్తునిర్మాణవిషయమున నెక్కుడు శ్రద్ధనహింపదగ దనియేగాని, తదితరములగు సర్వధర్మములను పరిత్యజింప వలయునని మహాత్ముని యభిప్రాయము గాదనియు, యవసర మగుచోట్ల నెల్ల శాసనోల్లంఘనమున కనుజ్ఞ యొసఁగదగునని వాదించి, చీరాల పేరాల గ్రామములను పలనాడును నుదా హరణముగా సూచించెను. సర్కారువారు విచ్చలవిడిగ బ్రయోగించుచుండిన క్రిమినల్ ప్రొసీజరు కోడులోని 107, 108,144 వ శెక్షనులను తదితరములగు నిర్బంధపు టుత్తరువు లను దిరస్కరించు విషయముగూడఁ జాలనవసరమని గోపాల కృష్ణుడు వాదింపఁజొచ్చెను. ఉభయ పక్షములవారికిని గొంత వడి దీర్ఘవాదము జరిగినపిమ్మట శ్రీయుత ప్రకాశముగారు గోపాలకృష్ణుని బ్రతిమాలి యతనిచేతను అతని పక్షమువారి చేతను ఒక్క నెలవరకును శాసనోల్లంఘనము గావింపకుండు నట్లుగా నంగీకరింపఁజేసిరి. ఎట్టకేల కెట్టులో సమాధానము కుదిరెను. కాని గోపాలకృష్ణుని మనస్సున కా సమాధానము తృప్తి గల్గింపదయ్యెను. అయినను బెద్దల మనస్సులకు నొప్పి గల్గింపకుండుటకయి సమాధానముల కంగీకరించి యెల్లరకును దన సత్స్వభావమును బ్రకటింపగల్గెను. కరాచీ ఖిలాఫత్ సభలో మహమ్మదీయులు ప్రభుత్వమువారి సైన్యములో బనిసేయుట తమ మతగ్రంథమగు ఖొరాను ఆదేశములకు విరు ద్ధముగాన మహమ్మదీయులు ప్రభుత్వమువారి సైన్యములోని

యుద్యోగములను మానుకొన వలయునను తీర్మానము నామో
దింపఁ జేసినందులకయి మౌలానా మహమ్మదాలీ, మౌలానా
షౌకతాలీ, డాక్టరు కిచ్లూ, పీరుగులాము, ముజాజీదు,
మౌల్వీనిసారహమద్, జగద్గురు శ్రీ శంకరాచార్యులు
గార్లను ప్రభుత్వమువారు నిర్బంధించి కరాచీపురమున విచా
రించు చుండిరి. తదనంతరము సర్కారువారి కఠినచర్య కాగ్ర
హముజెంది దేశమున నెల్లెడల సభలు గావింపఁబడి వానిలో
నెల్ల మైనఁ బేర్కొనఁబడిన మహనీయులు ఏ తీర్మానము
నామోదింపఁజేసినందులకయి నిర్బంధింపఁబడిరో యా తీర్మా
నమే ఘంటాపథముగా నిర్భయముగా నామోదింపఁబడెను.
ప్రభుత్వమువారు భారతీయుల దేశభక్తిని, మనస్థైర్యమునకును,
నిర్భయత్వమునకు వెఱఁగందఁ జొచ్చిరి. ఆ యేడు జరిగిన
ఆంధ్రరాష్ట్రీయ సభలో గోపాలకృష్ణుడు మొదలగువా
రెల్లరును బిన్నలును పెద్దలును నేకగ్రీవమున కరాచీ తీర్మాన
మని పేర్కొందిన యా తీర్మానము నామోదించిరి. భారతీ
యులవలెనే స్వాతంత్ర్యమునకయి ఘోరసంగ్రామము
గావించుచుండిన ఐర్లండు, ఈజిప్టు, కొరియా దేశముల ప్రజ
లను వారినాయకులగు డివెలరా, జగ్లూల్, పాపా, మొద
లగువారలను నభినందించుచు గావింపబడిన తీర్మానము
నామోదింపఁజేసినవారిలో మనగోపాల కృష్ణుడు ప్రముఖుడు.
దేశమున శాంతి సైన్యము నేర్పఱుపవలెనను తీర్మానము
నామోదించుచు గోపాలకృష్ణుడు శ్రీరామచంద్రు డాంధ్ర
డనియు గోదావరీమండల వాస్తవ్యుడనియు, భద్రాచల గ్రామ

కాపురస్తుడును, భద్రాచలగ్రామములోని కాంగ్రెసుకమిటీ ప్రెసిడెంటును (కాంగ్రెసు సంఘాధ్యక్షుడు) నగుటచే నాంధ్ర మండలమునకు రామదండు ముఖ్యముగా నుండవలెననియు కిశోరచంద్రుని భజించు ముసల్మానులు కిశోరచంద్ర శేఖరుడగు శివునకు బరమ భక్తులగుదురనియు, నందుచే ముసల్మానులు శైవులనదగుననియు, కొరానులో శివునకు మూలానా శంకర్లీయనునామాంతరము కలదనియు, పశ్చిమోత్తర పర్వతాలలోని తురష్కవీరులతనిని శంకర్ఖాననికూడ పిలుతురనియు పల్కుచు హాస్యరసభరితమగు నుపన్యాసమొసగి సభ్యుల నెల్లరను పొట్టచెక్కలగునట్లు నవ్వించెను.

ఆంధ్రరాష్ట్రీయసభలోగూడ గోపాలకృష్ణుడు తన చీరాల పేరాల మ్యూనిసిపాలిటీ విషయమునుగూర్చి యుపన్యసించి వారిదుర్భరకష్టములవర్ణించి సభ్యులలోకరుణారసమును, వారి సాహసమును, దీక్షను వర్ణించి యద్భుతమును, చీరాల పేరాల గ్రామములలో తాము గావించిన చమత్కారవిషయముల వర్ణించి హాస్యరసమును, సర్కారువారు గావించు చుండిన యన్యాయమును చూపుచుండిన కాఠిన్యమును వర్ణించి జుగుప్సాక్రోధరసములను నుప్పొంగజేసెను. చీరాల రెయొక్కయు, మంత్రియగు రామారాయనిరెయొక్కయు చరిత్ర మేడురాత్రుల కధయగునని గోపాలకృష్ణుడుపల్కగనే జనులెల్లరును పొట్టచెక్కలుగ నవ్వసాగిరి. చీరాలయం దెనుబదేండ్లముసలిది దేశమునకై కారాగారమునకు జనినవిధము గోపాలకృష్ణుడెఱింగింపగనే సభికులత్యాశ్చర్యము జెందజొచ్చిరి. సభముగిసిన మరునాడు 27 వ తేదీని గోపాలకృష్ణుడు చీరాల

సహాయార్థమై యింకొక యుపన్యాసము నొసగెను. ఆ నాటి సభకు వేలకొలదిజనులువచ్చిరి. గోపాలకృష్ణుడు నవరస స్ఫూర్తియగునట్లుపన్యసించి సభ్యులమనముల నొక్కమా ఱుగ ద్రిప్పుకొనగల్గెను. ఈ యుపన్యాసమున హాస్యరసమెక్కు డుగ బ్రదర్శింపబడెను. గోపాలకృష్ణుడుపన్యాసమును-

శ్లో॥ బ్రహ్మన్నధ్యయనస్యనైషసమయంతూష్ణింబహ స్తీయతాం
స్వల్పం జల్పబృహస్పతే జడమతేనైపాసభావ ర్జిణః
స్తోత్రం సంహరనారదస్తుతికథాలాపైరలంతుంబురో॥
సీతారల్లకహల్ల భగ్న హృదయఃస్వస్థోనలంకేశ్వరః॥

అనుశ్లోకముతో ప్రారంభించి రావణుడు తనకస్వస్థత కల్గినకతమున బ్రహ్మదేవు నాధ్యయనముమాని బయట నుండుమనుటయు "దేవేంద్రుని సభగాదిది యూరకప్రేలకు" మని బృహస్పతి నధిక్షేపించుటయు, నారదుని స్తోత్రగానముప సంహరింపు మనుటయు, తుంబురుని రాగాలాపన మాపుమను టయు, ప్రస్తుతము శాసనసభలయందుమను, సర్కారుకచేరీల లోను విద్యాలయములయందును నాంగ్లేయులు భారతీయుల దృణీకరించుటతో బోల్చి చెప్పుసరికి సభ్యులకాశ్చర్య మొదవెను. వెనుకటి కొకయాంధ్రుడొక తమిళసోదరునికి తన గడమజూపి యిదేమని యతని నడుగనతడు వెంటనే 'నారదా' (నారయే) యనిపలికినట. యనుచు గోపాలకృష్ణుడు 'నారద' శబ్దముపైశ్లేషగల్పించి యుపన్యసింపగనే సభ్యులు హాస్యరసభరిత హృదయులైరి. సభ్యులెల్లరు నుపన్యాసమును వినియానందభరితులై చీరాల పేరాల సహాయనిధికవ్వారిగ

ధనమొసగిరి. జనులెల్లరకును గోపాలకృష్ణుడు ప్రియతము డయ్యెను. మరునాడుకూడ గోపాలకృష్ణుడు చీరాలనుగూర్చి యుపన్యసించునని ప్రకటింపబడెను.

28 వ సెప్టెంబరు తేదిని సాయంత్రము నాలుగుగంటల వేళమన్నిత్రులగు గురజాడ కృష్ణమూర్తి పంతులుగారియింట నుండి నేను గోపాలకృష్ణుడును కతిపయమిత్రులతోగూడ సభ కేగ నుద్యుక్తులమై చననెంచుచున్నంతలో నొకపోలీసు బంట్రోతు గోపాలకృష్ణుని చేతికొక నోటీసు నందించెను. నిర్బంధపు (అరస్టు) టుత్తరవేమోయనుకొంటిమి. కాని యందు గోపాలకృష్ణుడు రాజద్రోహపూరితములగు నుపన్యాసముల నిచ్చుచుంటచే శాంతికి భంగమొదవగలదనుకారణముచే గంజాం మండలాధికారియగు టీ. జీ. రూథర్ ఫర్డుగారు (ఇప్పుడు సర్-బెంగాల్ గవర్నరు) క్రిమినల్ ప్రోసీజరుకోడులోని 143 వ సెక్షను నియమముక్రింద గోపాల కృష్ణుడు బరంపురమున రెండుమాసములవరకు నుపన్యాసము లీయగూడదని శాసించిరి. గోపాలకృష్ణు డాకాగితము అరెష్టు వారంటు కానందుకు కొంచె ముత్సాహము తగ్గినవాడయ్యె చిఱునగవుతో నుత్తరవును గైకొని పోలీసు జవాను నంపివైచెను. ఇంతలో గోపాలకృష్ణుని పట్టుకొనిరను వార్త పురమున నెల్లెడ వ్యాపించుటచే డాక్టరు పట్టాభిసీతారామయ్య టంగుటూరి ప్రకాశంపంతులుగార్లు మొదలగువారల్లరు నపు డెంచి గోపాలకృష్ణునిత్రో నాజ్ఞాతిరస్కారముగావింప వలదని ప్రార్థించిరి. శ్రీయుత ప్రకాశంపంతులుగారతనిని తమబండిలో నెక్కించుకొని పురమున నటు నిటు త్రిప్పుచు నతని

తనమును శాసనోల్లంఘనమునుండి త్రిప్పజూచిరి. కాని గోపాలకృష్ణుడు తనలో తాను పూర్వాపర సందర్భముల విచారించుకొనుటకవకాశ మొసగుడని కోరగా ప్రకాశము పంతులుగారతనిని గురజాడవారియింటి కెదురుగానున్న మ్యూనిసిపల్ పార్కులోవదలి వెడలిరి. గోపాలకృష్ణుడు సుమారు రెండుగంటలకాలము బాగుగ యోజించి యుద్రేక పూరితుడై నాకడకువచ్చి నన్నుజూచి **"My god ! I cannot stand this order"** (స్వామిద్రోహము, నేనీయు త్తరువును సహింప జాలను, ఈ కలెక్టరు నన్ను నోరుమూసుకొమ్మని యుత్తరు విచ్చనే. అట్లెన్నటికిని జరుగనేరదని పల్కెను. అంతనేనతని యుద్రేకమును మనోనిశ్చయమును గ్రహించి "నిశ్చయించు కొంటిరా ! చీరాలసంగతి ఏమిచేసి పోవుదు ? తనియడిగితిని. తొడనే ధీరుడగు గోపాలకృష్ణుడు మోమున దివ్యకాంతులు మెలమెలలాడుచు మెరయగా నాతో "ఓయీ, పిచ్చివాడా భయపడనేల ? చీరాలను రాముడే కాపాడగలడు. పరవా లేదు. నేను శాసనోల్లంఘనము గావించి శ్రీకృష్ణ జన్మస్థాన మగు చెరసాలకేగెదను. చీరాలలోని జనులకనేక కష్టముల గల్పించి, వారిచే దేశత్యాగము గావింపజేసి, వారిలో స్త్రీలతోసహా యనేకులను చెరసాలకంపి నేను పితికితనముచే చెరసాలకు భయపడి నోరుమూసికొని యీ కలెక్టరు గావిం చిన యాజ్ఞను మన్నింతునే ? చీరాలకొరకై నేను సంజీవి యాచించుచుండ కలెక్టరు నన్ను నోరుమూసుకొమ్మనెను. నేను నోరుమూసుకొన్నచో చీరాలకు ద్రోహము గావించినవాడను కానా ? రాముడే సర్వమును చక్కజేయగలడు. భయము

లేదనిపల్కి తన మనోనిశ్చయమును మిత్రులెల్లర కెరిగించిరి. ఎల్లరును హర్షించిరి. గోపాలకృష్ణుడారాత్రియెల్ల నాందోళిత మనస్కుడై కడపెను.

మరునాడుదయమున ప్రకాశము పంతులుగారు మా కడకువచ్చి గోపాలకృష్ణునిజూచి "ఏమి నిశ్చయించితి"రని యడుగ వెంటనే యతడు నిర్భయముగ "శాసనోల్లంఘనము కావించుటకే"నని మారుపల్కెను. అంత ప్రకాశముపంతులు గారు గోపాలకృష్ణునితో "మీరు శాసనోల్లంఘనము కావింపదలచినచో కలెక్టరునకు ముందుగా తెలియజేయుట న్యాయ"మని పలుక నతడట్లులే చేతుననిపల్కి కలెక్టరునకు తంతివార్తను, జాబును నీక్రిందివిధమున వ్రాసిపంపెను.

"To

T. G. Rutherford Esq,
Collector, Ganjam.

From Ramadas Duggairala Gopalakrishnayya will. address in due Disobedience of your order Dated 28th inst in a meeting this evening .Please take notice."

శ్రీమద్రమారమణ గోవిందోహరిః

"గంజాంజిల్లా మేజస్ట్రేటుగారగు టి. జీ. రూధర్‌పరు గారికి. రామదాసు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య యనేకాశీర్వ్ చనములు. మీరు 28వ తేదీన నాకంపిన శ్రీముఖమును సంతోషమున గైకొంటిని. అందలి మీ కోర్కెను నెరవేర్ప బ్రయత్నించితిని గాని యనుల్లంఘ్యముగు శ్రీరామాజ్ఞ యగుటచే యట్లు తమకోర్కెను చెల్లింపజాలనైతిని.

శ్రీరామాజ్ఞానువర్తినై నేటిసాయంత్రము శ్రీరామచంద్రునిప్రత్యక్షస్వరూపమనదగు నాంధ్రమహాజన సమక్షమున నుపన్యసింప నెంచితినని మీకు దెలియజేయుచున్నాను. ఈ యుత్తరమ చ్చొత్తింపబడి బరంపురమున పంచిపెట్టబడెను. ఆ సాయం త్రమే సభ జరుగనుండెను.

భోజనానంతరము మేమందరమును గూర్చుని సంగతి సందర్భముల ముచ్చటించుకొన సాగితిమి. గోపాలకృష్ణుడు ఆంధ్ర మహాజనుల కొకటియు, చీరాల పేరుల కొకటియు సందేశములబంపెను. వానిని క్రింద వివరించెదను.

శ్రీమద్రమారమణ గోవిందోహరిః
ఆంధ్ర మహాజనులారా, పరాకు!

రామదాసు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య అనేక గాఢాలింగనములు గావించి విన్నవించుకొనున దేమనగా నేను చీరాల పేరాల ధీరుల సహాయార్థము సంజీవి యాచింప నీబ్రహ్మపురమునకు వచ్చియున్నాను. ఇచ్చట జిల్లా మేజ స్ట్రేటగు టి. జి. రూథర్‌ఫర్డుగారు 144 వ సెక్షన్ప్రకారము నాకు వాగ్బంధనము విధించిరి. అందుల కియ్యకొనుట సత్వర స్వరాజ్యలబ్ధికి ప్రతిబంధకమనియు, ఆంధ్ర యశశ్చంద్రునకు కళంక మాపాదించుననియు, చీరాల పేరాల మహాయజ్ఞమునకు భంగకరమనియు, తదుల్లంఘనము దేశీయ మహాసభా శాసనానుసారము గాకపోయినను తదాదర్శములకు బ్రధాన పోషకమనియు, నవశ్యకర్తవ్యమనియు, వీరపురుషోచితమనియు, రామాజ్ఞ యైనందున నయ్యది శిరసావహించి బ్రహ్మపురము నుండి శ్రీకృష్ణ జన్మస్థానమున కేగుచున్నాను.

ఇంతవరకు భవదీయ సేవాపరాయణుడనై ధన్యుడనైతిని. ఇకముందు శ్రీరామ రాజ్యస్థాపన యెన్నడు జరుగును? తిరిగి తమ సేవ యెన్నడు లభించును? అని నిరంతరము ఆ పురుషోత్తముని చరణకమలములు భజించుచుండెదను. శ్రీ గాంధీ గురూత్తముని చరణారవిందములు హృత్పీఠమున ధరించి సంతత స్వరాజ్యమంత్రజపమున కాలము గడపుచుండెదను. అన్మహామహుని యాదేశమును అప్రతిహతముగ నిష్కలంకముగ, నిశ్చల మనస్కులై కొనసాగించెదరు గాకయని మీకు సాష్టాంగ ప్రణామ పురస్సరముగ విన్నవించుకొనుచున్నాను. ఆంధ్రనాయకులందరును సత్వర స్వరాజ్యసిద్ధికై ఆత్మసమర్పణము చేయవలసిన సమయము వచ్చినది. "మనము పోయిన ముప్పు వాటిల్లును. ఉద్యమము భంగపడును," అని సంశయింపకుడు. శ్రీరామచంద్రుడే మన నాయకోత్తముడు. నిరంతరము ఈమహోద్యమమును కనిపెట్టి యున్నాడు. ఒకొక్కరు కారాగృహము ప్రవేశించినవారి స్థానమున నూఱుమంది శ్రీరామ కింకరులు బయలుదేఱి వలెను. కారాగృహయాత్ర సహాయ నిరాకరణవాదులకు నిత్యకృత్యము. శాసనోల్లంఘనముకూడదనియు, అయ్యది స్వదేశోద్యమము నాటంకపఱచుననియు దలంచుటభ్రమ. శాసనోల్లంఘనముగావించి ఆంధ్రవీరులు కారాగృహమునకేగిన కొలది స్వదేశోద్యమము తప్పక వేయిమడుంగు లభివృద్ధిజెందగలదు. ఇది నిస్సంశయము. ఆంధ్రసాంప్రదాయసిద్ధమగు రామదండును యావదాంధ్రమండలముల సమస్తగ్రామముల వెంటనే నెలకొల్పి రామసైన్యమే శాంతిసైన్యమగుటంజేసి శాంతి

మార్గమున శ్రీరామచంద్రుని కరుణాకటాక్ష వీక్షణములచే రామకార్యమగు స్వరాజ్య సంస్థాపనము నచిరకాలమున సాధించెదయగాక.

మీ ముద్దుసోదరులు చీరాల పేరాలవాసుల భావిస్థితి శ్రీరామచంద్రుని ప్రత్యక్షస్వరూపులగు నాంధ్రమహాజనుల కప్పగించితినను ధైర్యమున నిర్విచారముగ నేగుచున్నాను. మా చీరాల పేరాలను వేవిధముల కనిపెట్టియుందురుగాక యని ప్రార్థించుచున్నాను. శీఘ్రముగ స్వరాజ్యలక్ష్మి కళ్యాణ మాంధ్రధీరులకు చేకూరునుగాక.

స్వస్తిప్రజాభ్యః పరిపాలయంతాం
న్యాయేన మార్గేణ మహీంమహీశాః
గోబ్రాహ్మణేభ్యః శుభమస్తునిత్యం
లోకాస్సమస్తా స్సుఖినోభవంతు.

దుగ్గిరాల గోపాలకృష్ణయ్య.

2. శ్రీమద్రమారమణగోవిందోహరిః

చీరాలపేరాల గ్రామ మహాజనమునకు రామదాసు 'దుగ్గిరాల గోపాలకృష్ణయ్య యనేకగాథాలింగనములుగావించి వ్రాయునదేమనగా, మనకు సంజీవియాచింప నాంధ్రదేశసంచారముగావించుచు బ్రహ్మపురము వచ్చియుంటిని. ఇచ్చట జిల్లా మేజస్ట్రేటగు టి. జే. రూథర్ ఫర్డుగారు 144 శకను ప్రకారము నాకు వాగ్బంధనము విధించిరి. అందులకియ్యకొనుట సత్వర స్వరాజ్యలబ్ధి ప్రతిబంధకమనియు, ఆంధ్ర యశశ్చంద్రునకు

కళంక మాపాదించుననియు మనముగావించుచున్న మహా యజ్ఞమునకు భంగకరమనియు, తదుల్లంఘనము దోషీయ మహాసభానుసారము గాకపోయినను తదార్యులకు ప్రధాన పోషకమనియు, వీరపురుషోచితమనియు, రామాజ్ఞయైనందున నయ్యది శిరసావహించి బ్రహ్మపురమునుండి శ్రీకృష్ణ జన్మ స్థానమున కేగుచున్నాను.

ఇంతవరకు భవదీయసేవా పరాయణుండనై ధన్యుండ నైతిని. ఇకముందు శ్రీరామరాజ్యస్థాపన యెన్నడు జరుగును? తిరిగి తమసేవ యెన్నడు లభించునని నిరంతరము ఆ పురుషో త్తముని చరణకమలముల భజించుచుండెదను. శ్రీ గాంధీ గురూత్తముని చరణారవిందములు హృత్పీఠమునధరించి సంతత స్వారాజ్య మంత్రజపమునకాలము గడుపుచుండెదను. అమ్మహామహుని యాదేశము నప్రతిహతముగ, నిర్వాద ముగ, నిష్కలంకముగ, నిశ్చల మనస్కులై కొనసాగించె దను గాకయని మీకు సాష్టాంగప్రణామపురస్సరముగా విన్న వించుకొనుచున్నాను. మనకిప్పుడు ప్రతిపక్షులుగ కనుపించు చున్న, ప్రభుత్వమువారు స్వారాజ్యవ్రతదీక్షను పరీక్షింప నే తెంచిన ధర్మదేవత; యోయన భావించి వారియెడ నణు మాత్రమును ద్వేషభావమూనక శ్రీమద్భాగవతమునందు గజేంద్రుని మార్గము అనగా.

పాదద్వందము నేలమోపి పవనుక్ బంధించిపంచేం ద్రియో న్మాదంబుంబరిమార్చి బుద్ధిలతకున్ మాఱాకు హత్తించి ని ష్ఖేద బ్రహ్మపదావలంబనగతిన్ క్రీడించుయోగీంద్రుమరా

పాటించి నిష్కామకృతిని శాంత చిత్తులకై మన మహోద్యమమును కొనసాగింతురుగాక. మనయుద్యమోద్యోగ పన సమాపించు శుభసూచనలు కాన్పించుచున్నవి. అందు ప్రధానమైనది నాకు లభ్యమైన వాగ్బంధనవిధియే. సత్వరముగ మనకు విజయముచేకూరనున్నది. కావున నీ సమయమున మన వ్రతమునందు శ్రీహరిశ్చంద్రుని పుత్రవియోగ కళత్ర సంహారాది సమయమునుబోలిన పుష్కరసమయముగా భావింపవలయును. ఇప్పుడే కదుంగడు జాగరూకత్రోో సంచరింపవలెననియు, నణుమాత్ర మనుమానించిన వ్రతహానియు, కీర్తిహానియు, స్వరాజ్యోద్యమ ధ్వంసమును పరిణమించి యధోగతిపాలై యీ చంద్రార్కము అవాచ్యమగు దుఃఖపరంపర ననుభవింపవలసి వచ్చుననియు స్పష్టముగా నెరుంగునది. అప్పుడే ప్రభుత్వ మంత్రివర్గము గావించు మాయోపాయములలో ప్రధానమైనది "మీ దేశత్యాగమునుపీడి గ్రామములలోనికి వచ్చినచో మీ మ్యునిసిపాలిటీ రద్దుజేసెదము. లేవల్లె మ్యునిసిపాలిటీని రద్దుజేయుట ఆ ప్రజలు గ్రామమును విసర్జింపకుండు కారణమునన్నే" అని హెచ్చరికలు తమ చారులచేత తీవ్రముగా వ్యాప్తి జేయుటయే. దీనివలన నే మాత్రమును మోసపోకుడని పదేపదే హెచ్చరించుచున్నాను. మహాపతివ్రతాను తల్లియగు సావిత్రీ దేవి చరిత్రను గమనింపుడు. భర్తప్రాణముల నిమిత్తము యమధర్మరాజుత్రోో నసహాయోద్యమమార్గమున లంబించి వెంబడించినపుడు ప్రథమమున లభించువరము తన యత్తమామల నేత్రప్రదానము, పిమ్మట తల్లిదండ్రుల రాజ్య

ప్రాప్తి ఆఖరునగాని తన భర్తప్రాణము లభింపలేదు. అటు వలెనే మన యుద్యమముగూడ మన ప్రయత్నాను బంధమగు రేపల్లె వ్యవహారము ప్రథమమున జయముగాంచుటయు, పిమ్మట నింకెన్నియో వాంఛితములుగూడ సిద్ధించుటయు మనవ్యవహారము కేవలము కుటుంబకలహాముగ ప్రారంభమై కురుక్షేత్ర సంగ్రామముగ బరిణమించుటజూడ స్వారాజ్య ప్రాప్తి గూడ ముందుగలుగుటయు ననంతరమే మనమ్యూనిసిపాలిటీ రద్దగుటయు సంభవించునని మీరు గ్రహింతురుగాక. చిత్తము శ్రీరామపాదములందు జేర్చి, నిరంతరదీక్షా పరతంత్రులై, ఆంధ్ర మహాజనులయొక్కయు, యీ వదాన్యభరతసంతానముయొక్కయు ప్రతిజ్ఞ నిర్వహించిరను భాగ్యము సర్వేశ్వరుడు మీకు ప్రసాదించుగాకయని నిరంతరము ప్రార్థించుచున్నాను. వ్యవహార సందర్భమున కొందరియెడ కాఠిన్యమును కొందరియెడ దాక్షిణ్యమును వహించి వర్తించితిని. ఇంకను నాకు మనోగతములు కాని లోపము లనేకములు గావించియుండి యుందును. చీరాల పేరాల వాసులాబాల గోపాలము నన్ను మన్నింతురుగాక. మీ చరణ కమలముల కిదియే ప్రణామము. తిరిగి యనేక గాఢాలింగనములు. నేను కారాగృహమందున్నను తమ సమక్షమున నున్నటులనే భావించి సర్వ కార్యములు జయప్రదముగ నిర్వహించెదరుగాక. ఆంధ్ర మహాజనులు అఖిల భారతీయులు గాంధీమహాత్ముడు, శ్రీరామచంద్రుడు, సర్వదామిమ్ముగాపాడుగాక.

న్యస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం
న్యాయేన మార్గేణ మహీంమహీశాః

గోబ్రాహ్మణేభ్య శుభమస్తు నిత్యం
లోకాస్సమస్తాస్సుఖినోభవంతు.

దుగ్గిరాల గోపాలకృష్ణయ్య.

ఇట్లు తనకు ప్రేమపాత్రులయిన యాంధ్రమహాజనుల కును, చీరాల పేరాల పౌరులకును, సందేశములనంపి గోపాల కృష్ణుడు శాసనోల్లంఘనము గావించి కారాగృహమున కేగ సంసిద్ధుడగుచుండెను. ఏ చింతయులేక ఎప్పటట్టులనే స్నాన పానానుష్ఠానాదులగావించుకొని భుజించి నిద్దురవోయి నాల్గు గంటలకు మున్నే లేచి శుద్ధ స్వదేశ వస్త్రాలంకృతుడై, శిరో వేష్టనమును రుద్రాక్షమాలికను, కుంకుమ తిలకమును ధరించి స్వరాజ్యయాత్రకై కారాగృహమున కేగదలచిన వాడ గుటచే తనకుముందు కావలసినవస్త్రములను, పుస్తకములను మొదలగువానిని గల్గినసంచిని మెడనుదాల్చి, పాదరక్షల దొడిగి దండధారియై సభాస్థలికిజన పయనమయ్యెను. అప్పుడు బరంపురమునందలి ఛాయా పటగ్రాహి (ఫొటోగ్రాఫర్) అతని చాయాపటమును దీసెను. అంతట నతడు సభాస్థలికేగియచట నుచితాసనమునధివసించి సభాసదుల నెల్లరను నిజమందహా సాంచిత వదనరోచులచే రంజింపజొచ్చెను. ఎల్లరు నతని నిర్భ యత్వమును, మనో నిశ్చయమును, దేశాభిమానమును, త్యాగశీలమును వేనోళ్ళగొనియాడ జొచ్చిరి. గోపాల కృష్ణునకు పూర్వము శ్రీయుత చెఱుకువాడ వేంకట నరసింహముగా రుపన్యసించి యతని గుణగణములను స్వార్థ త్యాగమును దేశానురక్తిని బ్రశంసించిరి. మిత్రు లనేకులు గోపాలకృష్ణుని ప్రశంసించిరి. శ్రీరాముని హనుమంతుడు

బంటుగను స్నేహితుడుగను ననుసరించినరీతి గోపాలకృష్ణుని బంటుగను శిష్యుడుగను మిత్రుడుగను ననుసరించి వచ్చుచుండిన గౌజుబేగ్ సాహెబుగారుకూడ నానాడుపన్యసించి గోపాలకృష్ణునిపై తమకుగల భక్తినియశ్రు జలపూరిత నయనములతో వెల్లడిగావించిరి. అంతకుమున్నే సభాస్థలి నుపన్యసించుచుండగా చెరుకువాడ వేంకట నరసింహంగారిపై 144వ సెక్షన్ ప్రకారము నోటీసు అందింపబడెను. కాని యందు వారిపేరు తప్పువడి యుండుటచే వారు దాని నంగీకరింపక త్రిప్పివైచిరి. ఆనాడే గంజాంజిల్లా చివరనున్న శ్రీకాకుళము స్టేషనుకడ 27వ తేదీరాత్రి పట్టుకొనబడి జిల్లాకలక్టరుచే 28వతేదిని రాజద్రోహ పూరితములగు నుపన్యాసముల నిచ్చినందులకై విచారింపబడి 108వ సెక్షన్ ప్రకారము జామీనీయ నిరాకరించినందులకై యొక సంవత్సరము సామాన్య నిర్బంధము (విడిఖైదు) విధింపబడిన శ్రీయుత గంపలగూడెం కుమారరాజాగారు బరంపుర మునకు గొనిరాబడి కారాగృహప్రవేశము గాంచిరి. ఆనాడే యుత్కళ నాయకాగ్రణియగు దేశభక్త గోపబంధుదాసు గారిపై వాగ్బంధనము విధింపబడెను. నిర్బంధవిధానము చెలరేగునట్లుండెను. పోలీసువారు బలవంతముగా సభను జెదరగొట్టుదురేమోయను భయముగూడ వ్యాపింపజొచ్చెను. జనులుద్రేకపూరితులై యుత్కంఠిత హృదయులై గోపాల కృష్ణుని వాగామృతమును గ్రోలుట కువ్విళ్ళులూరుచుండిరి. గోపాలకృష్ణు డుపన్యసించుటకై లేచి సభాసదులకెల్లరకును హృదయపూర్వకముగ నమస్కరించి నిలువబడగనే సభ్యుల హృదయములు కఱగిపోయెను. స్త్రీలు బాష్పాకులిత లోచ

నలై వగవజొచ్చిరి. పురుషులింతటిపురుషసింహమున కెట్టికూర నిర్బంధము ప్రాప్తింపనున్నదోయని యాందోళన నొందసాగిరి. విద్యార్థులునాయకోత్తము డితడేయనిపొగడియానందింపదొడగిరి. మిత్రులు హృదయానందజనకుడగు మిత్రసత్తముడేగనున్నాడుగదాయనిలోలోనవిచారింపజొచ్చిరి. నేనుమాత్రము గోపాలకృష్ణుడు కీర్తికాముడై, నిర్భీతచేతస్కుడై, కీర్తిసదనమున కేగుచున్నాడుగదాయని లోలోన సంతసించుచుంటిని. సభికులలో నొకరు లేచి గోపాలకృష్ణుని పుష్పమాలాలంకృతుని జేసినతోడనే సభాంతరాళమున "శ్రీమద్రమారమణ గోవిందోహరిః వందేమాతరమ్, ఆంధ్రరత్నగోపాలకృష్ణునికి జయ్"అను విజయమంగళతూర్యనినాదములు దిక్కులు పిక్కటిల్ల, భూనభోంతరాళములు కంపింప, ప్రభుత్వాధికాకుల హృదయములడల, సభికుల హృదయములు ముదమంద ప్రబలిప్రతిధ్వనింపసాగెను. నోరవిప్పగనే గోపాలకృష్ణుని పట్టుకొందురని యందరును తలపసాగిరి. గోపాలకృష్ణుడు సింహనాదముతో, మేఘ గంభీరరవముతో 'మసాజనుటూరా' యని యుద్ఘోషించి, శంఖమునూరించి యొక్కింతతాళిపిమ్మట యోగముద్రాముకుళితనయన సరోజుడై ముక్తకంఠముతో సహజ గంభీరోచ్ఛ్వాసనముతో.

శ్లో॥ లోకానాహూయ సర్వాక్ డమరుకని నదైర్భోర సంసారమగ్నాన్
దత్వాఽభీతిందయాళుః ప్రణతభయహరంకుంచితం పాదపద్మం
ఊధృత్యేదం విముక్తేరయనమితికదాద్దర్శయన్ ప్రత్యయార్ధం
బిభ్రద్వహ్నింసభాయాంకలయతి నటనం యస్సపాయాన్నటేశః॥

అను శ్లోకమున ప్రళయకాలరుద్రుడై ప్రళయతాండవము సల్పినటరాజమూర్తిని ధ్యానించెను. ఘోరసంసార సాగర నిమగ్నములైయున్న లోకములనెల్ల డమరుక నినాదముచే నాహ్వానమును జేసి (ఉద్బవిల్ల జేసియని భావార్థము) దయామయుడై యభయమొసగి, ప్రణతులగు భక్తుల భయమును హరింపగల తనపాదపద్మమును కొంచెముగ కుందించి పైకెత్తి, యియ్యదియే మోక్షస్థానమని చేతితో జూపించుచు, నిదర్శనపూర్వకముగఫాలనేత్రమునుండి యగ్నిజ్వాల లెగయించుచు, నీ మహావిశ్వమను నాటకరంగమున నాట్యము సల్పుచుండిన యానటరాజదేవుడే మిమ్మునెల్లర రక్షించునుగాక" యనునాందీవాక్యముతో వీర, క్రోధ, భయానక రసోపేతమగు నాటకమును గోపాలకృష్ణుడానాడు ప్రారంభించెను. ప్రపంచమున పాపముమిక్కుటమైపోయిన కతమునను, ధర్మము నశించినకారణమునను, యుగాంతముప్రాప్తింపనలసి యుంటచేతను, లయకాలము సమీపించెననియు, ప్రళయ కాలరుద్రుడగు నటరాజు మహావిశ్వనాటకరంగస్థలిని నాట్యము సల్పతరుణమయ్యెననియు, నతడు సభికులకు జ్ఞానేత్ర గోచరము గావించెను. భారతభూమి తొల్లిటికాలమున కర్మభూమియై, కామధేనువై, కల్పతరువై, సుజనావాసమై యొప్పుచుండెను. అట్టిభారతవర్షము నేడధర్మమునకు దావలమై ఘోరపాపులకు నివాసమై ప్రపంచదుస్థితికి ప్రబల తారాక్షణమై యొప్పుచున్నది. ఇందులకు ప్రధాన కారణము మనదేశమునకు కాలకర్మనశమున ప్రాప్తించిన పారతంత్ర్యమే. పరరాజుల దాడికిలోనై భారతభూమి తన తొల్లింటి ప్రతి

భను, ధర్మమును, సంపదను గోలుపోయి, స్వార్థపరులును, ధర్మవిదూషలును, దౌర్భాగ్యులునగు జనులకు మాతృ భూమియై, భూభారముచే కృశించి వగవజొచ్చినది. మనమహా పాపములును, మనదౌర్భాగ్యమును మహాలయమున నంత మొందదగినకాలము ప్రాప్తించినది. మహాశివుడు ప్రళయ కాలరుద్రుడై తాండవము సల్పుచు మనపాప సంచయము లను, మనదౌర్భాగ్యమునునంతమొందించి పునఃఘోర సంసారమగ్నులమగు మనలనిజడమరుక నినాదముచే నాహూ యము జేయుచున్నాడు. అట్టి ప్రళయ రుద్రుడే నేడు గాంధి మహాత్ముని యవతారమెత్తియున్నాడు. తురుష్కాంగ్లేయ నాగరకతా ప్రభావమునకు వశులై తొల్లింటి యార్యధర్మ పద్ధతిని బరిత్యజించి కర్మవిదూషులై, ధర్మవిదూషులై స్వార్థ పరులై, భోగాసులై, దౌర్భాగ్యులైన భారతీయులను "ధర్మ మును బరిత్యజింపక పునరనుష్ఠింపుడు. భగవంతుని నమ్ముడు. అహింసాసత్య వ్రతముల ననుష్ఠింపుడు. భోగవాంఛల వీడుడు. స్వార్థత్యాగులుకండు. భగవంతుడు మిమ్ము నుగ్రహించి స్వరాజ్యదానమొసగును. మీ పాపపంకిలమును లయముగావించుకొనుసమయ మాసన్నమైనది. రండు, త్యాగము జూపుడు, ధర్మమనుష్ఠింపుడు, సత్యము బలుకుడు, అహింసబూనుడనుచు భారతీయులెల్లరను ఢక్కానినాద ముతో నాహ్వానించుచు నభయమొసగుచున్నాడు. స్వరా జ్యమే కావ్యమునియు, దౌరన్యరహిత సహాయ నిరాకరణమే ప్రధానసాధననియమయు, మహాత్ముడు నిర్దేశించి చూపు చున్నాడు. నిజతపోగ్నిచే శత్రువుల హృదయముల తల్లడిల్ల

జేసి యనుచరుల పాపసంచయమును, స్వార్థపరత్వమును, దౌర్భాగ్యమును దహింపజేయుచు గాంధి నటరాజమూర్తి నేడు భారతరంగప్రదేశమున ప్రళయతాండవము సల్పు చున్నాడు. కావున లయకాలమాసన్నమైనది. మీ పాపపంకిలము నెల్ల బోగొట్టుకొనుడు. మీస్వార్థ పరత్వమును, భోగ వాంఛలను, నైచ్యమును, దుస్థితిని, దౌర్భాగ్యమును యీ మహాలయమున దహింపజేయుడు. ద్వేషము మాని రోషము బూనుడు. క్లైర్యముమాని శౌర్యముబూనుడు. ధర్మ సంస్థాపనమునకు దోడ్పడుడు. నూతనయుగ నిర్మాణమునకు సాయముజేయుడు. భారతభూమిని పునరుద్ధరింపుడు అహింసా వ్రతము ననుష్ఠించి, గాంధిమహాత్ముని యీ దేశమును శిరసా గ్రహించి దౌర్బల్యరహితసహాయ నిరాకరణమవలంబించి దేశమును పారతంత్ర్యమునుండియుద్ధరింపుడు. మాతృభూమి ఋణముదీర్పుడు. గాంధిమహాత్ముడు నిర్దేశించిన విధులను నిర్వర్తించి కోరినత్యాగమును జూపించి ధన్యులుకండు, భగ వంతుడు మిమ్మనుగ్రహించిస్వారాజ్యపట్టభద్రుల జేయునుగాక. స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం న్యాయేన మార్గేణ మహీ మహీశా గోబ్రాహ్మణేభ్యః శుభమస్తునిత్యం లోకా స్సమస్తాస్సుఖినోభవంతు" యని యుపదేశించి చీరాల పేరాల మహా యజ్ఞమును, ప్రస్తుత దేశదైన్యమును కర్తవ్యమును, నిరంకుశాధికారుల చర్యలను, మహాత్ముని ప్రతిజ్ఞా ప్రతిభలను నింక ననేకవిషయములను సోదాహరణములుగను, రస వంతములుగను వర్ణించి బానిసవృత్తికై విద్యార్థులను తయారుజేయుచు హిరణ్యకశ్యపుని కాలమునాటి చండా

మార్కు-లను మరపించు మనప్రస్తుత విద్యాలయోపాధ్యాయులను, న్యాయములేని న్యాయస్థానములకు బోవలదని న్యాయవాదులను, దేశాభ్యుదయమును లోనెంచి దేశారిష్టకమగు బానిసవృత్తులకై యుపయోగపడు విద్యాలయములను తక్షణము విడనాడుడని విద్యార్థులనుద్బోధించి న్యాయమార్గమున పాలించు రాజునకే స్వస్తియనియు, నన్యాయమార్గానువర్తియగు రాజునకు నాస్తియనియు బల్కు యుపన్యాసమును ముగించెను. వెంటనే సభామంటపము తీవ్రోద్రేకపుచలితమయ్యెను. తక్షణమే దేశాభిమానులగు నలుగురుపాధ్యాయులును, నొక న్యాయవాదియు, నొక గుమాస్తాయును, బి, యల్. జదువు నొక విద్యార్థియు తమ తమ పదవుల బరిత్యజింతుమని సభాస్థలిని ఘోర శపథమూనిరి. తన యుపన్యాస మీషదీషద్బలమైనందుకు సంతసించి సభ్యులెల్లరకు వందన మాచరించి స్వరాజ్య సోపానమును, శ్రీకృష్ణ జన్మస్థానమునగు కారాగార యాత్రకు జనుట కెల్ల ఱి యనుజ్ఞ గొని మూట ముల్లె చంకకు దగిలించుకొని "పోదామ భద్రాద్రిరాములసేవింపరారె రమణులారా" యను గీతమును మనోహరముగ బాడుచు, సభికులనెల్ల ఱిను కారాగృహ యాత్ర గావింప నాకర్షింపుచు సభాస్థలినుండి

క॥ పలపలని మూకలోకా
ల్మిలువక పీఠమ్ముడిగ్గి నీకొడుకు తుమా
కలితభుజుడగుచు నొక్కడు
దొలగిచనియె నేమిజెప్పుదున్ భరతాంబా ?

గోపాలకృష్ణుని సభామందిరము వెలుపలనే పట్టు కొందురనుకొంటిమి గాని యట్లు జరుగలేదు. ఆనాటి యర్ధ రాత్రమున బట్టుకొనెదరేమో యనుకొంటిమి గాని యట్లు గూడ జరుగదయ్యెను. ఆనాడురాత్రి గోపాలకృష్ణుడు గుర జాడవారి యింటి కెదురుగనున్న పార్క (ఉద్యానము)లో గూర్చుండి మాచే గీతముల బాడించి విని యానంద చకిత హృదయుడై కేదార సౌందర్యమును మఱపింపగల కేదార గౌళ రాగమున

"సఖి, హే. కేశిమథనముదారం
నిభృత నికుంజ గృహంగతయాని శిరహసినిలీయవసంతమ్॥ సఖిహే॥
చకిత విలోకిత సకలదిశారతి రభసవశేనహసంతమ్॥ సఖిహే॥
ప్రథమసమాగమ లజ్జితయా పటుచాటుశతైరనుకూలమ్
మృదుమధురస్మిత భాషితయా శిథిలీకృత జఘనదుకూలమ్॥సఖిహే॥

యను జయదేవుని గీతగోవిందములోని యష్టపదిని మనోహరముగ బాడి యచటనున్న మిత్రుల మనములనెల్ల జూరగొనెను. గోపాలకృష్ణుడు నాటితేయియెల్ల సుకముగ నిదురించి మరునాడుదయమున పెందలకడనే లేచి పోలీసువారి రాకకోర కెదురుచూచుచుండిరి. ఆనాడు అనగా 30వ తేదీని శ్రీమతి యున్నవ లక్ష్మీబాయమ్మగారును, గోపాలకృష్ణు డును, భట్టిప్రోలు సూర్యప్రకాశరావుగారును కొందరు మిత్రు లమును కళ్ళికోట కాలేజివద్దకు జనినతోడనే విద్యార్థులెల్ల రును కళాశాల వీడి బయటకరుదెంచి వచ్చిరి. ఆనాడు విద్యా ర్థులును, ఓడ్ర బౌరులును ఆంధ్ర జనులును మేళతాళములతో భజనలు గావించుచు పురమెల్ల నూరేగింపుసలిపిరి. పురమున

నుత్సాహము ప్రబలి మితిమీఱిపోవుచుండెను. నాడుకూడ మహాసభ జరుగనుండెను. భట్టిప్రోలు సూర్యప్రకాశరావుగారి పైనను, కాళేశ్వరరావుగారిపైనను, బుచ్చిసుందరరావుగార్లపైనను గూడ 144వ సెక్షన్ ప్రయోగింపబడెను. సూర్యప్రకాశరావుగారు నోటీసును చేతనైన మట్టుక పోలీసు జవానుతో "ఓయీ నేను మీ ప్రభుత్వమును సరకుగొనన్నే గొనను. చేతనైనచో నన్ను పట్టుకొనుడు. అంతియేగాని మీ నోటీసులను నేను గ్రహింపను. పొమ్మ"నెను. గోపాలకృష్ణు డీసంగతివిని సూర్యప్రకాశరావుగారితో "అవునోయి, ఇది నీ పాకమునకు తగినట్లుగా యున్నది. ఇదియొక తమాషా. కానిమ్మ ప్రభుత్వమువారేమిచేసెదరో చూత"మని పల్కెను. గోపాలకృష్ణుడు సుందరరావు కాళేశ్వరరావుగార్లనుకూడ శాసనోల్లంఘనము గావింపుడని కోరెను. కాని కారణాంతరములచే వారట్లుచేయ వీలుకాదయ్యెను. ఆనాటి సభలో నమితోత్సాహము ప్రబలెను. సూర్యప్రకాశరావుగారును మరికొందఱును తీవ్రముగ నుపన్యసించిరి. గోపాలకృష్ణుడానాడుపన్యసింపలేదు. రాత్రి భుజించి సుకముగ నిదురపోయెను.

మరునాడుదయమున అనగా 1వ అక్టోబరు తేదీని చీరాలనుండి ప్రకాశం పంతులుగారికి తాము గోపాలకృష్ణునితోగూడ వెంటనే రావలెనని తంతి వచ్చెను. ప్రకాశము పంతులుగారు గోపాలకృష్ణునికి సమాచారము తెలియజేసిరి. తత్క్షణమే నేనును గోపాలకృష్ణుడును, గౌజుబేగ్ సాహెబుగారును రైలుస్టేషనుకు పోయితిమి. టిక్కెట్లను

గొని బండిలో నెక్కగనే యేకారణమునన్నోగాని ప్రకాశం పంతులుగారు గోపాలకృష్ణుని మెయిలు బండిలో ప్రయాణము చేయవద్దనియు, వేరొక బండిలో నెక్కి రమ్మనియు గోరిరి. గోపాలకృష్ణు డంగీకరించి రెండవతరగతి పెట్టెలో నుండి దిగెను. దిగినతోడనే బరంపురము పోలీసు సబ్ ఇన్స్పెక్టరుగారు గోపాలకృష్ణుని నిర్బంధమున నుంచవలసి నదిగా మండలాధికారి యొసగిన యుత్తరువును (వారంటు) నతనికి జూపిరి. తోడనే యతడు మందహాసముతో మిత్రుల కును, ప్రకాశము పంతులుగారికిని సంగతిని దెల్పిరి. ప్రకాశము పంతులు గోపాలకృష్ణుని ననేక విధముల నభినందించిరి. గోపాలకృష్ణుడు పోలీసు సబ్ ఇన్స్పెక్టరుగారికి సంతోషపూర్వక కరావలంబనమొసగి మిత్రులతో "భయములేదు. తిరిగి యాంధ్ర రాష్ట్రమునకుగవర్నరుగా (ప్రభువునుగా) వచ్చెదనులెండు. మీకెల్లరకును శుభమగునుగాక" యని పల్కి టిక్కట్ల పైకమును తిరిగి పుచ్చుకొని గుట్టుపుబండి యెక్కి పోలీసు సబ్ ఇన్స్పెక్టరుగారితోగూడ పోలీసు స్టేషనుకు జనిరి. మేమును వేరొక బండిలో నతని వెంటనే చనితిమి. గోపాలకృష్ణుడు మందహాసవదనుడై స్టేషనులోని పోలీసువారి నందరను తమ బానిసవృత్తిని వీడుడని హెచ్చరించి, మహాత్ముని యాదేశానుసారముగా చొక్కాయను పరిత్యజించి దీక్షను గ్రహించెను. ఆనాడు బరంపురమెల్ల నతనిజూడ నచటికి వచ్చెనని నతిశయోక్తి యేమియు లేదు. గోపాలకృష్ణుడు చిరునవ్వు మోమునతో నెల్లరను వీడ్కొంచి

హితమును గఱపి యెల్ల యికడ సెలవు గైకొనెను. పోలీసువారా నాడతని నమిత గౌరవముతో జూచిరి.

మరునా డుదయమున (అక్టోబరు 2వ తేదిని) గోపాల కృష్ణుని మెయిలులో శ్రీకాకుళము స్టేషన్ సమీపమున నున్న కలెక్టరుకడకు విచారణకై గొంపోయిరి. నేనును, గౌజుబేగ్ సాహెబు, కోలవెన్ను రామకోటీశ్వరరావు, న్యాయపతి నారాయణమూర్తి, పోతాప్రగడ సింహాచలం పంతులుగార్లు మొదలగు మిత్రులతోగూడ రైలులో గోపాల కృష్ణునితో శ్రీకాకుళమునకు చనితిని. పోలీసు ఇన్‌స్పెక్టరు గారు గోపాలకృష్ణునకు రెండవ తరగతి టిక్కట్టుకొని యిచ్చి నను అధికారాభిమానియగు డిప్యూటీ సూపరింటెండెంటగు రాజగోపాలరావుగా రతని నింటర్‌మీడియేట్ తరగతి బండిలో గూరుచుండ నియమించిరి. గోపాలకృష్ణుడు రాజ గోపాలరావుగారు తన్ను చులకనగ జూడ యత్నించినందు లకు గినిసియు మిత్రులమగు మా యందరితోగూడ గూరు చుండి మాట పలుకాడుచు ప్రయాణముజేయ నవకాశము లభించినందులకు సంతసించెను. అతనివెంట కాపలాకొరకై వచ్చిన పోలీసుభటులు చాల మర్యాదగా ప్రవర్తించిరి. గోపాలకృష్ణుడు మిత్రులతో ననేకవిధముల నవరసభరితముగ సంభాషించి యెల్లర కానందము గూర్చెను. ఆ సమయమున ప్రాప్తించనున్న మిత్రవియోగమునకై వ్యధనొందిన మనసు గలవాడనై యనురాగ చకిత హృదయుడనై తొల్లి పెంపుడు కూతురగు శకుంతల నత్తవారింటి కనుపునపుడు కాశ్యపుడు పల్కిన

శ్లో॥ యాస్యత్యద్య శకుంతలేతి హృదయం సంస్పృష్ట ముత్కంఠయా
కంఠ స్తంభిత బాష్పవృత్తి కలుషశ్చింతాజడం దర్శనం
వైక్లబ్యం మమతావదీ దృశమహో స్నేహాదరణ్యోకసః
పీడ్యంతే గృహిణః కథంనుతనయా విశ్లేష దుఃఖైర్నవైః॥

శ్లో॥ పాతుంన ప్రథమం వ్యవస్యతి జలంయుష్మా స్వపీతేషుయా
నాదత్తే ప్రియమండనాపి భవతాం స్నేహేనయా పల్లవం
ఆద్యేవ కుసుమప్రసూతి సమయే యస్యాభవ త్యుత్సవః
సేయంయాతి శకుంతలాపతి గృహం సర్వైరనుజ్ఞాయతాం॥

అను శ్లోకముల జదివి సంస్కృతము దెలియని నా మిత్రులలో కొందరకు పై శ్లోకముల భావము బోధపడు టకై వాని ననుసరించి కందుకూరి వీరేశలింగం పంతులు గారిచే రచింపబడిన

ఈ॥ కొందలమందె డెందము శకుంతల తానిపుడేగునంచయో
క్రందుగ బాష్పరోధమున కంఠమునుంజెడె దృష్టిమాంద్యముల్
బొందె నొకింత పెంచిన తపోధనులేయిటు గుంద నెంతగా
గుందుదురో తమంతగను కూతులబాయు గృహస్థులక్కటా? ॥

చ॥ ఎవతె జలంబుమీకిడక నెన్నడుద్రావదు తాను ముందుగా
నెవ్వరిత్ర ప్రేమచేజిదు మదీప్సితభూషణయయ్య మీ చిగు
ళ్ళెవ తెకు మీరుదో ల్తననలె త్తుట పండువుగాగనుండు నా
ప్రవిమలగాత్రి యేగు పతిపజ్జకు నందఱనుజ్ఞ యీయరే॥

యను పద్యములను సభ్రూభంగముగ, సచకితముగ, సత్రపముగ, సానురాగముగ జదివితిని. రసికశిఖామణియగు గోపాలకృష్ణుడు మదీయ హృదయాంతర్గత భావమును, తదాభవపోషకముగ నేను బాడిన కళ్యాణీ రాగఘణితిని

గ్రహించి, మెచ్చికొని, కరుణారస పులకితగాత్రుడై, చిరతరానువర్తిత స్నేహవల్లి పల్లవింప కావ్యేషు నాటకం రమ్యం నాటకేషు శకుంతలా తత్రాపి చతుర్థాంకః, తత్రశ్లోక చతుష్టయమ్" అను వచనమున సుప్రసిద్ధమైన శకుంతల నాటకమున చతుర్థాంకమునందలి కరుణారసభరితమగు శకుంతలా వియోగ కథనమునకు సంబంధించిన రంగమునంతను స్మరణకు దెచ్చుకొని శ్లోకభావమును నొక్కిపట్టిన నాత్మపరముగ నన్వయించికొని గిబ్బున కన్నుల నీరునించెను. నాకు కన్నుల బాష్పములూరెను. అశ్రుమలీమసనేత్రులమై పరస్పర కరుణావలోకనముల నొక్కింత తడవుండి పిమ్మట నిరువురమును భావాంతరానుభూతినొంది వేఱు ప్రసంగము గావింపసాగితిమి. శ్రీకాకుళము స్టేషనుకడదిగి చేరువనున్న పూటకూలింటి భోజనము జేసి వెంటనే కలెక్టరు విడిసియున్న పాంథ విశ్రాంతి గృహము (Traveller's Bunglow) నకు పోతిమి. ఆనాడచ్చట సాయంత్రము 4 గంటలవరకును కలెక్టరు గోపాలకృష్ణుని విచారించి మరునాడు తీప్ప చెప్పెదనని చెప్పి గోపాలకృష్ణు మాటనమ్మికపై వదలిపెట్టి మరునాడు 9 గంటలకచటికి తిరిగిరమ్మనికోరి పంపివేచెను. అందునలన మాకా రాత్రగూడ గోపాలకృష్ణునిత్రోవ నచ్చటనున్న సత్రమున సంతోషమున బ్రొద్దుపుచ్చు భాగ్యము తిరిగి లభించెను. గోపాలకృష్ణుడు మనసులో నిసుమంతయైనను విచారముగాని భయముగాని చెందక సంతోషాంతరంగుడై యెల్లరతోడను ఛలోక్తుల నాడుచు నందులో ముఖ్యముగ గంజాం జిల్లా వారు వాడు "గట్ర"యను పదమును చమత్కారముగ

ప్రుంచినీళ్లు గట్రా పట్టుకొనిరా, పసుపు గట్రా వేయుము, అన్నం గట్రా తిందుమా?"యని యుపయోగించుచు నందరకు నన్నపుట్టించు కబుర్లు చెప్పుచు, మధుర గానాలాపము, అందు ముఖ్యముగ నీలపై పాట గావించుచు రాత్రి యెల్ల నిముసమట్లుల గడపెను. ఉదయమునసే మేమందఱి మును లేచి యచ్చటి దేశభక్తులొసగిన ఫలహారముల భుజించి కలెక్టరు విడిది కేగితిమి. అతడు 10 గంటల కరు దెంచి గోపాలకృష్ణుని జామీనీయుమని కోరి యతడందుల కంగీకరింపకపోవుటచే నతని కొక సంవత్సరము విడిఖైదు విధించెను. శిక్ష విధింపబడినవెంటనే గోపాలకృష్ణుడు జైలులో బరంపురమునకు సాయంత్రము నాలుగు గంటలకు గొనిరా బడెను. తిరిగి వచ్చినపుడు నేమును గోపాలకృష్ణుడును గూడ మూడవతరగతి బండిలోనసే గూర్చుంటిమి. త్రోవపొడుగున ననుజనులు గోపాలకృష్ణుని దర్శింప నందలకొలదిగ రాదొడగిరి. గోపాలకృష్ణుడు మందహాసము గావించుచు జనుల యభినందనముల గృతజ్ఞతాపురస్సరముగా శిరసా గ్రహించుచు వారలకెల్లరకును స్వరాజ్యతత్వమును, అహింసా ప్రాధాన్యమునుపదేశించెను. త్రోవపొడుగునను పోలీసునాకు మర్యాద త్రోడనే సంచరించిరి.గోపాలకృష్ణుడు దేశభక్త వేంకటప్పయ్య పంతులుగారికిని, గాంధిమహాత్మునకును, తదితర మిత్రులకును నుచితమగురీతి సందేశములనంపెను. మిత్రులతో రసవత్తరముగ సంభాషింపదొడగెను. మార్గమధ్యమున మాకు జిర పరిచితుడును, సంస్కృతాంగ్లేయ భాషావిశారదుడును, ప్రభుత్వ ప్రతిష్ఠాపిత సంస్కృతకళాశాలా పరీక్షాధికారియు

నగు శ్రీమత్తిరుమల గుదిమెళ్ళ వరదాచార్యులవారు గోపాల కృష్ణుని జూడ మా బండిలోనికివచ్చిరి. కుశల ప్రశ్నానంతరము గోపాలకృష్ణు డాచార్యులవారికి పూర్వోదాహృతమగు "బ్రహ్మన్ అధ్యయనస్యైష సమయం తూష్ణీం బహిస్తీయతాం, స్వల్పం జల్ప బృహస్పతే జడమతే నైషా సభా వజ్రణః స్తోత్రం సంహార నారద..... స్వస్థోనలంకేశ్వరః" యను శ్లోకమును జ్ఞాపకముగావించి వారి యట్టిపండితులు సర్కారు కొలువున నుండజనదని బహు సరసముగ హెచ్చరించిరి. ఆనాటి గోపాలకృష్ణుని హెచ్చరికకు ఫలితముగ నాచార్యులవారు సర్కారువారి కొలువును జాలించికొనిరి.

అట్లు సాయంత్రము 4 గంటలకు బరంపురము జేరితిమి. గోపాలకృష్ణు డప్పుడే కారాగృహమునకు గొంపోబడెను. మనునా డుదయమున నతడు గంపలగూడెం కుమారరాజాగారి బండ్లగులద్వారా తనకు వంటకై కావలసిన పాత్ర సామగ్రిని తెచ్చియిమ్మని నాకు కబురంప వానిని గైకొని కారాగృహముకడ కేగి యతనిని దర్శించి పాత్రల నతనికొసగి క్షేమసమాచారముల నడిగితిని. ప్రథమ రాత్రమున కొంచెము క్రొత్తగ నుండుటలో వింత యేమియు లేదనియు, పిమ్మట నలవాటుపడితిననియు, గంపలగూడెం రాజాగారిని జూచినతోడనే తాను ఆయనను "ఏమోయ్ రాజా, నీకు గంజి ముట్టినదే" యని యడుగ నతడు తనతో "అవునోయ్ అమాత్యశేఖరా, మన రాజ్యంబున ప్రజలెట్లున్నవారు? నీకు తమిదంబలి నాగాలేకుండ ముట్టుచున్నదే" యనుచు

నాటకములోని రాజు, మంత్రులబోలె పరస్పర చమత్కార ప్రసంగములతో ప్రొద్దు పుచ్చుచుంటిమనియు, యిపుపురకును క్షేమముగనే యుండెదననియు, తన క్షేమవార్త తన బంధు మిత్రుల కందఱి కెఱింగింపుమనియు జెప్పి నన్ను బంపివైచెను. అంత నేను "ఔరా, చింత వీఱిగినను పులుసు విఱుగలేదు గదా" యనుకొని లోలోన గోపాలకృష్ణుని మనస్థైర్యమున కచ్చువందుచు నింటికేగి యారాత్రియే బరంపురమును వీడి విజయవాడకై ప్రయాణోన్ముఖుడ నైతిని. త్రోవలో నేనాగిన చోటులలోనెల్ల గోపాలకృష్ణుని కథను విని యతని దేశాభిమానమును, శౌర్యమును, పౌరుషమును, అభిమానమును, మనస్థైర్యమును ప్రశంసింపనివారు లేరైరి. నాకును నా మిత్రుని గుణగణముల నాంధ్ర మహాజనులు గ్రహించుట యానందదాయకమయ్యెను. నేను విశాఖపట్టణమున నుండగా గోపాలకృష్ణుని తిరుచునాపల్లి కారాగృహమునకు మార్చిరని తెలియవచ్చెను.

కారాగృహ ప్రవేశానంతరము సైతము గోపాల కృష్ణుని మనోగాంభీర్యము కుంటువడలేదనుటకు నీ క్రింది విషయములు దార్ఢ్యములు కాగలవు. "ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారిని 10-10-21 ఉదయము మెయిలులో తిరుచునాపల్లి తీసుకొనిపోయినారు. శ్రీ మాల్లాది కృష్ణమూర్తి పంతులు, వి. వి. గిరి, న్యాయపతి నారాయణమూర్తి, కో. రామకోటీశ్వరరావు, మహమ్మద్ హైదర్ సాహెబుగార్లును, ఇతర

యసహాయవాదులును బరంపురం రైల్వే ప్లాటుఫారమునం దుండిరి. కాని డిప్యూటీ సూపరింటెండెంటుగారు ఎవరును బండివద్దకు రాకూడదనియు, గోపాలకృష్ణయ్యగారిత్రో మాట లాడరాదనియు కట్టడిచేసిరి. అంతట స్నేహితులు చేయునది లేక యూరక చూచుచుండిరి. ఎట్టకేలకు బారిస్టర్ గిరిగారు "మీ భార్యయును కుటుంబమును క్షేమముగా నున్నా"రని చెప్పిరి. గోపాలకృష్ణయ్యగారు ఆతురతత్రో చీరాలసంగతి యేమని యడిగిరి. "అంతయు సురక్షితముగనే యున్న"దని గిరిగారు జవాబిచ్చిరి. ఆహా చీరాల పేరాలయందు వీరికెట్టి యభిమానము! "శ్రీ గోపాలకృష్ణయ్యగారిని మొన్నటి యుదయమునను చెన్నపురికి పోలీసువారు తీసుకొనివచ్చిరి. రాత్రి బోటు మెయిలుమీద తిరుచునాపల్లి చెఱసాలకు గొని పోయిరి. ఉదయమునసుండి రైలుబండి వెడలిపోవువరకును వారిని మిత్రులు సందర్శించుచుండిరి. గోపాలకృష్ణయ్యగారు వారికి సహజమైన యుత్సాహముత్రోను, చమత్కార ప్రసం గములత్రోను, వారిని జూడబోయిన మిత్రుల కవ్యాజానంద మును గలుగజేయుచుండిరి. శ్రీరంగనాయకక్షేత్ర సమీపము నను నివసింపబోవు చున్నామనియు, నిరంతరము శ్రీరామ పాదారవింద స్మరణమునుజేయుచు స్వరాజ్యసిద్ధికి నిత్యైక కర్యము జేయుదుమనియు మిత్రులకుదెల్పిరి. భారతదేశ ప్రఖ్యా తిని గడించిన చీరాల పేరాల పౌరులను, వారి ధర్మప్రతిపను గాపాడుకొనవలెననియును, ఆంధ్రలోకము చీరాల పేరాల పౌరుల పరువు ప్రతిష్ఠలను గాపాడవలయుననియును బ్రార్థించిరి. గోపాలకృష్ణయ్యగారి మందహాసము, గంభీరభావములు,

ఛలోక్తులు, వినయ స్వభావము కారాగృహవాస భయమును ప్రజాహృదయమునుండి నాశనముచేసిన విధమును వ్యక్తము జేసెను. (ఆంధ్రపత్రిక 14-10-21) "చీరాల పేరాల నాయకులును, రామదండు ముఖ్యులు నగు ఆంధ్రరత్న గోపాల కృష్ణయ్యగారు గంజాంజిల్లా మేజస్ట్రీటుగారిచే రెండు సంవత్సరము శిక్ష విధింపబడి తిరుచునాపల్లి యీ యుదయము (12-10-21) బోటు మెయిలులో చేరిరి. వారిని మూడవ తరగతి బండిలో తీసికొనివచ్చిరి. వారివెంట నాల్గవ రిజర్వు పోలీసువారు వచ్చిరి. డాక్టరు టి. యన్. యస్. రాజన్, టి. ఆదినారాయణ చెట్టియారు, పి. కోదండ రామయ్యర్ ప్రభృతులు ఆయనను స్టేషన్ ప్లాట్‌ఫారములో కలుసుకొని నమస్కారము లర్పించిరి. ఆయన భోజనము చేయవలసినదనికోరగా తాము ప్రభుత్వమువారి యతిథియగుటచే యితరు లాహ్వానించుటకు వీలులేదని గోపాలకృష్ణయ్యగారు ప్రత్యుత్తరమిచ్చిరి..... ఆయన సంతోషముగనే యుండెను. కాని చిక్కిపోయి యుండెను. డాక్టరు రాజన్‌గారు బొంబాయిలో చూచినప్పటికంటె చిక్కిపోయినారేమని యడుగగా శరీరములోని చెడుపదార్థమంతయు వెడలిపోవుటచే నట్లాయెనని ప్రత్యుత్తర మిచ్చెను. ఆయన ఖద్దర్ తలగుడ్డ ధోవతి అంగవస్త్రములను ధరించి మెడచుట్టును రుద్రాక్షమాలతోను భుజముమీద తుండుగుడ్డతో నుండెను"
(ఆంధ్రపత్రిక 14-10-21)

మత్స్యపురరజ్జిము

ఇట్లు కొంతకాలము గడచినపిదప నవంబరు పదియవ తేదిని బందరులో కృష్ణాజిల్లా కలెక్టరు గోపాలకృష్ణుని పునఃరాజద్రోహములకయి విచారింతురనియు, నా నేరము వెనుక నత డేలూరులో నొసంగిన యుపన్యాసమునకు సంబంధించినదనియు, నందులకయి గోపాలకృష్ణుని తొమ్మిదవ నవంబరు తేదిని బందరునకుఁ దీసికొని పోవుదురనియుఁ దెలిసికొని వెంటనే యుదయము పదునొకండు గంటల బండిపై కోలవెన్ను రామకోటీశ్వరరావు, సూర్యప్రకాశరావు మొదలగువారితోగూడఁ జనుచున్న గోపాలకృష్ణు ననుసరించి బందరుపురి కేగితిని. గోపాలకృష్ణుడు యోగీశ్వరునివలె గడ్డము పెంచుకొనుచుండెను. పూర్వము బరంపురమున నేను జూచినప్పటికంటె నతడు కొంచెము ఆరోగ్యముగనే యున్నట్లు గన్పట్టెను. కాని నిజముగ నతఁడనారోగ్యముగనే యుండెనట. కారాగృహమునందలి భోజనసదుపాయము ఘోరముగనుండెననియు, నాహారపదార్థములు సరిపడినట్లొసగరనియు, దనకిచ్చు కారపుఁబొడి పంచభూతాత్మకముగ నుండెననియు అనగా రాలు అప్పలు, దుమ్ము, ఘూళి, చెత్తచెదారము మొదలగువానితో మిళితమయి యుండెననియు, ఆంధ్ర భోజనమున కలంకారప్రాయములగు నేయియు, మజ్జిగయు నొసఁగనే యొసఁగరనియు, తమతోబాటు నిగ్బంధమునన్న యేడ్గురు సిక్కులు రాజకీయమగు నేరమున కయి శిక్షింపఁబడినవారు తిరుచినాపల్లి చెఱసాలలోని భోజన పద్ధతుల సహింపలేక యచ్చటి కష్టముల ననుభవింపఁజాలక

భోజనము మాని ప్రాయోపవేశమున నుండిరనియు, భూతల మున నిట్టి నరకావాసమున్నదని తామెన్నడును దలఁచి యుండలేదనియు, నయ్యది యొక శ్మశానవాటికవలె నున్న దనియు నతఁడు మాకుఁజెప్పెను. స్మశానభూమియందలి మృగాలారావములకు మాఱుగా నచ్చట రాత్రుల నిర్బంధితులఁ గావలికాయు వారిరను డొగ్గ కావలిగాండ్ర All is well అను భీకరా రావములును, భూత ప్రేత పిశాచ కోలాహలమునకు మాఱుగా నచ్చటి నిర్బంధితులు వేయు కేకలును, పాడు పాటలును, నేడ్చు నేడ్పులును, నవ్వు వెకిలి నవ్వులును, ఆక్రందించు ఘోరాక్రందనలును ఆరవించు ఆరావములును దాండవించు వికృత తాండవములును, బరస్పర సమ్మర్ద జనిత భీకర రవములును కావించు నట్టహాసములును, బ్రబలుచు స్మశానవాటికోపమను బ్రత్యక్ష సార్థకముగా నొనర్ప గలవని యతఁడు భీభత్స భయానక రసోపేతమగు నా కారాగార రంగమును రసస్ఫూర్తి మిట్టినడునట్లు వర్ణించెను. గోపాలకృష్ణుడు తానొకనాటి రేయి All is well అనుచు గేకలు వేయుచున్న కావలివానిని బిలిచి యతనితో నోయీ! నీకాంగ్లేయభాష తిన్నగా రాకుండుటచే All is well అని పలుకుచున్నావు. అట్లు పలుకుట తప్పు. All is hell అని పలుకవలయును 'సుమా' యని బోధించెనట. పాపము! ఆంగ్లేయ భాషాగంధ మెసుఁగంతయేనెఱుంగని యా కావలి వాఁడు "అంతయు సరిగానున్న"దను నర్థమొసఁగు "All is well అను పలుకులకు మాఱుగా "అంతయు నరకముగా నున్న"దను నర్థమొసఁగు "All is hell" అను పలుకుల

నుచ్చరించుచుఁ గేకలు వేయఁజొచ్చెను. విద్యాశూన్యత సమానప్రతిపత్తిగలయతనియందు తోడికావలిగాండ్రందఱును All is hell అనుకేకనే వేయుచుకారా గృహమునందు నిర్బంధితులయియున్నవారికి దాని నిజస్వరూపమును గోచరింపఁజేయుచుఁ దుదకుఁ దమ తెలివిలేమి కధికారులచేఁ జీవాట్లు తినునవస్థనొందిరి. కారాగృహమున దాను నిత్యమును శ్రీరామ పాదారవింద సంసేవనమునను, భజనమునందునను కాలము గడపుచుంటిననియు గారాగృహ వాసమునకు సంసిద్ధపడువారు పూలదండలచే నాకర్షింపఁ బడరాదనియు, నిద్రాహారములను త్యజింపగల కఠినవ్రతులే యందు ప్రవేశించుట కధికారులనియు నతఁడు దెలిపెను.

ప్రొద్దు పొడువునను బరిచితపూర్వులగు మిత్రసత్తములనేకులు గోపాలకృష్ణుని దర్శించి ఫలపుష్పాద్యుపాయనము లొసంగి సంప్రీతులగుచుండిరి. సంముదిత హృదయుఁడై గోపాలకృష్ణుడు భవబంధములఁ, ద్రుణప్రాయములుగా శిథిలముఁ గావింపఁగల భక్తిభావము నలవఱచికొని "ఆలు గరగించు విమల గాంధర్వ ఘణిత"ని—

శరణు శరణని రామచంద్రు నహల్య సన్నుతించెను వినవె !
పరమ పురుషుండన్చు గౌతమముని వాక్యసరణి మదిలోనెన్నుచు
శౌరికి ప్రొయ్యి
యురుదార నర్ఘ్యపాద్యములిచ్చి హర్ష విస్ఫారితాక్షియైమించి పులకించి నీ
చరణ సీరజ పరాగమునను దరిత మెల్లఁ దొలంగె నహహా
గరిమమీఱఁ గృతార్థనైతి జగత్ప్రభో ! కమలావిభో ! హరి ! శరణు.

అను నధ్యాత్మ రామాయణములోని కీర్తనను ఘోర బిలాంతర్గత పాపహారియగు బిలహరి రాగమున మనోరంజకముగఁబాడి శాప పునీతయై తొల్లింటి దివ్యస్వరూపము నొందిన యహల్యాదేవి మనోభావమెల్ల నాత్మపరముగా ననువ్వయించికొని యితరులకును నట్లే యన్వయమగు నటుల గావించెను. అట్లు ప్రయాణముఁగావించి కొంతసేపటికి బందరు పురమునకు జేరితిమి. అప్పటికే జనులు గోపాల కృష్ణుని యాగమన వృత్తాంతము విని వేలకొలది గుంపులు గుంపులుగా మేళ తాళములతోను భజనలుగావించుచును రైలుస్టేషనుకడకు వచ్చి స్లాట్‌ఫారము నంతయు నిసుకవైచిన రీతిగా నుండునట్లు నిండియుండిరి. గోపాలకృష్ణుడు రైలుబండి దిగినతోడనే బందరు పౌరులు అతనిఁ బుష్పమాలాలంకృతుని జేసిరి. స్టేషను నుండి కారాగారమువఱకును వీధులు జన శ్రేణులచేఁ గిటకిటలాడుచుండెను. వందలకొలది బాలురు స్వరాజ్య గీతామృతమును దీనస్వరమునఁ బాడుచు జనుల హృదయములఁ గరగించివైచిరి. పోలీసువా రెట్టులైనను గోపాలకృష్ణు డెక్కిన బండి నుత్తనముండి తప్పింపవలయు నని ప్రయత్నించిరి గాని జనసంమర్దముచే నయ్యది సాధ్యము గాకపోయెను. గోపాలకృష్ణుడు తొల్లి తన జాతీయవిద్యా నాటకమునకు రంగప్రదేశమయిన బందరు పురమును పాత్రములగు నందలి పౌరులను గని మందహాసముతో "పూర్వము తానచటనుండిన స్థితికిని ఆనాడు తాను పొందిన యఖండ గౌరవమునకును గల తారతమ్యమును సవిమర్శముగా లోలోనఁజర్చించుచు నాలోచనానిమగ్నుఁడు

కాదొడగెను. కరుణారసహృదయులగు నతని మిత్రులు కొందఱు గుఱుతింప శక్యముగానంతగా జిక్కిపోయిన యతని శరీరస్థితిని గాంచి యార్ద్రీభూత మనస్కులై

శ్లో॥శివశిరసి శీరాంసియానిరేజు, శ్శివశివతానిలురంతి గృధ్రపాదై ।
అయి ! ఖలువిషమ: పురాకృతానాం, భవతిహా జంతుషు కర్మణాం
విపాక: ॥

క్వజనకతనయా ర్వరామజాయా, క్వచదశకంధక మందిరేనివాస: ।
అయి! ఖలువిషమ: పురాకృతానాం భవతిహా జంతుషు కర్మణాం
విపాక: ॥

అను శ్లోకముల భావమును మననముఁ జేయుచు విచారింపఁ దొడఁగిరి, కాని – నేను నిస్సహాయుఁడయ్య నత డించుకేని వెఱువక స్వయంకృషిచే స్వార్థత్యాగముచే సాధన సంపత్తి లేకుండినను తుదకు అంతటి కీర్తిపతిష్ఠల గాంచుట గాంచి

ధన్య: పౌష్పం, వకార్ముకమయీ । పంచవిశిఖా:
వసంతస్సామంత: మలయపవనో గంధకాలభ:
స్వయంచైకోనిగ్రస్సకలభువనం వ్యాకులయతి
క్రియాసిద్ధి స్సత్వే భవతిమహతాం నోపకరణై: ॥

అను శ్లోకభావమును మననముఁజేసి మిత్రుని యొక్క గర్వమును సంతసమును ననుభవించితిని. ఇంతలో గోపాల కృష్ణుఁడు కారాగృహ ప్రవిష్టుడయ్యెను.

మఱునాడు గోపాలకృష్ణుడు బందరు కలెక్టరుచే రాజ ద్రోహము పురికొల్పు నుపన్యాసముల నొసంగినందులకై ఇండియన్ పీనల్‌కోడ్ (భారతీయ శిక్షాస్మృతి) లోని

124 యే. శిక్ష ప్రకారము విచారింపబడెను. విచారణ రెండు మూడు రోజులు జరిగెను. తుదకు కలెక్టరు గోపాల కృష్ణుని దోషిగా నెంచెను. గోపాలకృష్ణుడు బుద్ధిపూర్వకముగా రాజద్రోహము పురికొల్పనెంచి యుండకపోయినను సామాన్యజనుల కతని యుపన్యాసముల వలన ప్రభుత్వము నెడల నసూయ జనించునని యెంచి యతనికి దొమ్మిది మాసములు సామాన్య నిర్బంధమును విధించెను. ఈ శిక్ష విధింపబడిన కారణమున వెనుకటి జామీను శిక్ష రద్దయి పోయెను. గోపాలకృష్ణుడు శిక్షను సంతోషముతో గ్రహించెను. కలెక్టరున కతడు సంతోష పూర్వకముగ కరావలంబన మొసగి మిత్రులకడ సెలవుగైకొని కారాగృహమునకు జనియెను. రెండవసారి విచారింపబడి శిక్షింపబడి నప్పటికి గోపాలకృష్ణుడు వీతధైర్యుడు భీతచిత్తుడును గాలేదనుటకు నతడు చీరాల పేరాల వాసులకు వ్రాసిన యీ క్రిందిలేఖియు నాంధ్రపత్రికా ప్రతినిధితో గావించిన యీ క్రింది సంభాషణమును ప్రబల తారాకాణములగును.

"చీరాల పేరాల పౌరులకు రామదాసు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గాఢాలింగనములు. పునస్సంధానమై తిరిగి గృహ ప్రవేశము కాబోవుచున్నాను. ఇంతవరకు అవిచ్ఛిన్నమగు మీ దీక్షకుఁ గృతజ్ఞుడను. మన బాధ్యత కేవలము మన గ్రామములయొక్కగాని, మన ఆంధ్ర భూమియొక్కగాని ధైర్య స్థైర్య శౌర్యాదుల నిల్పుటయందు మాత్రమే లేదు. యావదాభరత్రా భ్యుదయము మనమీద నాధారపడి యున్న

దని శ్రీ గాంధీమహాబుషి వచించిన వాక్యములు నిరంతర స్మరణీయములు. మీరు వాటిని సర్వకాల సర్వావస్థలయందు దృష్టిపథమం దుంచికొని, అధికారవర్గమువారి లయలకు మోసపోక యెట్టితీర్మానము గావించినను మన మహర్షి యొక్క ఆశీర్వచనమును పురస్కరించుకొని పెద్దల యనుమతిబడసి యాచరింతురుగాక. మన ప్రతిజ్ఞ నిర్వహింతురుగాక. శ్రీరామ నామ స్మరణను మరువకుందురుగాక. శ్రీరామార్పణమస్తు.

మీ సహోదరుడు,

దుగ్గిరాల గోపాలకృష్ణయ్య.

"శ్రీయుత ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారు తిరిగి తిరుచునాపల్లి జయిలునకు గొంపోబడుచు మార్గ మధ్యమున చెన్నపురిలో నేడు ఆపుదల కాబడి రనువార్త తెలియగనే ఒక ప్రతినిధివారిని సందర్శించిరి. అనేక విషయములనుగురించి తీవ్రముగ జర్చించిరి. వారిలో సంతోషమును వెలిబుచ్చెడి సూచనలు పలుమారు వెల్లడి యగుచుండెను. ప్రతినిధి వారిని విద్యార్థుల కొసగుటకు సందేశ మేమైనా గలదాయని ప్రార్థించెను. అందులకు వారు ఇంకను ప్రభుత్వ సంబంధము కలిగిన పాఠశాలలలో పఠించుచున్న విద్యార్థులు మృతతుల్యులనియు, అట్టివారు జాతీయ నాయకులను సందర్శించుట కవేక్షించుటగాని వారి నొకమారు స్మరించుటగాని లజ్జాకరమని నుడివిరి. పాఠశాలలను బహిష్కరించినవారు పూర్తిగా జాతీయసేవకై యుపయోగ పడకున్నను వారి త్యాగబుద్ధి స్వరాజ్యస్థాపన కించుక తోడ్పడినదనియు, అధికారుల హృదయములలో శూలములు గ్రుచ్చినట్లైనదనియు,

అనేకమంది దేశీయులు తమవాతనే కాలస్థితిని గుర్తించిరనియు వచించిరి. పాఠశాలలో నిలచి పెనగులాడుచున్న విద్యార్థులు దేశసేవ కణుమాత్ర ముపయుక్తపడుట కవకాశము లేదనియు నంటయింటిలోగూచ్చని వీళ్ళిలోని జలదారిని శుభ్రపరచిన ట్లుండుమనియు సామెత నగుపరచిరి. ప్రతినిధి వారిసెలవు గైకొనునపు డీ క్రింది సందేశమును విద్యార్థి సోదరుల కొసంగిరి. "బాలవాక్యం బ్రహ్మవాక్యమని పెద్దలు చెప్పెదరు. ఈ విద్యాలయములను తతణమే విడనాడి దేశాభ్యుదయమునకు రామదండులో చేరితేగాని వారి నోటివెంట నభ్యుదయ ప్రదములగు ముద్దగు పవిత్రవచనములు వెలువడవు. ఆంధ్ర విద్యార్థులందరు జ్ఞానస్నానంబులగు నీ విద్యాలయములను వదలి ధర్మాంబువుల నభ్యంగన మాచరించి శుద్ధ స్వదేశవస్త్రముల మధుపర్కముల ధరించి పునీతులై దీక్షాబద్ధులై సత్వర స్వరాజ్యలక్ష్మి కళ్యాణ మహోత్సవంబునకు సంసిద్ధులు గావలయును. ఈ విద్యాలయములు విద్యార్థుల ఆత్మలను హత్య జేయుచున్నవి. కొంతకాలము మీ మెదడులో నిమిడియున్న విషయము నశించువరకు జాతీయ కళాశాలలో జేరకున్నను నష్టములేదు. ఇంతలో జాతీయోద్యమములో గాంధి మహాత్ముని నాయకత్వమున నుడుత చందమున పోరాడి స్వరాజ్యము సంపాదింతురుగాక యని యనేక గాఢాలింగనములొనరించి యాశీర్వదించెను. వందే మాతరమ్. (ఆంధ్రపత్రిక 15-11-21)

ఈ విచారణవలన గోపాలకృష్ణుని గౌరవము తగ్గుటకు మారుగా హెచ్చినది. పత్రికలన్నియు గోపాలకృష్ణుని మన

స్థైర్యమును గొనియాడెను. చీరాల పేరాల వాసుల మనో నిశ్చయము మరింత దృఢమయ్యెను. గోపాలకృష్ణుడు తిరిగి వచ్చువరకు తమ ప్రతిజ్ఞ నవిచ్ఛిన్నముగా గొనసాగింపవలె ననియు, గ్రామములలోనికి రాగూడదనియు, రామదండును ప్రోత్సహించి బాగుజేయవలెననియు, గోపాలకృష్ణుని కుటుంబమునకు వలసిన సాయమెల్ల జేయవలెననియు, వారు నిశ్చయించుకొనిరి. గాంధి మహాత్ముడు గోపాలకృష్ణుని మనో గాంభీర్యమును గొనియాడి యతడొసగిన స్వరాజ్య నిర్వచనమును దమ **Young India** (యంగ్ ఇండియా) పత్రికా రాజమున నుదహరించిరి. చెన్నపురి శాసనసభలో చీరాల మ్యూనిసిపాలిటీ రద్దుగావింపబడవలెనను తీర్మానము చర్చింపబడి దురభిమానపూరితులగు జస్టిస్ వర్గమువారియొక్కయు, అధికారదూర్వాహులగు ప్రభుత్వమువారియొక్కయు, పరతంత్రులగు మంత్రులయొక్క పట్టుదలచేతను, తెలివిలేమి చేతను నిరాకరింపబడెను. చీరాల పేరాల పౌరులకు సగ్గారు వారి నిశ్చయము తేటతెల్లమయ్యెను. పరదేశీయులగు ప్రభుత్వమువారి మెరమెచ్చుకై పెనుగులాడుట నిప్రయోజనకరమని వారు గ్రహించిరి. స్వయంకృషియే, స్వయంసహాయమే అహింసాయుతమును, సత్యాధారము గలదియును నగు దౌర్జన్యరహిత సహాయనిరాకరణమే శరణ్యములనియు, గాంధి మహాత్ముడే గురూత్తముడును, నాయకోత్తముడును ననియు, నతని యాదేశములే శిరసాగ్రహించి యనుసరింపదగినవనియు వారు నిశ్చయముగ దెలిసికొనిరి. గోపాలకృష్ణు

డెప్పుడు తిరిగి వచ్చునాయని వర్షోదయమునకై చాతకములు వేచియుండురీతి నాతురమున గనిపెట్టికొని యుండిరి. గోపాలకృష్ణుడును చీరాల పేరాల మోతీమును, స్వారాజ్య ప్రాప్తియు నెప్పు డబ్బునాయనుచు కారాగృహమున నిరంతర యోగనిష్ఠబూని తపము జేయుచున్నాడు. వీరికోరిక యెప్పుడు ఫలించునో దైవమున కేఱుక !!!

షష్ఠమ ప్రకరణము

ఉపసంహారము

ఇక నిరంతర దేశసేవా వ్రతదీక్ష గైకొని కృషిసల్పి తుదకు ప్రాయోపవిష్టుడై కారాగారమునన్న మన కథానాయకుడగు గోపాలకృష్ణుని గుణగణముల నొక్కింత వర్ణింప దగును. అతడు వివిధగుణాలంకార భూషితుడనుటకు బైన వివిధ ప్రకరణముల వర్ణింపబడిన విషయములే చాలును. అయినను పరిచయభాగ్యముచే గొన్ని విశేషముల దెలిసికొన గల్గితినను గర్వమే యతని గుణవర్ణనముతో గూడిన యీ ప్రకరణమును నాచే వ్రాయించినది. పాఠకమహాశయులు నా యభిప్రాయముల దయాలసులై మన్నింతురుగాక.

గోపాలకృష్ణుని గుణములలోనెల్ల బ్రధానమైనది దైవ భక్తి. అతడు నాస్తికుడుగాక దైవభక్తిగలిగి నిరంతరము శ్రీరామచంద్ర పాదారవింద సంస్మరణమున పునీతాత్మ డగుచుండెను. నాస్తికుల కుండదగిన మృత్యుభయము, కష్ట భయము, పిరికితనము, స్వార్థపరత్వము, దయాశూన్యత,

అహంభావము మొదలగు దుర్గుణము లతనియందు గాన్పించ వయ్యెను. అందుచే నతఁడు కష్టపరంపరలు లెక్కింపక నెలకు మున్నూఱు రూప్యముల లభింపజేయుచు నంతకన్న నెక్కుడు జీతమునుగూడ లభింపజేయఁగల యుద్యోగమును నొక్క పెట్టునఁ ద్యజించి నిర్ధనుడయ్యె, నిస్సహాయుఁడయ్యె, అపనింది తుఁడయ్యె, శంకితుఁడయ్యె, జంకక యవ్యాజ దేశానురాగ ముచేఁ బురికొల్పఁబడినవాఁడై ధననష్టమును శరీరాయాస మును ప్రాణాపాయమునుగూడ గణింపక దేశసేవసల్పి తుదకుఁ గారాగృహ ప్రాప్తినందెను. ఆతనిచే నింతదీక్షఁ బూన్పించినది శ్రీరామ భక్తియేగాని వేరుగాదు. స్వార్థపరులై కుక్షింభరులై స్వలాభముకొఱ కన్యుల మానధన ప్రాణంబులకు హానిం గలిగించు దుస్స్వభావము నాస్తికుల కేగాని సత్స్వభావుండును శ్రీరామ భక్తుఁడును నగు గోపాలకృష్ణున కలవడ నేర్చునే? దయాధర్మ సత్యశౌచములే దేశసేవకునకుఁ బ్రధాన లక్షణ ములుగా నుండఁదగునని గోపాలకృష్ణుఁడు పిన్నవయసుననే గ్రహింపఁగలైను. సజ్జనగోష్ఠియు, నాదబ్రహ్మోపాసనయు, నతని దైవభక్తికి మఱింత దోహదముఁ గూర్చినవయ్యెను.

చిన్నతనమునుండియు గోపాలకృష్ణుఁడు విద్వజ్జన పరి చయము నలవఱచికొని జ్ఞాన సముపార్జనము గావించుకొను చుండెను. మొదటినుండియు నతనికి సంస్కృతాంధ్ర సాహి త్యములందును జ్యోతిషమునందు నభిమానము నభిరుచియు మెండుగ నుండెను. సహజముగ రసికుఁడగుటచే గోపాల కృష్ణుఁడు సాహిత్యమును శాస్త్ర దృష్టితో జూడక రస పక్ష పాతము వహించి రసికుని దృష్టితోనుపలక్షింపసాగెను.

"రసాత్మకమ్ వాక్యం కావ్యం" అను సూత్రమునసరించి కావ్యమునకు రసమే యాత్మయని తలఁచి యతఁడు సాహిత్య విధ్వంసకులగు సామాన్య విద్వాంసుల "డుకృఞ్ కరణే" మంత్ర ప్రభావమునకు లొంగక నిరంతర రసోపాసనఁ గావించుచుఁ గావ్యానందోపలబ్ధినిఁ బడయుచుండెను. దీనికిఁ దోడుగా నింగ్లాండులోనున్న కాలమున రసిక శిఖామణియు, సంగీత, సాహిత్య శిల్పాద్యనేక కళా మర్మకోవిదుండునగు 'నానంద కుమారస్వామి' పండితుని సావాసము రసాధిష్ఠాని దేవతయొక్క సంపూర్ణ స్వరూపమును గోచరింపఁ జేసెను. సంగీత సాహిత్య చిత్ర శిల్పాది వివిధ కళలకుఁ గల పరస్పర సంబంధమును గుఱుతింపనిది సాహిత్య రసమును దనివిదీఱ నాస్వాదించుటకు వలనుపడదని యానందకుమార పండితుఁ డతనికిఁ దార్కాణ సహితముగ నిరూపించి యనుభవైక వేద్యముఁగావించెను. అందుచే నతఁడు రస పిపాసియై రస నిష్యందినులగు శ్రీమద్భారత భాగవత గీతగోవిందాద్యుత్తమ కావ్యముల నిరంతరము పఠించి రసాస్వాదనముఁ జేయుచు నిత్యానందోపలబ్ధిని బడయుచుండెను.

' నాదబ్రహ్మోపాసకుఁడగు గోపాలకృష్ణుఁడు చిన్న తనమునుండియే శారీర సంపత్తిగలవాఁడగుట సంగీతమును జక్కగా నభ్యసించి మిత్రులయెదుట ననేక సభాంతరాళముల శ్రావ్య గానము సల్పుచు నమందానంద మొదవించుచుండెను. సృష్టికెల్లను మూలము నాదరూపమగు నోంకారమే యనియు నోంకారతత్వముఁ దెలిసినవానికి సర్వ వేదాంత శాస్త్రము లును సర్వ మీమాంస శాస్త్రములును గరతలామలకము

లగుననియు నతఁడు నమ్మించుఁ దన ముక్తికి నాదరూపమగు నోంకారపరబ్రహ్మోపాసనమే ప్రధాన సాధనమని గుఱుతించెను. అభ్యస్త గానవిద్యా పారీణుఁడగు గోపాలకృష్ణుఁడు సహజ గాత్ర మాధురీ సంపదచేఁ దావిగల్గిన బంగరునాలె సంగీత విద్వాంసులలో సయితము మన్ననఁ గాంచుచుండెను.

నాదోపాసనచే శంకర నారాయణ విధులు దెలిసిరి ఓ మనసా
వేదాతీతములు వేదవిదులును నాదోపాసనచే శంకర నారాయణ
విధులు దెలిసిరి ఓ మనసా!

అను కృతియందు శ్రీ త్యాగరాజేంద్రుఁడు దెల్పిన భావమును గోపాలకృష్ణుడు మనమునఁ జక్కగ నలవఱిచికొని నిరతమును నాదోపాసనముచే నానందానుభూతి నందు చుండెను. ఒకొక్కప్పుడు అతడు మైమఱచి గీతగోవిందము లోని యేదేని యొక యష్టపదిని బాడునపుడు చుట్టుప్రక్కల నున్న మిత్రులకెల్ల నానందపారవశ్యమునఁ జైతన్య విలసనము గలుగుచుండెను. గోపాలకృష్ణుఁడు సంగీత సాహిత్య రసముల రెంటిని బాగుగా ననుభవించిన రసికుఁడగుటచే గీర్తనమును బాడునపుడు అందలి సాహిత్యమునకు సంబంధించిన భావము సంగీత ప్రభావముచేమఱుఁగునవడకుండ భావద్యోతకముగా బాడు చుండెను.పద్యముఁ జదువునపుడు పయినఁ జెప్పిన కారణము ననుసరించియే యతడు అర్థద్యోతనార్థముగంభీరనినాదయుతము లగు సంస్కృత సమాసములను బ్రస్తుతకాలపు నాటక సామా జికులనాలె ముక్కలు ముక్కలుగ - ఛిన్న భిన్నములు గావించి చదువకుండ సమాస గాంభీర్యము కుంటువడకుండు

రీతిని భావ గాంభీర్యమును గరఁగి పోసినరీతి సంమిళితముల గావించి మనోహారముగ గంభీరముగ రసపోషకముగఁ జదువుచుండెను. రాగము రంభయని సంగీత విద్వాంసులు పల్కు వచనముయొక్క సత్యము గోపాలకృష్ణుడు తన గాన విద్యా ప్రదర్శనమున సువ్యక్తముఁ గావించుచుండెను. రాగమే సంగీతమునకుఁ బ్రాణమనియు, నట్టి రాగము గాయకుని హృదయరాగము ననుసరించి యనుక్షణ భిన్న పరిణామముల దాల్చుననియు నందువలన రాగమునకు నిలుకడ యుండనేరదనియు, బ్రకృతి సౌందర్యముఁబోలెఁ బ్రవాహ గమనమురీతి నాకాశవర్ణ వైచిత్ర్యములభాతి ననుక్షణము మారుపొందుచుండుననియు, నందుచే నొకరాగము గాయకుని చిత్తవృత్తిని హృదయరాగమును ననుసరించి యనేకములగు నితర రాగ చ్ఛాయలతోఁ గూడి యుండుననియు నట్టి యితర రాగ చ్ఛాయాసంమిళితములగు రాగాలాపనములను రాగ సాంకర్య మనుట సంగీత రహస్య విజ్ఞానశూన్యత యగుననియు, నతఁడు వాదముచేతను, రాగాలాపన ప్రదర్శనముచేతను, సిద్ధాంతీకరింపుచుండెను. అతఁడు కళ్యాణి రాగమును కేదారగౌళమును బిలహరి వరాళి రాగములను నెంతయో మనోరంజకములుగఁ బాడును. ఒకొక్కప్పుడు అతఁడు ఆనందపారవశ్యమునఁ గళ్యాణీ రాగాలాపనమును జేయుచుఁ గిన్నరీగాన ఫణితిని గాంధర్వ విద్యానైపుణిని మఱి పింపజేయును. గీత గోవిందములోని "ప్రవిశరాధే! మాధవ సమీపం, కురు, మురారే మంగళశతాని" మంజుతర కుంజ తలకేళి సదనే ఇహవిలసరతి రభసహసితవదనే! విత్తబరము

వల్లి నవపల్లవఘనే! ఇహావిలసచిరమల సపీనజఘనే!" అను నష్టపదిని కళ్యాణీరాగమున సకలలోక కళ్యాణ ప్రదమగు ఘణితిని జంపెతాళమున నతడు పాడుచుండ వినుభాగ్యము నందినవారు అమితభాగ్యవంతులని యెన్నుదును. గీతగోవిందములోని

"ప్రియే! చారుశీలే! ప్రియే! చారుశీలే!
త్వమసి మమజీవనమ్, త్వమసిమమ భూషణం
త్వమసిమమ భవజలధిరత్నం ప్రియే! చారుశీలేప్రియే!

అను నష్టపదిని "హరిహరి హితాదరతయా సాగతా కుపితేవ" యను నష్టపదిని ముఖారిరాగమున నతడు పాడు నపుడు ఆ గీతములయందలి భావము మందారమకరంద మాధురీ నిష్యందన మగుచుండెను. చైతన్య చ్యుతిని గల్గింప గల పూరి కళ్యాణిరాగమున "క్షణమధునా నారాయణ మను గతమనుసరరాధే!" యను గీతగోవిందములోనియష్ట పదిని నతడు పాడునపుడు నా హృదయముగూడ క్షణ మధునా! నారాయణ మనుగత మనుసర! యని నన్ను త్వరపెట్టసాగెను. అంత భావపోషకముగను, గంభీరముగను మధుర మధురముగను గీత గోవిందాష్ట పదులను బాడిన గాయకుని నే నెచ్చటను గనివిని యుండనైతిని. గీతగోవింద పఠనమతనిదే సొమ్ము. తొల్లింటి గోపాలకృష్ణుడు, సంచల దధర సుధామధురధ్వని ముఖరితమోహన వంశుడగుచు గోపికాజనముల కెట్లు బ్రహ్మానందమును గూర్చెనో యట్లే మన గోపాలకృష్ణుడును దన మిత్రకోటికిని దన పరిచయభాగ్య మునందిన యితర జనులకును మహదానందమును నొదవ

జేయుచుండెను. నిజముగ నాలోచించిచూడ నొక్కొక్కపుడు నామది కత డే కబీరుదాసువలెనో యే చండీదాసువలెనో యే త్యాగరాజువలెనో హరినామకీర్తనముఁ గావించుచు నుండఁ దగినవాఁ డీరాజకీయ సంకుల సమర సంకమున నిమగ్నుఁడగుట గానవిద్య యొక్కయు, గాయకకోటి యొక్కయు, భక్తజనముల యొక్కయు దురదృష్టమేయని తోఁచుచుండెడిది. కాని భగవన్నిర్మాణమున నతఁడు రాజ సమరమున నాయకత్వమును వహింపవలసి యుండెను. ఎన్నటికేని దిరిగివచ్చి యడఁడు తన గానవిద్యా ప్రభావముచే నాంధ్రమహాలోకము నానంద పరవశముగఁ జేయకపోడు.

గోపాలకృష్ణుఁడు తన రసికతను, గానవిద్యా నైపుణ్యమును, శ్రీరామ భక్తిని రాజకీయోద్యమమున బాగుగ నుపయోగించెను. రసికుడగుటచే వివిధజనుల చిత్తవృత్తులను, అధికార్యనధికార తారతమ్యమును, గుఱుతించి సమయమున కును పాత్రమునకును ననుకూలములగు పద్ధతులనుబోధించుచు నుద్యమము కొనసాగించుచుండెను. పిల్లికిని, పిచుకకును, బియ్యమునకును నొకే మంత్రము నుపయోగించు కొందఱు ప్రస్తుత రాజకీయ నాయకులవలె గాక యతఁడు దేశ కాల పాత్రములకు దగినట్లుగ సమయానుకూలములగు పద్ధతుల నవలంబించుచు జనులలో దేశాభిమానమును, జాతీయభావమును పెంపొందింపసాగెను. విద్వాంసులకు పండిత పద్ధతిని, పామరులకు గ్రామ్య పద్ధతిని నతఁడు జాతీయభావమును, బోధించుచుండెను. నయమున లాలింపుచు, భయమున బెదరించుచు, ఆశల బురికొల్పుచు దేశసేవకై జనుల నతఁడు

ప్రోత్సహింపజొచ్చెను. ఈ సమయానుకూలములగు పద్ధతుల వలననే యతడు పండిత సముదాయముతోకూడిన యాంధ్ర మహాసభలయందును, లాభాపేక్షకులగు వర్తకశ్రేష్ఠుల తోడను బీదలును పామరులును నగు జాండ్ర కులజుల తోడను గూడికొనిన చీరాల పేరాల గ్రామములయందును నొకేవిధమగు ప్రజానురాగమును ఖ్యాతియును, విజయమును గడింపగలైను. అతనిశక్తి సర్వతోముఖమై పండితపామర జనరంజకమై యొప్పెను. అతనిశక్తి కీర్తిజెందిన యసూయాపరులగు ప్రత్యర్థులతనిని మారీచతంత్రజుడనిరి. మిత్రులతని నఘటనఘటనా సమర్థుడని కొనియాడజొచ్చిరి. ఆట్టి సమర్థుడు గావుననే చీరాల మహాసంగ్రామము నంత చాకచక్యముతో నడిపి మహాత్మ్యనంత వానిచే నమితమగు పొగడ గాంచెను.

అతని యుపన్యాస ధోరణి యప్రతిమానము. ఆంధ్రలోక మట్టి మహోపన్యాసకుని చాలకాలము క్రిందటినుండి యెఱింగియుండదు. ఇంక జాలకాలము వరకునుగూడ నట్టివాడు పుట్టబోడని నా నమ్మకము. అతని యుపన్యాసము హరికథాకాలక్షేపము వోలె, పురాణశ్రవణము వోలె, నాటక ప్రదర్శనమువోలె సకల పండితపామర జనామోద జనకమై యొప్పుచుండును. అతని గాత్ర మమితగంభీర నిస్వనమై, మేఘురవమును, సింహగర్జనమును, సముద్ర ఘోషమును బోలుచు నెంతమందికైనను పరిస్ఫుటముగ వినిపించును. ప్రప్రథమమున నతడు శ్రీరామభక్తు డగుటంజేసి రామకథా ప్రశంసాపూర్వకముగ నాందీ పాఠము గావించును. ఉత్తమ

కావ్యములయందలి శ్రీరామ ప్రశంసాశ్లోక రత్నముల నతడు సభాజనులపై విరివిగ విరజల్లును. అట్టి శ్లోకములలో

శ్లో॥ కళ్యాణానాం నిధానం కలిమల దహనం జీవనం జీవనానాం
పాథేయం యన్ముముక్షో స్సపది పరపద ప్రాప్తయే ప్రస్థితస్యాఃం
విశ్రామస్థానమే కంకావివరవచసా పావనం పావనానాం
బీజం ధర్మద్రుమస్య ప్రభవతు భవతాం భూతయే రామనామ॥

యను నామాంతరము కలదనియు వర్ణించుట యతని హాస్యరస ప్రతిపాదనమునకు బ్రబల దారార్ఢ్యమగుచున్నది. ఇక ప్రత్యర్థుల నపహాస్యముచేయుచో నొకప్పుడు కఠినముగ గూడమాట్లాడును. స్వరాజ్యోద్యమ ప్రతికూలురగు జస్టిస్ వర్గ బ్రాహ్మణేతరుల నపహాస్యము జేయుచు "పండుగాని పండు విభూతిపండు, కట్టగాని కట్టు జోలకర్ర, పూవుగాని పూవు, జాతిగాని జాతి నాకబ్రాహ్మణ జాతి" యని బ్రహ్మ విద్వేషమును సూచించు బ్రాహ్మణేతర పద ప్రయోజనమును ఖండించిన విధమును, నాయకులకును, వినాయకులకును గల భేదమును సూచించుటయు, పోలీసు విలేఖకులను చిత్రగుప్తునితో బోల్చుటయు, వారి సంక్షిప్త లేఖనమును (Short hand writing)ను సంగీతములోని స్వరకల్పనముతో బోల్చుటయు నతని వాఙ్మూలముల వాడితనమును ననుభూతము జేయగలవు.

అతని సాహసమును వర్ణించుట యనవసర ప్రసంగమే యగును. ఆంధ్రులలో రోష వేషములకై నిలువబడినవారిలో

నెల్ల నతడు ప్రముఖుడును ప్రథముడునైయున్నాడు. ప్రాణము
లోయినను గోపాలకృష్ణుడు శత్రువునకు జంకి యెఱుంగడు.
అతని యప్రతిమాన సాహసమే యతని కింత ఖ్యాతియు,
చీరాల పేరాల పౌరులకింత దీక్షాశక్తియు గూర్చినది. మిన్ను
విఱిగి తలపై బడినను గూడ నతడు వెఱచి యెఱుంగడు.
విచారణలు జరుగు సమయమునను గూడ నతడు చలింపక
మందహాసముతో నొప్పుచుండెను. ఇతని సాహసమును
హాస్యరసభరిత స్వభావమును దిలకించిన నాకు రాబర్ట్ బరన్స్
(Robert Burns) అను స్కాటిష్ కవీశ్వరుడు వ్రాసిన

Sae rantingly sae wantonly
Sae hauntingly gaed he
He played a Spring and danced a round
Beneath the gallows tree"

అను పద్యమున వర్ణింపబడినట్టియు నురికంబము
చుట్టును పాట బాడుచు గంతులువైచుకొడగినట్టియు మొక్క
ర్సనను స్కాట్లండు దేశ వీరుడు స్మరణకు వచ్చుచున్నాడు.
స్కాట్లండు దేశములో విద్యాభ్యాసము గావించి వచ్చిన
యతని కావీరుని గుణ గణము లబ్బురములో నాశ్చర్య మేమి
కలదు? తనయొక్కయు చీరాల, పేరాల వీరులయొక్కయు,
పట్టుదలయు, రోషమును, అభిమానమును వర్ణించు
చుండెడివాడు.

మిత్రులయెడను బందుగుల యెడను గోపాలకృష్ణున కమితానురాగము కలదు. తన్ను బెంచి పెద్దవానిజేసి తనకై గోపాలకృష్ణ స్మరణముజేయు పితామహులను చేతులార మన్న జేయుట దక్క తనకేమియు కోరిక లేదనియు తన జాతకమున సన్యాసము లిఖింపబడియున్నదనియు గోపాల కృష్ణుడు మొన్న బందరు విచారణకేగునపుడు రైలులో నాత్మో నుడివెను. ఆభాగ్యమతని కబ్బనున్నదో లేదో దైవము నకు మాత్రమే యెఱుక! విద్యార్థులనిన నతని కమిత ప్రేమము. గాయకులనినను, కవీశ్వరులనినను, నతనికి బ్రహ్మానందమే!

కీ. శే. బసవరాజు అప్పారావుగారు

జననం 13__12__1894 నిర్యాణం 10__6__33

జననమూ, బాల్యమూ :

కృష్ణాజిల్లా విజయవాడ దగ్గర పటమట గ్రామంలో
మేనమామలగు గోవిందరాజుల వారింట్లో
తండ్రి : పిచ్చయ్యగారు తల్లి : వెంకమ్మగారు

విద్యాభ్యాసం :

బెజవాడ C.M.S. (ఇప్పటి గాంధీజీ మ్యునిసిపల్) హైస్కూలులో 1912లో
స్కూలుఫైనల్ పరీక్షలో ఉత్తీర్ణత. చెన్నపురి ప్రెసిడెన్సీ కాలేజీలో
1916 లో బి. ఏ. పట్టభద్రత.

వివాహం :

మేనమామ కుమార్తె శ్రీమతి రాజ్యలక్ష్మమ్మగారితో.

ఉద్యోగం :

కొంతకాలం ఆంధ్ర పత్రికకూ, మరికొంతకాలం భారతికిని
సహాయ సంపాదకత్వం.

వాయవాదవృత్తి :

1926లో బి. యల్. డిగ్రీ పొంది 27లో బెజవాడలో ప్రాక్టీసు ప్రారంభం.

తిరిగి ఉద్యోగ ప్రయత్నం :

1932 లో పత్రికా సంపాదకత్వంకోసం ఢిల్లీ ప్రయాణం.
అక్కడ అకస్మాత్తుగా మనోవైకల్యం.

మరణం :

తిరిగి బెజవాడ - అక్కడనుంచి బెజవాడ దగ్గర కుమ్మమూరు గ్రామంలో
చికిత్స - కొద్దిరోజులకే మృతి.

వీరి యితర రచనలు :

కావ్యాలు : వాయు సందేశము (అముద్రితము)
సెలయేటి గానము (ముద్రితము)

గ్రంథాలు : ఆంధ్రకవిత్వ చరిత్ర (ముద్రితము)
అరేబియన్ నైట్సు కథలు (అముద్రితము)
ఆంధ్రరత్న గోపాలకృష్ణుని జీవితము (ముద్రి

Blank Page

09318

Check List

Book Number	CP03J 112	Date	3/06/20
Front Cover	Yes	Back Cover	Yes
Blank Pages	CP VIII/ 449		
Missing Pages	NO		
Prepared	Lakshmi	Scanned	K. Akshaya
PS		Pages	163